ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



శ్రీ పొట్టి శ్రీరాములు

నెల్లూరు

సోమవారం 28 ఆగస్టు 2017 | 16



ఎస్పీ కార్యాలయంలోకి వెళుతున్న ఎమ్మెల్యే కోటంరెడ్డి

బెంగుళూరు బ్యాంకు ఖాతా

నాది కాదు

- రెండోసారి విచారణలో రూరల్ ఎమ్మెల్యే
- సిటీ ఎమ్మెల్యే అనిల్‌తో మరో రోజు
- ఆర్థిక లావాదేవీలపైనే ఆరా
- బ్యాంకు ఖాతాల్లో నగదు జమపై వివరాల సేకరణ
- అనుమానం ఉన్న వాటిపైనే ప్రశ్నలు
- పక్కా ఆధారాలతోనే కార్యాచరణ
- గంటన్నరపాటు విచారణ
- వైసీపీ ఎమ్మెల్యేలపై కుట్ర : రూరల్ ఎమ్మెల్యే

8 లో..

జిల్లాలో బెట్టింగ్‌లు, బుకీల వ్యవహారంపై పోలీసులు దూకుడు పెంచారు. ఇటీవల తొలి దశ విచారణ ముగిశాక ఆదివారం రెండో విడత విచారణ జరిగింది. ఈ మేరకు ఇద్దరు ఎమ్మెల్యేలను విచారణకు ఆహ్వానించినా, రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి ఒక్కరినే విచారించారు. సిటీ ఎమ్మెల్యే ముఖ్య అనుచరుడు రూపుకుమార్‌యాదవ్‌ను విచారించిన తరువాతే సిటీ ఎమ్మెల్యే అనిల్‌ను విచారించాలని పోలీసులు భావిస్తున్నారు. కృష్ణసింగ్ ద్వారా జరిగిన ఆర్థిక లావాదేవీలపైనే ఈ విచారణలో ఆరా తీశారు. బ్యాంకు ఖాతాల్లో జమ అయిన సొమ్ము వివరాలను ఇప్పటికే సేకరించిన పోలీసులు మరింత క్లారిటీ కోసం కొన్ని ప్రశ్నలను ఎమ్మెల్యేల ముందు ఉంచి వివరాలు రాబట్టారు. పక్కా ఆధారాలతోనే ప్రణాళిక రూపొందించి కార్యాచరణకు సిద్ధమయ్యారు. కోటంరెడ్డిని గంటన్నరపాటు విచారించగా, ఆయనకు బెంగుళూరులో ఉన్న బ్యాంకు ఖాతాలపైనే ప్రశ్నల పరంపర సాగింది. ఇది వైసీపీ ఎమ్మెల్యేలపై రాజకీయ కుట్రగా అభివర్ణిస్తూ సీఎం చంద్రబాబుపై ఎమ్మెల్యే కోటంరెడ్డి పలు ఆరోపణలు గుప్పించారు.

ఎవరి ఖర్చులు

వారివే..

నుడాకు మంజూరు కాని నిధులు

నత్తనడకన కార్యాలయ ఏర్పాట్లు

11వ పేజీలో

ఉత్తర కాలువ

పూర్తయ్యేదెప్పుడు..?

- వివరాలు 7లో



మర్రిపాడు మండలంలో ఇస్కపల్లి రిజర్వాయర్‌కు సంబంధించి జరుగుతున్న సోమశిల హైలెవల్ కెనాల్ పనులు

తెలుగు గంగ ప్రాజెక్ట్(టీజీపీ) పరిధిలో ఇన్నాళ్లూ ఒక చిన్న సమస్యను పరిష్కరించాలన్నా ఏళ్ల తరబడి సమయం పట్టేది. దీంతో అటు రైతులు, ప్రజలతో పాటు ఇటు ఆయకట్టు రైతులకు కూడా న్యాయం జరిగేది కాదు. నెల్లూరు, రాపూరు, ఆత్మకూరు సర్కిళ్లలోని పలు పనులు అసంపూర్తిగా మిగిలిపోయి ఉన్నాయి. అయితే ఇప్పుడు అసంపూర్తిగా ఉన్న పనులు కదులుతున్నాయి. ఉన్నతాధికారులు పూర్తి స్థాయి దృష్టి పెట్టడంతో పనులు వేగం పుంజుకుంటున్నాయి.

వేగంగా పనులు

- భూసేకరణ, పునరావాసం, పరిహారంపై ప్రత్యేక దృష్టి
- సోమశిల హైలెవల్ కెనాల్ భూసేకరణ సమస్యకు మూడు ప్రత్యేక టీంలు
- నేటి నుంచి ముగ్గురు డీటీల ఆధ్వర్యంలో పరిశీలన
- అత్యవసరమైన 400 ఎకరాలను కొలిక్కితెచ్చే ప్రయత్నం
- 70 వేల ఎకరాల ఆయకట్టుకు లబ్ధి

8 లో..



వాకాడు వద్ద సముద్రంలో నిమజ్జనం చేస్తున్న గణపతి ప్రతిమ

బైబై

వినాయకా..

- వేడుకగా నిమజ్జనం
- బాణసంచా పేల్చి యువత కేరింతలు
- ఉత్సాహంగా ఊరేగింపు

9

వినాయక నిమజ్జనంలో

అపశ్రుతి

- విద్యుదాఘాతంతో ఇద్దరు యువకుల దుర్మరణం
- మరో ఇద్దరికి తీవ్ర గాయాలు
- మృతులిద్దరూ అన్నదమ్ముల పిల్లలే
- బుచ్చిలో బాణసంచా పేలి పలువురికి గాయాలు

6



పిచ్చుక యువకృష్ణ మృతదేహం



పిచ్చుక శ్రీనివాసులు మృతదేహం



నృత్యాలు చేస్తున్న కేరళ మహిళలు

వైభవంగా ఓనం

సంగీత, నృత్యాలతో సంప్రదాయబద్ధంగా వేడుక

కేరళది గొప్ప సంస్కృతి : సంపూర్ణేష్ బాబు

చిత్తూరు, కడప జిల్లాల మలయాళీల హాజరు

- వివరాలు 16లో..

ప్రయోగ వేదికపైకి

పీఎస్ఎల్వీ-సీ39

- నేడు రిహార్సల్స్ ● రేపు ఎంఆర్ఆర్, ల్యాబ్ సమావేశాలు
- ఎల్లుండి మధ్యాహ్నం 1.59కి కౌంట్‌డౌన్ ప్రారంభం
- 29 గంటలపాటు కొనసాగించి 31వ సాయంత్రం ప్రయోగం
- ఐఆర్ఎన్ఎస్ఎస్-1హెచ్ ఉపగ్రహం కక్ష్యలోకి చేరవేత

- వివరాలు మెయిన్‌లో..

కవిత్వం సామాజిక సృజన



కవిత్వం ఒక సృజన.. ఆస్వాదన.. మెజారిటీ అభిప్రాయానికి అనుగుణంగా సాగేది కాదు.. అవి రెండు వ్యక్తిగతమైనవి. కవిత్వమనేది కవికి, పాఠకులకు మధ్య జరిగే ప్రత్యేకమైన సంభాషణ. సమాజా నికి, కవి సంఘర్షణకి జరిగే అంతర్యుద్ధం. వీరిలో ఎవరి అనుభవం వారిది. కవిలో ప్రతిభ, నిజాయతీ ఉన్నంత వరకు అవి ఎప్పుడో ఎక్కడో ప్రజలను పలకరిస్తూనే ఉంటాయి. ఆ నమ్మకమే కవిని, కవిత్వాన్ని బతికిస్తూ ఉంది. సమాజానికి ఊపిరి పోస్తూ ఉంది. ప్రజలను చైతన్య పరుస్తుందంటారు ప్రముఖ కవయిత్రి, ఉపాధ్యాయరాలు పాటూరి అన్నపూర్ణ. రచయిత్రిగా, కవయిత్రిగా స్త్రీవాద ఉద్యమకారిణిగా వివిధ రంగాలలో కృషి చేస్తూ ప్రభుత్వ ఉపాధ్యాయుడిగా కూడా ఎన్నో పురస్కారాలు అందుకున్నారు ఆమె. ఆమె కలానిది ప్రత్యేకమైన శైలి. తనది ప్రత్యేకమైన బాణి అంటూ నాలుగు దశాబ్దాలుగా సాహిత్యం వైపు వడివడిగా అడుగులు వేస్తున్న పాటూరి అన్నపూర్ణ అనుభవాలు ఆమె మాటల్లోనే..

- నెల్లూరు (సాంస్కృతిక ప్రతినిధి)

ఆదర్శం

● పాటూరి అన్నపూర్ణ

మా తాత తోయజరావు. వారు బొబ్బిలి జమీందారు వద్ద పని చేసేవారు. నేను కూడా మా అమ్మమ్మ వాళ్ల ఊరు బొబ్బిలిలోనే జన్మించా. అమ్మ మాణికమ్మ, నాన్న నరసింహారావు. మా నాన్నవాళ్లది బాపట్ల. ఏడో తరగతి వరకు బాపట్లలోనే చదువుకున్నా. ఎనిమిది నుంచి నెల్లూరు సీఏఎంలో చదువుకున్నా. మా నాన్న ఉద్యోగరీత్యా నెల్లూరులోనే స్థిరపడ్డా. ఇంటర్, డిగ్రీ కూడా నెల్లూరు డీకేడబ్ల్యూ కళాశాలలో పూర్తి చేశా. అప్పుడే వివాహమైనందున మా వారు ఉద్యోగరీత్యా హైదరాబాద్ వెళ్లారు. ఆ తరువాత డీఎస్సీ సెలక్షన్స్‌లో ప్రభుత్వ టీచర్‌గా ఉద్యోగం రావడం, పల్లెపాడు డైట్ కళాశాలలో చేరి దాదాపుగా 30 ఏళ్లకు పైగా ప్రభుత్వ ఉద్యోగిగా పని చేస్తూ కృషి చేస్తూ వచ్చే జనవరిలో పదవీ విరమణ చేస్తున్నా.

● సాహిత్యం వైపు..

చిన్న తనం నుంచి పుస్తకాలు చదవటం బాగా అలవాటు. బహుశా మా తాత గారి ప్రేరణ కావచ్చు. ఎందుకంటే ఇంట్లో ఎప్పుడూ పుస్తకాలు నిండుగా ఉండేవి. అలా మా అమ్మ, నాన్న కూడా పుస్తక ప్రియులు. అదే అలవాటుగా మా ఇంట్లో అందరికి పుస్తక పఠనం పట్ల ఆసక్తి పెరిగింది. తరగతిలో కన్నా ఈ పుస్తకాల అధ్యయనమే భాష పట్ల, సాహిత్యం పట్ల చంధస్సు, వ్యాకరణం పట్ల మంచి అవగాహన వచ్చింది. హైదరాబాద్‌లో ఉన్నప్పుడు ఈ పుస్తకాలు చదవటం అలవాటు వలనే అప్పట్లో కవిత్వం ఎక్కువగా రాసే అలవాటు అయింది. అప్పట్లో ప్రముఖ వారపత్రికలో ఐదు కవితలు వరుసగా ప్రచురణ కావటం, ఆ తరువాత ఆంధ్రప్రభలో కథలు ప్రచురణ కావటం, నాకు ఒక గుర్తింపు రావటమే కాకుండా ఆత్మవిశ్వాసం పెరిగింది. దానికి మించిన స్పందన ఉత్తరాల ద్వారా చాలా చూశా. మంచి రచనలు ప్రజల్లోకి పోతే మనకు గౌరవం, విలువ ఉంటుందనే విషయాన్ని గుర్తించా. అలా 20 ఏళ్ల వయసులో సాహిత్యం వైపు అడుగులు వేశా. ఆ తరువాత ప్రభుత్వ ఉద్యోగిగా పల్లెపాడులో ఉపాధ్యాయురాలిగా పని చేస్తున్నప్పుడు నా బాధ్యత మరింత పెరిగింది. కథలు పేరు కోసం కాదు.. కవితలు ప్రచురణ కోసం కాదు.. ఏదైన బాధ్యతగా రాయాలి సమాజానికి, ప్రజలకు ఉపయోగపడేలా రాయాలనే ధృక్పథంతో అలవడింది. అప్పటి నుంచే నా కవిత్వం దిశాదశ మారింది. దీనికితోడు పల్లెపాడులో విద్యార్థుల పరంగా పని చేయాల్సి రావటం, వారికి పాటలు, నాటికలు, రూపకాలు ఇలాంటి ప్రదర్శనలు రాసి వేయించటం వారిలో ఆసక్తి పెంపొందించేందుకు కృషి చేయటం అలవాటైంది.

● సామాజిక ఉద్యమాల్లో..

దీనికితోడు అప్పట్లోనే అక్షరాస్యత ఉద్యమం, సారా వ్యతిరేక ఉద్యమం, కాలుష్యం పర్యవేక్షణ ఇలాంటి అనేక ఉద్యమాలు వస్తున్నందు వలన విద్యార్థులను అందుకు సిద్ధం చేశా. దీనికి అంతటికి ఉపన్యాసాలు పనికి రావని పాటలు, గేయాలు, రూపాలతో వారిని ఆకట్టుకోవటమే కాకుండా వారి చేతనే అనేక గ్రామాల్లో ప్రదర్శనలు వేయించా. గ్రామాలలో ప్రజలను అవగాహన పెంపొందించా. అప్పటి నుంచి నా సాహిత్యం, కవిత్వం పత్రికలకు పరిమితమైనా అదొక్కటి గమ్యం కాదనే భావనతో విద్యార్థుల వైపు దృష్టి పెట్టా. వారిని సాహిత్యం వైపు చైతన్యపరుస్తూ వచ్చా. తెలుగుభాషా ఉద్యమ సమితిలో పని చేస్తూ దాదాపు 15 ఏళ్లుగా పద్యాలు, భాష, కవిత్వం వైపు విశేషమైన కృషి చేశా. దీంతో అనేక గ్రామాలు తిరిగి విస్తృతమైన ప్రచారం చేశా. దీంతో అప్పట్లో కలెక్టర్ రాంగోపాల్ వద్ద నుంచి ప్రత్యేక అభినందన పురస్కారం అందుకున్నా. ప్రగతిశీల ప్రజా వేదిక భావాలతో నెల్లూరు రచయితల సంఘాన్ని ఏర్పాటు చేశాం. దాదాపుగా 12 ఏళ్లు ఆ సంస్థ ద్వారా కృషి చేస్తూ పలువురు యువకులను కవిత్వం వైపు నడిపించి తెలుగుభాష మీద పట్టు సడలకుండా నిరంతరం కవి సమ్మేళనాలు, కాలేజీల్లో అవగాహన సదస్సులు , గ్రామాలలో తల్లిదండ్రులకు అవగాహన వంటి కార్యక్రమాలు నిరంతరం ఏర్పాటు చేశాం.

● అచ్చు అయిన పుస్తకాలు

ఇప్పటికి సాహిత్యం వైపు కృషి చేస్తున్నా . నా వంతుగా ఐదు కవితా సంపుటాలను వెలువరించా. అడవి ఉరేసుకుంది... నిశ్శబ్ధాన్ని వెతక్కు.... పెన్నాతీరం నాణీలు... మనసు పడి....హృదయ వేదన.... కవితా సంపుటాలను వెలుగు లోకి తీసుకువచ్చా. ఇందులో పలు సంపుటాలకు రమ్యభారతి, తెలుగు తేజం, డాక్టర్ కవితా స్మారక పురస్కారం లాంటి పలు రాష్ట్ర స్థాయి అవార్డులు అందుకున్నా. దీంతో పాటు 2012లో రాష్ట్ర ప్రభుత్వ ఉత్తమ ఉపాధ్యాయురాలుగా , అంతకు ముందే జిల్లాలో ఉత్తమ ఉపాధ్యాయులు గా అవార్డులు అందుకున్నాను. సాహిత్య పరంగా రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించే ఉగాది కవి సమ్మేళనంలో జిల్లా సాంస్కృతిక మండలి నిర్వహించే కవి సమ్మేళాలను నిర్వహించా. ప్రస్తుతం బీఈడీ కళాశాలలో ఉపాధ్యాయులుగా పని చేస్తున్నా నేను కవిత పరంగానే రాయటమే కాకుండా యువతలోకి తీసుకెళ్లాలని కవిత్వం నేటి యువతకు గొప్ప ఆయుధంగా నిలబడాలని ఆ దిశగా పయనించాలనే కృషి చేస్తున్నా. జిల్లాలోనే కాకుండా రాష్ట్రంలో ప్రగతిశీల ప్రజా భావాలతో నవ్యాంధ్ర రాష్ట్ర రచయితల సంఘానికి ప్రధాన కార్యదర్శిగా ఎన్నికయ్యా. ఇవన్నీ కూడా యువతను ప్రేరేపిస్తూ కవిత్వం వైపు నడిపించే దిశగా పయనించేందుకే సంసిద్ధులను చేస్తూ ముందుకు నడవటమే కర్తవ్యంగా, బాధ్యతగా తీసుకున్నా... అని ఆమె వివరించారు.



సంశోధన

డాక్టర్ సినారె సంస్మరణ సంచిక



కొత్త పుస్తకం

నెల్లూరు (సాంస్కృతిక ప్రతనిధి) : కవిత నా చిరునామా.. అంటూ కలం సాక్షిగా సార్ధక జీవనం సాగించిన కవి, వక్త విమర్శకుడు, పరిశోధకుడు, కీర్తి శిఖరాలను అందుకున్న ఘనుడు డాక్టర్ సీ నారాయణరెడ్డి. ఆమర మనల్ని విడిచి వెళ్లినా స్మృత్యంగా ప్రత్యేకంగా ఒక సంచికను వెలువరించడం సామాన్య విషయం కాదు. నెల్లూరుకు చెందిన ఆర్వీయస్ సుందరం, సీపీ బ్రౌన్ సేవా సమితి బెంగుళూరు సంస్థ పేరుతో దీన్ని గత జూలైలో విడుదల చేశారు. సినారె కీర్తికావడం అంటే ఒక తరం వెళ్లిపోయినట్లయింది. చివరి వరకు సాహిత్య పరంగా చైతన్య స్వరూపులై ఉండి అసంఖ్యాక జన సమూహానికి ప్రేరణ కలిగించిన మహనీయులు ఆయన. అలనాడు అన్నమయ్య, శ్రీనాథుడు, ఇటీవల కాలంలో విశ్వనాథ సత్యనారా యణ, సినారె లాంటి అరుదైన వ్యక్తులు మాత్రమే ఉన్నారు. తెలుగు వారి హృదయాలలో విశిష్ఠ స్థానాన్ని సంపాధించిన డాక్టర్ సినారెను సంస్మరిస్తూ వారి రచనల వివేచనను జోడించి 130 పేజీలతో ప్రముఖుల రచనలతో దీన్ని వెలువరించారు. రూ.100 ధర గల ఈ సంశోధనకు ఆర్వీఎస్ సుందరం 9844015759ను సంప్రదించి, పొందవచ్చు.

‘గిడుగు’ చిరస్మరణీయుడు

నెల్లూరు (సాంస్కృతిక ప్రతినిధి) : పెన్నా రచయితల సంఘం ఆధ్వర్యంలో ఆదివారం నెల్లూరులో తెలుగు మాతృభాషా దినోత్సవం ఘనంగా జరిగింది. పొదలకూరు రోడ్డులోని గిరిజన శాఖ బాలికల గురుకుల పాఠశాలలో ఈ వేడుకలు నిర్వహించారు. విద్యార్థినులకు తెలుగు భాష గొప్పతనంపై వక్తృత్వ పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. అనంతరం జరిగిన సదస్సులో విశ్రాంత తెలుగు అధ్యాపకుడు ఎం రమణయ్యను ఘనంగా సన్మానించారు. సభకు అధ్యక్షత వహించిన అవ్వారు శ్రీధర్‌బాబు మాట్లాడుతూ ప్రజల పలుకుబడులవైపు భాషకు తొలి అడుగులు వేయించిన మహనీయుడు గిడుగు రామ్మూర్తి అని కొనియాడారు. గిడుగు 125వ జయంతి సందర్భంగా మాతృభాషా దినోత్సవం జరుపుకోవడం ఆనందంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో గుండాల నరేంద్ర, మోపూరు పెంచల నరసింహం, గోవింద రాజుల సుభద్రాదేవి పాల్గొన్నారు.



రమణయ్యను సన్మానిస్తున్న రచయితలు

రేపు మాతృ భాషా దినోత్సవం

నెల్లూరు (సాంస్కృతిక ప్రతనిధి) : విక్రమ సింహపురి విశ్వవిద్యాలయంలో మంగళవారం గిడుగు రామ్మూర్తి 125వ జయంతి సందర్భంగా తెలుగు భాషా దినోత్సవం నిర్వహిస్తున్నట్లు తెలుగు శాఖాధిపతి డాక్టర్ జయప్రకాష్ తెలిపారు. సర్ సీవీ రామన్ సెమినార్ హాలులో ఉదయం 10గంటలకు ఉపకులపతి ఆచార్య వీరయ్య అధ్యక్షతన ఈ కార్యక్రమం జరుగుతుందన్నారు. ఆత్మీయ అతిథులుగా ఆచార్య ఎం చంద్రయ్య, ఆచార్య మేడిపల్లి రవికుమాకర్, ఈతకోట సుబ్బారావు, డాక్టర్ అందె ప్రసాద్ పాల్గొంటారన్నారు. అదేవిధంగా, పినాకిని యూత్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నెల్లూరు పురమందిరంలో మంగళవారం సాయంత్రం మాతృ భాషాదినోత్సవం జరుగుతుందని ఆ సంఘం నిర్వాహకుడు మురళీ మోహన్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వింజమూరు మస్తాన్ బాబు, చీదరాల చెన్నయ్య, ఆర్ గోపాల్‌రెడ్డి, ఏ సుబ్బారావును సన్మానిస్తునట్లు తెలిపారు.



ప్లాట్లు కొనబడును

కొత్తూరు వద్దగల వసుధ, విజయలక్ష్మి, పోలీస్ కాలనీ మరియు ఇస్కాన్ సిటి కావేరి, కొండాయపాళెం ప్రాంతంలోని కనుపర్తిపాడు వసుధ, విజయలక్ష్మి, ఆర్.కె., పడారుపల్లిలోని అన్ని లేఅవుట్ లోని ప్లాట్లు కొనబడును. **సంప్ర: 9989063239.**

AJR - 399547

TOLET

డైకస్‌రోడ్డు కావేరినగర్, 4వ వీధి సాయిబాబా గుడి పక్కన డబుల్ బెడ్‌రూమ్-1, సింగిల్ బెడ్‌రూమ్-2 ఇల్లులు బాడుగకు ఇవ్వబడును. **సం.ప్ర.:97002 02880.**

AJR-399757

PLOT FOR SALE

25% డిస్కౌంట్ రిటైర్డ్ ఎంప్లాయిస్ డాక్టర్స్, ఆఫీసర్స్‌కు మాత్రమే. NH5 మెయిన్ రోడ్డుకు ఫాంహౌస్‌లకు, స్కూల్స్, ఇళ్ళకు అనువైన ప్లాట్స్ NUDA స్పాట్ రి. తో కలవు. **సం.ప్ర.:83095 88817.**

AJR-399545

PLOT FOR SALE

90వేలకే ప్లాట్. ఇంటర్నేషనల్ స్టేడియం, నగరవనం, ఇండస్ట్రీయల్ పార్క్ అతి దగ్గరగా ప్లాట్స్ కలవు. స్పాట్ రిజిస్ట్రేషన్ EMI సౌకర్యం, ఈ నెల ఆఖరు వరకు మాత్రమే. **సం.ప్ర.:95539 52508.**

AJR-399807

ప్లాట్లు అమ్మబడును

అం. 30,000/-లకే విక్రమ సింహపురి యూనివర్సిటీ కాకుటూరు, NH5 కి దగ్గరలో ఇల్లు కట్టుకొనుటకు అనువైన ప్లాట్లు అమ్మబడును. స్పాట్ రిజిస్ట్రేషన్, రిజిస్ట్రేషన్ ఫ్రీ. **సం.ప్ర.: 77992 01651.**

AJR -386446

ఆకౌంటెంట్స్ కావలెను

■ "GST ఆన్‌లైన్ సాఫ్ట్‌వేర్ కొరకు" ఆకౌంటెంట్స్ & మార్కెటింగ్ ఎగ్జిక్యూటీవ్ కావలెను. మరియు వ్యాపారసంస్థలకు & అన్ని రకాల వ్యాపారస్థులకు ఇవ్వబడును. సెల్: **82976 40099, 70975 25709**

AJO-395456

మూలికా వైద్యం

☞ అంగస్థంబన లేకపోవడం, సెక్సులో ఎక్కువ సేపు చేయలేక పోవడం, అంగం లావుగా, ధృడంగా, బలంగా ఉండుటకు అద్భుతమైన వనమూలికా ఔషదం. వయస్సు పైబడిన వారు కూడా వాడవచ్చును. సెల్: **84650 56299**

AJB-398713

ఉద్యోగావకాశాలు

WANTED

➻ **అన్నపూర్ణ మ్యారేజెస్** నెల్లూరు బ్రాంచి ఆఫీస్ నందు ఆఫీస్ ఇన్‌చార్జిగా వర్క్ చేయుటకు స్త్రీ అభ్యర్థి కావలెను. Q: B.Tech/MBA/ Any PG. A-25పైన. లోకల్ వారికి ప్రాధాన్యత. Email : annapurnajobs555@gmail.com. సంప్ర॥ 9640633359

AJG-965

కార్తీక పౌర్ణమి యాత్ర

ప్రయాణం తే:31-10-17ది. దర్శించు క్షేత్రములు: నైమిశారిణ్యం, అయోధ్య, అలహాబాద్, త్రివేణిసంగం, ఆనందభవన్, యాదదేశ్వరి, కాశి. కాశి నందు 9రాత్రులు నిద్ర చేయుటకు సౌకర్యం కలదు. **సం.ప్ర.: S.T.ట్రావెల్స్ సెల్ : 9885853240.**

AJR-399755

ద్వారకా యాత్ర

ప్రయాణం తే:2-10-17ది. దర్శించు క్షేత్రములు: స్వామనాథ్(జ్యోతిర్లింగం), పోరుబందర్, మూల్‌ద్వారక, భేటిద్వారక, నాగేశ్వర్, ఉజ్జయని, ఓంకారేశ్వర్, మహంకాళి. 10రోజులు టూర్ అన్ని వసతులతో కలిపి టి.1కి. రూ.10,999/-. **సం.ప్ర.: S.T.ట్రావెల్స్ సెల్ : 9885853240.**

AJR-399756

క్యాండిల్స్

శ్రీనివాస క్యాండిల్స్ వారి అచ్చులు, మైనం లభించును. రోజుకు 700/- వరకు సంపాదించుకొనె అవకాశము కలదు. కోవూరు. సెల్: **79971 35959.**

AJR-386447

టైలరింగ్

మీకు టైలరింగ్ వచ్చా! అయితే మీ ఇంటివద్దనే వుంటూ నెలకు 10,000/- నుంచి 20వేలు సంపాదించుకొనే అవకాశం కల్పిస్తుంది మా ఫ్యాక్టరి. **సంప్ర : 9440640514, 0861-2330514.**

AJR -386322

LOANS

Govt / ప్రైవేట్ / డాక్టర్స్‌కు Net Salary-20వేలు ఆ పైన వారికి పర్సనల్ లోన్స్, హోమ్ లోన్స్, బిజినెస్ లోన్స్, టేక్ ఓవర్ లోన్స్ కొరకు సం.ప్ర.: వీనస్ సర్వీసెస్, నెల్లూరు. సెల్: **95815 41692.**

AJR-6870

బంగారు కొనబడును

బ్యాంకు, ఫైనాన్స్ కంపెనీలలో కుదువ పెట్టిన బంగారం విడిపించి కొనబడును. గ్రా॥ ధర రూ. 2,900/- వివరాలకు సంప్రదించండి : 97003 12403.

AJT - 5200

GOLD FINANCE

☞ **Govt. Regd. 100% Genuine** మీ బంగారం బ్యాంకుల నుండి తాకట్టులో ఉన్నవి విడిపించి ఈ రోజు మార్కెట్ ధర ప్రకారం కొనబడును. సెల్ : **96520 89999**

AJB-398664

GOLD FINANCE

☞ **బంగారం బ్యాంకులలో, ప్రైవేట్ సంస్థలలో** తాకట్టులో ఉన్నవి విడిపించి ఈ రోజు మార్కెట్ ధర ప్రకారం అధిక ధరకు కొనబడును. సెల్ : **81421 30517**

AJB-398654

పుట్టగొడుగుల పెంపకం (ఫ్రెష్ మష్రూమ్స్ డీలర్ షిప్)

➻ పుట్టగొడుగుల పెంపకం ద్వారా ఇంట్లో గంట పనిచేస్తూ 10,000/- ఆపై ఆదాయం. శిక్షణ ఇచ్చి పుట్టగొడుగులను మేము కొంటాము. మష్రూమ్స్ విత్తనాలు (స్పాన్) లభించును. ఫంక్షన్లకు, శుభకార్యాలకు ఫ్రెష్ మష్రూమ్స్ సప్లయ్ చేయబడును. **9966158007**

AJA-397517

JOB OPPORTUNITY

1.Relation Ship Manager No:1. Qlfy:Any Degree with english Fluency, attractive salary & Incentives. 2.Part time English Faculty No:2. Qlfy: Any Degree with Fluency & grammar knowledge. **Cont : 0861-2356777, 9347777756.**

AJR- Kishore Kumar-1

SPOKEN ENGLISH SIMPLIFIED

Medha Language Theatre starts a new batch on 28th Aug timing : 9 to 11 A.M & 6:30 to 8:30 P.M. Free Demo Classes are available. limited 30 seats LEARN AND LEAD THE WORLD. **Cont : 0861-2356777, 9347777756.**

AJR-Kishore Kumar

WORK FROM HOME

Daily 2-3 hours Earn extra income be your own boss. **Cont : 9440069234, 7981575779.**

AJR- 399806

WORK FOR HOME

Online Computer Jobs Just Typing Words Earn: 6000 to 15000/- P.M. Daily Payments. **Ph: 91003 58988 (NLR)**

AJR-399765

ఉద్యోగ అవకాశం

రైతు బిడ్డలకు శుభార్త : తమ ఊరిలోనే ఉంటూ W.H.O సర్టిఫైడ్ ఆర్గానిక్ గ్రోత్ బూస్టర్ (అన్ని రకముల పంటలకు బలం మందు) ప్రమోటర్స్ కావలెను. అర్హత : 8వ తరగతి ఆపైన జీతం: 8000 నుండి 16000+ TA. నెల్లూరు. **ఫోన్: 79010 86842, 94929 06842.**

AJR -399654

కావలెను

నెల్లూరులోని ఆఫీసు నందు పనిచేయుటకు స్త్రీ/ పు కావలెను. ఎటువంటి చదువు, అనుభవం, వయస్సు అవసరం లేదు. జీతం:15వేల నుండి 20వేలు. **సం.ప్ర.: 9502316019, 95022 76048.**

AJR -SR ads

కావేరి పుష్కరాల బస్సు యాత్ర

మా స్పెషల్ బస్ యాత్ర తే.11-09-2017ది. 8రోజులు. టి.1కి. రూ.7,550/-.రామేశ్వరం, మున్నార్, అలెప్పి, కొచ్చిన్, త్రివేండ్రమ్, శ్రీరంగం. 3రోజులు. 21-09-17 టి.1కి. రూ.3,200/- **సం.ప్ర.: బొబ్బల శేషయ్య. సెల్ : 9866527640.**

AJR -431

శ్రీ సమ్మక్క సారక్క జ్యోతిష్యాలయం

☞ **జరిగింది, జరగబోయేది, జరగబోతుంది, ప్రేమ, కోర్టు,** కుటుంబ ఏ సమస్యలు ఉన్న ముఖం చూసి జ్యోతిష్యం చెప్పబడును. సంప్ర. రాజు కోయదొర, సిరిమల్టీ ప్లెక్స్ ప్రక్కన, నెల్లూరు. సెల్ : **99599 23006**

AJB-0008

పాఠకులకు సూచన:

క్లాసిఫైడ్ ప్రకటనలకు స్పందించే ముందు పూర్తిగా విచారించి తగిన నిర్ణయం తీసుకోగలరు. ప్రకటనదారు ప్రకటిస్తున్న లేదా చేసుకుంటున్న క్లయిమ్‌లతో మా పత్రికకు ఎటువంటి సంబంధం లేదు. **బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్/డిపాజిట్ చేయవద్దు.** పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

- మేనేజర్

గొప్పనాయకుడిని కోల్పోయాం

చిట్టమూరు ఎంపీపీ అంత్యక్రియల్లో మంత్రి సోమిరెడ్డి

చిట్టమూరు : తెలుగుదేశంపార్టీలో ప్రజా అభిమానం కలిగిన గొప్ప నాయకుడు, చిట్టమూరు ఎంపీపీ ఉక్కు జనార్దన్‌ను కోల్పోవడం తీరనిలోటు అని వ్యవసాయ శాఖామంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి అన్నారు. మండలంలోని ఆరూరులో జరిగిన జనార్దన్ అంత్యక్రియల్లో ఆయన పాల్గొని నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన విలేఖర్లతో మాట్లాడుతూ పార్టీ అవిర్భావం నుంచి 30 ఏళ్ల రాజకీయ ప్రయాణంలో అలుపెరగని సేవలందించిన ఉక్కు జనార్దన్ మృతివార్త తనకు చాలా బాధకలిగించిందన్నారు. తెలుగుదేశం పార్టీ గొప్ప నాయకుడిని కోల్పోవడం జీర్ణించుకోలేకపోతున్నా మన్నారు. వారి కుటుంబసభ్యుల సహాయ సహకారాలతో వారిని నమ్ముకొన్న అభిమానులకు తాము వెన్నంటి కాపాడుకుంటామని అన్నారు. ఎమ్మెల్సీ, టీడీపీ జిల్లా అధ్యక్షుడు బీద రవిచంద్ర మాట్లాడుతూ ప్రభుత్వం చేపట్టే సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలతోపాటు సొంత నిధులతో ఎన్నో కార్యక్రమాలు చేపట్టిన ఉక్కు జనార్దన్ ప్రజల్లో చిరస్థాయిగా నిలిచిపోయారన్నారు. వారి కుటుంబ సభ్యులకు అండగా ఉండి జనార్ధన్ ఆశయాలను కొనసాగి స్తామన్నారు. గూడూరు ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్ మాట్లాడుతూ గూడూరు నియోజకవర్గంలో జనార్దన్ గొప్పనాయకుడని అటువంటి నేతను కోల్పోవడం బాధాకర మన్నారు. ప్రముఖ పారిశ్రామికవేత్త కొండేపాటి గంగా ప్రసాద్ మాట్లాడుతూ జనార్దన్ తన సొంత నిధులతో ఎన్నో కార్యక్రమాలు చేపట్టారని ఎంపీపీగా తన బాధ్యతను ఎక్కడ మరచిపోకుండా ఎనలేని సేవలు అందించారన్నారు. వారి కుటుంబసభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తున్నట్లు తెలిపారు.



మాట్లాడుతున్న మంత్రి సోమిరెడ్డి

ఈ సమా వేశంలో మాజీ మంత్రి పరసారత్నం, జడ్పీటీసీ దువ్వూరు భారతమ్మ, టీడీపీ నేతలు గూడూరు రఘునాథరెడ్డి, వాకాడు మనోజ్‌కుమార్‌రెడ్డి, నల్లపరెడ్డి జగన్‌మోహన్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

సోమశిలకు కొనసాగుతున్న వరద

అనంతసాగరం: సోమశిల జలాశయా నికి పైతట్టు ప్రాంతాల నుంచి వరద ప్రవాహం కొనసాగుతోంది. శనివారం సాయంత్రం దాదాపు 33 వేల క్యూసెక్కులన్న వరద ప్రవాహం ఆదివారం నాటికి తగ్గుముఖం పట్టినట్లు అధికారులు తెలిపారు. ప్రస్తుతం 23,601 క్యూసెక్కుల ప్రవాహం కొనసాగుతుండగా, సోమవారం సాయంత్రానికి వరద ఉధృతి తగ్గే అవకాశాలు ఉన్నట్లు అధికారులు భావిస్తున్నారు. జలాశయంలో నీటిమట్టం ప్రస్తుతం 11 టీఎంసీలకు చేరువగా ఉంది.

గణేష్ లడ్డూను దక్కించుకున్న ఎన్ఆర్ఐ

కావలి: కావలి ముసునూరులోని మహలక్ష్మమ్మ గుడి వద్ద ఏర్పాటు చేసిన గణేష్ విగ్రహం లడ్డూకు ఆదివారం జరిగిన వేలంలో అమెరికాలో ఉంటున్న బొట్లగుంట శ్రీహరినాయుడు కుమారుడు కిషోర్‌నాయుడు ఫ న్ ద్వారా రూ.51 వేలకు వేలం పాట పడి దక్కించుకున్నారు. ఆ లడ్డూను గణేష్ ఉత్సవ కమిటీ మేళ తాళాలతో ముసునూరులో ఉంటున్న కిషోర్‌నాయుడు తల్లిదండ్రులు శ్రీహరినాయుడు, జయలక్ష్మి దంపతులకు అప్పగించారు.



లడ్డూను ఊరేగిస్తున్నబొట్లగుంట శ్రీహరినాయుడు దంపతులు

రూ.98,216 పలికిన సపోట తోట గణేశ్ లడ్డూ

కావలికొత్త మసీదు కూడలిలో సపోట తోటలో ఏర్పాటు చేసిన గణేష్ లడ్డూను ఆదివారం జరిగిన వేలం పాటలో ఎం కిరణ్‌కుమార్‌రెడ్డి రూ. 98,216లకు పాడి దక్కించుకున్నారు. గణేష్ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో ఆ లడ్డూను కమిటీ మేళలాళాలతో కిరణ్ కుమార్‌రెడ్డికి అప్పగించారు. అలాగే పట్టణంలోని వైకుంఠపురంలో నాయుడు సైకిల్ షాపు వద్ద ఏర్పాటు చేసిన గణేష్ విగ్రహ లడ్డూను తూమాటి రమేష్ రూ. 50 వేలకు పాడి దక్కించుకున్నారు. ఆ లడ్డును కూడ ఉత్సవ కమిటీ మేళతాళాలతో ఆయనకు అప్పగించారు. పట్టణంలో పలు కూడళ్లలో ఆదివారం గణేశ విగ్రహాల వద్ద లడ్డూ వేలం నిర్వహించి అనంతరం యువత కేరింతలు, మేళతాళాలు, బాణ సంచా పేలుళ్లతో నిమజ్జనానికి తరలించారు. సముద్ర తీరం వద్ద నిమజ్జనానికి తరలి వచ్చిన వాహనాలతో రద్దీ ఏర్పడింది. పోలీసులు రాకపోకలకు అంతరాయం కలుగకుండా, ఆవాంఛనీయ ఘటనలకు తావు లేకుండా పక్కాగా బందోబస్తు నిర్వహించారు. తీరం వద్ద గజ ఈతగాళ్లను ముందస్తు చర్యగా ఏర్పాటు చేశారు.

కొలిక్కిరాని వరాహాల వివాదం

• పట్టణంలో పందుల స్వైరవిహారం • ఆందోళనలో ప్రజలు

కావలి(క్రైం): కావలిలో పందులను నిర్మూలించేదుకు మున్సిపల్ అధికారులు చేపడతున్న చర్యలను పెంపకం దారులు తీవ్రంగా ప్రతిఘటిస్తున్నారు. అధికారులు ఎన్ని చర్యలు చేపడుతున్నా పందుల స్వైరవిహారం ఆగడంలేదు. ఏ ప్రాంతంలో పందులను కాలుస్తున్నారో తెలుసుకొని పెంపకందారులు అక్కడ నుంచి ఇతర ప్రాంతాలకు వరాహాలను తరుముతున్నారు. మరికొంతమంది పగటిపూట పట్టణానికి దూరంగా ఉంచి రాత్రివేళల్లో పట్టణంలోకి వదిలివేస్తున్నారు పట్టణంలో పందులు పెంచేవారికి కొంతమంది వడ్డీవ్యాపారులు పెట్టుబడి పెట్టి వారితో లాభాలు పంచుకుంటున్నారన్న వాదన బలంగా వినిపిస్తోంది. కొంతమంది మున్సిపల్ ప్రజాప్రతినిధులు, ప్రజా సమస్యల కోసం పోరాటాలు చేసే కొన్ని రాజకీయపార్టీల నాయకుల అండదండలతో పెంపకందారులు అధికారుల ప్రయత్నాలకు అడ్డుతగులుతున్నారు. ఎటువంటి లాభాపేక్ష లేకుండానే వీరు పెంపకందారులను సమర్థిస్తున్నారా? అన్న ప్రశ్నకు సమాధానం లేదు. పట్టణంలో అధికారికంగా రెండు వేల పందులున్నాయని అధికారుల అంచనా వేశారు. అయితే ఇంతకు రెట్టింపు సంఖ్యలో పందులు పట్టణంలో తిరుగుతున్నాయి. యజమానులను భయపెట్టి వాటిని పట్టణం నుంచి తరిమివేసేందుకు మున్సిపల్ కమిషనర్ తలపెట్టిన కార్యక్రమంలో భాగంగా ఇప్పటి వరకు 500 పందులను కాల్చివేశారు. పందులను కాల్చి చంపకుండా వాటిని తరలించేదుకు మున్సిపల్ కమిషనర్ పొన్నూరు, బాపట్ల తదితర ప్రాంతాల నుంచి పందులను పట్టుకునే వారిని పిలిపించారు. అయితే ఈ కార్యక్రమాన్ని పెంపకందారులు ప్రతిఘటించారు. దేవర పెంచలమ్మ అనే మహిళ పందులను పట్టుకు వెళతున్నారని తెలిసి గుండెపోటుతో మరణించిందని, మహిళ మృతదేహాన్ని పందులు తరలించేందుకు ఏర్పాటుచేసిన మినీట్రక్ ఎదుట పడుకోబెట్టి ఆందోళనకు దిగారు. దీంతో ఈ కార్యక్రమానికి తెరపడింది.



పట్టణంలోని పాతూరులో తిరుగుతున్న పందులు

ప్రజలు సహకరించాలి



పట్టణ ప్రజలు సహకరిస్తే పందుల నిర్మూలన సులభమవుతుంది. ఇళ్ల మధ్య పందులను వదలవద్దని పెంపకందారులను ప్రజలు హెచ్చరించాలి. పందులు తిరుగుతున్న ప్రాంతాలను గురించి మున్సిపల్ అధికారులకు సమాచారం అందించాలి

- ఏ వెంకటేశ్వర్లు, మున్సిపల్ కమిషనర్

మరు ఏటికి మళ్లీ వస్తా..

• మందిరాలవద్ద అన్న సంతర్పణలు • లడ్డూ వేలం • నిమజ్జనానికి తరలిన గణేశ్ విగ్రహాలు • యువత కేరింతలు

కావలిటౌన్: గణేష్ ఉత్సవాల్లో భాగంగా మూడో రోజైన ఆదివారం తుమ్మలపెంట సముద్ర తీరానికి నిమజ్జనానికి తరలించారు. అనేక తాత్కాలిక మంటపాలలో భక్తులకు అన్నసంతర్పణ జరిగింది. లడ్డు వేలం పాట, ఊరేగింపు కార్యక్రమాలలో యువత ఉత్సాహం ఉరకలేసింది. ఆనాల వారివీధిలో ఏడో వార్సికోత్సవంలో బాగంగా అన్నసంతర్పణ చేశారు. ఉట్టికూరి శ్రీనివాసులు, రమాదేవి దంపతులు ఉభయకర్తలుగా వ్యవహరించారు. ముఖ్య అతిథిగా టీడీపీ పట్టణ కమిటీ అధ్యక్షుడు అమరా వేదగిరి పాల్గొన్నారు. చిత్తతూరివారి వీధిలో సాధు సోదరులు పర్యవేక్షణలో జరిగిన ఉత్సవాల్లో వేలం పాటలో రూ. 7,300లకు లడ్డును సోమిశెట్టి ప్రవీణ్ పాడుకున్నారు. ముఖ్య అతిథిగా స్థానిక కౌన్సిలర్ అమరా విజయలక్ష్మి, అమరా వేదగిరి దంపతులు పాల్గొన్నారు. జనతాపేట రామాలయం వద్ద ఉత్సవాల్లో టీడీపీ వాణిజ్య విభాగం జిల్లా అధ్యక్షుడు తటవర్తి వాసు యేగీశ్వరి దంపతులు రూ. 50 వేలకు లడ్డు వేలంలో పాడుకొని ఊరేగింపుగా తీసుకెళ్ళారు. కచ్చేరిమిట్టలో రూపాయ మిద్దె కూడలి, వెంగళరావునగర్, పాతూరు తదితర ప్రాంతాల్లో అన్నసంతర్పణలు చేశారు. పట్టణంలో సుమారు 200కు పైగా విగ్రహాలు నిమజ్జనానికి తరలివెళ్లాయి. పట్టణానికి పడమర వైపు ఉన్న జలదంకి, కలిగిరి, కొండాపురం మండలాలకు సంబంధించి అనేక గ్రామాల నుంచి వందలాది విగ్రహాలు కావలి మీదుగా తీరానికి తరలివెళ్లాయి. యువత రంగులు చల్లుకుంటూ బాణసంచా పేలుళ్ల మేళతాళాలు, డీజె సౌండ్ సిస్టమ్‌లతో గణపతి బప్ప మోరియా, గణేష్ మహరాజ్‌కే జై... అంటూ చేసిన నినాదాలు పట్టణాన్ని హోరెత్తించారు.

కావలిరూరల్: కావలి రూరల్ మండలం తుమ్మలపెంట, కొత్తసత్రం, చెన్నాయపాలెం సముద్రతీరంలో ఆదివారం వినాయక నిమజ్జన కార్యక్రమం నిర్వహించారు. కావలి పట్టణ, రూరల్ మండలాల గ్రామాలు, జలదంకి, కలిగిరి, కొండాపురం, వింజమూరు తదితర మండలాల నుంచి వాహనాల్లో వినాయక విగ్రహాలు సాగరతీరానికి తరలిరావడంతో తీరం గణనాథుల మయమైంది. పోలీసులు పర్యవేక్షణలో నిమజ్జన వేడుకలు కోలాహలంగా జరిగాయి. వినాయక చవితి పర్వదినం సందర్భంగా ఉట్టి కొట్టే కార్యక్రమాలు, లడ్డూ వేలం, సాంస్కృతిక కార్యక్రమాలు జరిగాయి. మూడోరోజు గణనాథుడిని పూలతో అలంకరించి ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. స్వామివారిని మేళ తాళాలు, డప్పుచప్పుళ్ళతో ప్రత్యేక వాహనాల్లో ఉంచి ఊరేగింపు నిర్వహించారు. అనంతరం పార్వతీ తనయుడిని నిమజ్జనానికి సాగరతీరానికి తరలించారు. డీఎస్పీ రాఘవరావు ఆధ్వర్యంలో రూరల్ సీఐ అశోక్‌వర్ధన్, రెండో పట్టణ సీఐ శ్రీనివాసరావు, రూరల్, జలదంకి ఎస్ఐలు పుల్లారావు, సుబ్బారావు, ఆంజనేయులు, ముగ్గురు ఏఎస్ఐలు, 25 మంది పోలీసు సిబ్బంది, మెరైన్ ఏఎస్ఐ, సిబ్బంది, 30 మంది గజ ఈతగాళ్లు, 15 మంది ఎన్‌సీసీ క్యాడెట్లు, వీఆర్‌వోలు, విద్యుత్ శాఖ అధికారులు నిమజ్జన కార్యక్రమాన్ని పర్యవేక్షించారు.



కావలి రూరల్ : నిమజ్జనానికి తరలుతున్న గణేశ్ విగ్రహాలు



కావలిలో అన్నదానం చేస్తున్న అమరా వేదగిరి దంపతులు



కావలిలో లడ్డూను ఊరేగిస్తున్న తటపర్తి వాసు దంపతులు



కావలి రూరల్: వైకుంఠపురంలో డప్పుల మోత



కొత్త సత్రం తీరంలో నిమజ్జనానికి తెస్తున్న విగ్రహం



కావలి రూరల్ : రెడ్డిపాలెంలో యువత హంగామా

టీఎన్ఎస్ఎఫ్ మండల అధ్యక్షుడిగా మహేష్

కావలిరూరల్: కావలి రూరల్ మండల టీఎన్ఎస్ఎఫ్ అధ్యక్షుడిగా మానం మహేష్ ఎన్నికయ్యారు. టీఎన్ఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు తిరుమల నాయుడు మహేష్‌ను ఎంపిక చేసినట్లు పార్టీ వర్గాలు తెలిపాయి. మండలంలోని చలంచర్లకు చెందిన మహేష్ గతంలో తెలుగు యువత గ్రామ అధ్యక్షుడిగా బాధ్యతలు నిర్వహించి టీఎన్ఎస్ఎఫ్ మండల అధ్యక్షుడిగా ఎన్నికవ్వడంపై పలువురు శుభాకాంక్షలు తెలిపారు. మహేష్ మాట్లాడుతూ తనకు పదవి వచ్చేందుకు సహకరించిన సీఆర్‌డీఏ సభ్యుడు బీద మస్తాన్‌రావుకు కృతజ్ఞతలు తెలిపారు.

దివ్యాంగుల వద్దకే ఆర్టీసీ సేవలు



దివ్యాంగులతో మాట్లాడుతున్న మాలేపాటి నాగేశ్వరరావు

బిట్రగుంట: దివ్యాంగులు ఆర్టీసీ రాయితీ పాస్‌ల కోసం కార్యాలయాలు చుట్టూ తిరిగి అవస్థలు పడుతున్న దృష్ట్యా రాష్ట్ర దివ్యాంగుల సేవా సంస్థ వ్యవస్థాపకుడు టీసీ మాల్యాద్రినాయుడు ఆధ్వర్యంలో దివ్యాంగుల వద్దకే ఆర్టీసీ సేవలు కార్యక్రమాన్ని చేపట్టారు. బోగోలు మండల ప్రజా పరిషత్ కార్యాలయ ఆవరణంలో మండల పరిధిలోని దివ్యాంగులకు ఆర్టీసీ రాయితీ పాస్‌లు 30 మందికి టీడీపీ కన్వీనర్ మాలేపాటి నాగేశ్వరరావు ద్వారా అందజేశారు. మాలేపాటి, కోవూరుపల్లి వైద్యశాల అభివృద్ధి కమిటీ చైర్మన్ పులికం శ్రీహరి రెడ్డి మాట్లాడుతూ అర్హులైన వారికి ట్రైసైకిళ్లు, చెవిటి యంత్రాలు, విద్యావంతులైన దివ్యాంగులకు ల్యాప్‌ట్యాప్‌లు అలాగే మహిళా దివ్యాంగులకు రుణాల ద్వారా ఉపాధి కల్పించే దిశగా చర్యలు చేపడుతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్టీసీ అసిస్టెంట్ మేనేజర్ బసవయ్యానాయుడు, ఎన్ఎంయూ కార్యదర్శి మస్తాన్, పాయశం శ్రీనివాసులు, బోగోలు గ్రామ కమిటీ ఉపాధ్యక్షుడు సంజయ్, భాగ్యలక్ష్మి, శ్రీనివాసయాదవ్, తదితరులు పాల్గొన్నారు.

నేడు దివ్యాంగులకు రాయితీ బస్‌పాసులు

జలదంకి: జలదంకి మండలంలోని దివ్యాంగులకు ఆర్టీసీ రాయితీ బస్ పాసులు స్థానిక ఆర్టీసీ బస్టాండ్‌లో సోమవారం అందజేయనున్నట్లు ఆర్టీసీ అసిస్టెంట్ మేనేజర్ డీవీ బసవయ్య ఒక ప్రకటనలో తెలిపారు. కావలి ఆర్టీసీ, దివ్యాంగుల సేవా సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో జరుగు ఈ కార్యక్రమంలో దివ్యాంగులు బస్‌పాస్సులు కోసం ఆధార్‌కార్డు సదరన్ జెరాక్స్, ఫుల్‌సైజు ఫొటో వెంట తీసుకుని రావాలని దివ్యాంగుల సేవా సంస్థ వ్యవస్థాక అధ్యక్షుడు టీసీ మాల్యాద్రి నాయుడు తెలిపారు. అలాగే వనితా కార్డు, క్యాట్ కార్డులు కూడ అందజేయనున్నట్లు అసిస్టెంట్ మేనేజర్ బసవయ్య తెలిపారు.

మిలీనియం మార్చ్‌కు తరలిరండి

కావలిటౌన్: కొత్త పింఛను విధానాన్ని రద్దు కోరుతూ సెప్టెంబర్ ఒకటిన విజయవాడలో చేపట్టనున్న మిలీనియం మార్చ్‌కు ఉపాధ్యాయులు, మద్దతుదారులు, అభిమానులు తరలిరావాలని యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి చలపతి శర్మ కోరారు. ఆదివారం రాజా వీధిలోని యూటీఎఫ్ కార్యాలయంలో మిలీనియం మార్చ్‌కు సంబంధించిన గోడ పత్రికను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా చలపతి శర్మ మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా 1,60,000 మంది 2004 నుంచి కొత్త పింఛను విధానం కింద పని చేస్తున్నారని, సీపీఎస్‌కు వ్యతిరేకంగా అనేక ఉద్యమాలు చేస్తున్నారని అందులో భాగంగా విజయవాడలో రాష్ట్రవ్యాప్తంగా ఉద్యోగ ఉపాధ్యాయులందరూ మిలీనియం మార్చ్ నిర్వహిస్తున్నారన్నారు. సీపీఎస్ విధానంతో ఉద్యోగ, ఉపాధ్యాయులు జీవిత భద్రతను కోల్పోతున్నాబరరర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కేంద్ర రాష్ట్రప్రభుత్వాలు వెంటనే స్పందించి సీపీఎస్ విధానాన్ని రద్దు చేసి పాత పింఛను విధానాన్ని అమలు చేయాలన్నారు. లేదంటే ఇదే తరహాలో ఉద్యమాన్ని ఉధృతం చేయాల్సి వస్తుందని ఆయన హెచ్చరించారు. ప్రభుత్వం ఈ విషయమ్మై సానుకూలంగా స్పందిస్తున్న ఆశాభావాన్ని ఆయన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో యూటీఎఫ్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



గోడపత్రికను ఆవిష్కరిస్తున్న యూటీఎఫ్ జిల్లా నేతలు



కలిగిరిలో వినాయక విగ్రహ నిమజ్జనంలో యువత సంబరాలు



జలదంకిలో నిమజ్జనోత్సవంలో పాల్గొనేందుకు వెళుతున్న మహిళలు

యువత కేరింతలు

అల్లూరు : మండలంలోని పలు గ్రామాలలో గణనాథుడి విగ్రహాలను మూడో రోజు అయిన ఆదివారం నిమజ్జనానికి తరలించారు. అల్లూరు కోనేరు ప్రాంతంలోని విగ్రహంతోపాటు పలు ప్రాంతాల్లోని గణపతులను నిమజ్జనానికి తరలించారు. యువకుల కేరింతలతో రంగులు చల్లుకుంటూ గణపతిని నీరు ఉన్న ప్రాంతానికి తీసుకెళ్లారు. అధికంగా ఇస్కపల్లి తీరప్రాంతంలోని సముద్రంలో నిమజ్జనం చేశారు.

యువత కేరింతలు

కలిగిరి: మండలంలో మూడు రోజులుగా ఊరూరా జరుగుతున్న చవితి సంబరాల్లో యువత కేరింతలు కొడుతోంది. అదివారం గణనాథుడి వామ హస్తంలో ఉంచిన లడ్డూ ప్రసాదాన్ని ఉత్సవ కమిటీ సభ్యులు వేలం వేశారు. పంచాయతీలోని పాపనముసిలిపాలెంలో రూ.16 వేలకుపైగా లడ్డూ ధర పలికింది. పలు చోట్ల గణనాథుడికి తప్పెట్లు, తాళాలతో గ్రామోత్సవం నిర్వహించారు. భక్తులు స్వామివారికి కాయ, కర్పూరం సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. ముఖ్యంగా యువతతోపాటు మహిళలు ఒకరిపై ఒకరు రంగులు చల్లుకుంటూ వసంతోత్సవంలో మునిగి తేలారు. అనంతరం గణనాథుడి విగ్రహాలను ట్రాక్టర్లు, ఆటోలపై రామాయపట్నం, తుమ్మలపెంట తదితర సముద్రతీరప్రాంతాలకు తరలించారు. నిమజ్జనం సందర్భంగా ముందు జాగ్రత్తగా కలిగిరి ఏఎస్ఐ రఘురామయ్య రాకపోకలను క్రమబద్దీకరించారు.

జలదంకి: చవితి వేడుకల్లో మూడో రోజు నిమర్జన కార్యక్రమం యువత కేరింతలతో ఉత్సాహంగా సాగింది. జలదంకి మండలంలోని 17 పంచాయతీల్లో ఏర్పాటు చేసిన విగ్రహాలను ఆదివారం నిమజ్జనం చేయడానికి తుమ్మలపెంట తీర ప్రాంతానికి తరలించారు. ఉదయం గ్రామాల్లో విగ్రహాలతో ఊరేగింపు జరిపి రంగులు చల్లుకుంటూ, బాణ సంచా పేలుస్తూ, తప్పెట్లు, తాళాలతో గ్రామాలు హోరెత్తాయి. ఇంటి ముందుకు వచ్చిన వినాయక విగ్రహాలను భక్తులు కాయ, కర్పూరం సమర్పించారు. నిమర్జన కార్యక్రమంలో మహిళల సైతం ఉత్సాహంగా పాల్గొన్నారు.

కొండాపురం: వినాయక చవితిని సందర్భంగా మండల పరిధిలోని పలు గ్రామాలలో ఏర్పాటుచేసిన గణేశ విగ్రహాలను మూడో రోజైన ఆదివారం నిమజ్జనానికి తరలించారు. మూడు రోజుల పాటు స్వామివారికి భక్తులు విశేష పూజలుచేసిన విగ్రహాలను ఆదివారం నిమజ్జనం చేశారు. కొండాపురం, పార్లపల్లి, నేకునాంపేట. సాయిపేట, పాత ఉప్పలూరు, తూర్పు ఎర్రబల్లి తదితర గ్రామాలలో గణేశ తాత్కాలిక విగ్రహాలు నిమజ్జనానికి తరలివెళ్లాయి. ముందుగా ఆయా గ్రామాలలో వినాయకుడికి లడ్డూ, పలు రకాల వస్తువులను వేలం వేయగా భక్తులు అధిక సంఖ్యలో పోటీపడి అధిక మొత్తానికి దక్కించుకున్నారు.



కావలి సాతానువారి వీధిలో
ఆకట్టుకుంటున్న రాక్‌స్టార్ గణేశుడు

బిట్రగుంట: వినాయక చవితి సందర్భంగా గ్రామాల్లో కొలువు తీరిన గణనాథులు ఆదివారం మూడో రోజు నిమజ్జనానికి బయలుదేరారు. మండలంలో బోగోలు ఆలయ ప్రాంగణంలో విజయగణపతి కమిటీ సభ్యులు, వ్యాపారస్తులు అన్నసంతర్పణ కార్యక్రమం చేపట్టారు. బోగోలు పాల సొసైటి ప్రాంగణంలో ఏర్పాటు చేసిన గణేశ్ లడ్డు ప్రసాదం మట్టెపు పరంధామయ్య రూ. 12,700లకు వేలంలో సొంతం చేసుకున్నారు. వినాయకుని గ్రామోత్సవంలో వీధుల్లో మేళతాళాలతో కోలాట భజన నృత్యాలు గణనాథుడి నామస్మరణ ఘనంగా జరిగింది. కొత్తూరులో నూతన రామాలయం వద్ద ఏర్పాటు చేసిన గణపతి లడ్డు ప్రసాదాన్ని రూ. 7,200లకు నాగేంద్రబాబు సొంతం చేసుకున్నారు. బోగోలు మండలం నుంచి 61 విగ్రహాలు, దగదర్తి, కలిగిరి, జలదంకి మండలాల నుంచి తాటిచెట్ల పాలెం తీరానికి నిమజ్జనానికి తరలాయి. ఉత్సవాల్లో విచిత్ర వేషధారణ, నృత్యాలు బాణసంచా పేలుళ్లతో కొనసాగింది. తీరంలో 100కుపైగా గణేశ్ విగ్రహాలు నిమజ్జనం చేశారు. పోలీసు, రెవెన్యూ పర్యవేక్షణలో నిమజ్జనం శాంతియుతంగా కొనసాగింది.

దగదర్తి: మండలంలో మూడు రోజుల పాటు పూజలు అందుకున్న బొజ్జగణనాథులు ఆదివారం నిమజ్జనానికి తరలారు. భారీ ఏర్పాట్లు, తప్పెట్లు, తాళ్యాలు, వివిధ వేషధారణలు, నృత్యాలు, యువత కేరింతల గణనాధుని నిమజ్జనం వైభవంగా జరిగింది. ఒక్కొక్కరు పోటీ పడి నిమజ్జన ఉత్సవాలు వైభవంగా నిర్వహించారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా దగదర్తి ఎస్ఐ విజయశ్రీనివాస్ తన సిబ్బందితో బందోబస్తు చర్యలు చేపట్టారు.



బిట్రగుంట : నిమజ్జన ఉత్సవంలో మహిళలు కోలాటం




నిమజ్జనోత్సవంలో గులాము చల్లుకున్న యువత

మూడు రోజుల్లో పెళ్లి...

- రోడ్డు ప్రమాదంలో యువకుడి దుర్మరణం
- పెళ్లింట విషాదఛాయలు

తడ : మరో మూడు రోజుల్లో పెళ్లి పీటలు ఎక్కాల్సిన వరుడు ప్రమాదవశాత్తు రోడ్డు ప్రమాదంలో దుర్మరణం పాలయ్యాడు. దీంతో ఇరు కుటుంబాల్లో విషాదఛాయలు అలుముకున్నాయి. వివరాలలోకి వెళితే.. చిత్తూరుజిల్లా వరదాయపాళెం మండలం కారిపాకం గ్రామానికి చెందిన కొండేటి బాలయ్య (24) కొండూరు గ్రామం వద్ద ఉన్న పాల డెయిరీలో పనిచేస్తున్నాడు. శనివారం అర్ధరాత్రి డెయిరీలో విధులు ముగించుకుని సూళ్లూరుపేటకు బైక్‌పై బయలుదేరాడు. మార్గ మధ్యలో కాదలూరు రోడ్డు వద్ద ఆగి ఉన్న లారీని వర్షం కారణంగా బాలయ్య గుర్తించలేక పోయాడు. దీంతో నేరుగా లారీ వెనుకభాగాన్ని ఢీకొన్నాడు. ఈ ప్రమాదంలో ముఖం సగభాగం వరకు నుజ్జునుజ్జయి బాలయ్య అక్కడికక్కడే మృతి చెందాడు. అర్ధరాత్రి కావడంతో సుమారు గంటసేపటి వరకు ఎవరూ గుర్తించలేకపోయారు. హైవే మొబైల్ పోలీసులు ప్రమాదాన్ని గుర్తించి బాలయ్య మృతదేహాన్ని సూళ్లూరుపేట ప్రభుత్వ ఆసుపత్రికి పోస్టుమార్టం నిమిత్తం తరలించారు. పంచనామా అనంతరం బాలయ్య మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అందించారు. తడ ఎస్సై వెంకటేశ్వరరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.


బాలయ్య (ఫైల్)

మూడు రోజుల్లో పెళ్లి..

మంగళవాయిద్యాలు మోగాల్సిన ఆ ఇంట చావుడప్పు మోగింది. కొండేటి బాలయ్యకు నాయుడుపేటకు చెందిన యువతితో 30వ తేదీ రాత్రి వివాహం చేసేందుకు పెద్దలు నిశ్చయించారు. ఆ మేరకు ఇరు కుటుంబాల వారు వివాహ ఏర్పాట్లలో మునిగి ఉన్నారు. మూడు రోజుల్లో వివాహం అనగా దురదృష్టవశాత్తు రోడ్డు ప్రమాదంలో వరుడు మృతి చెందటంతో ఇరు కుటుంబాలతో పాటు బంధువర్గం సైతం దిగ్భ్రాంతికి గురైంది. బాలయ్య తండ్రి పక్షవాతంతో బాధపడుతుండగా, తల్లి అనారోగ్యం పాలైఉంది. అతని తమ్ముడు కొద్ది నెలల క్రితం ప్రమాదంలో గాయపడి ఇంటి వద్దే ఉంటున్నాడు. ఆ కుటుంబానికి ఆసరాగా ఉన్న బాలయ్య మృతి చెందడంతో వారంతా కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు.

వినాయక నిమజ్జనంలో అపశ్రుతి

- ఇద్దరు మృతి
- మరో ఇద్దరికి తీవ్ర గాయాలు
- మృతి చెందిన ఇద్దరు అన్నదమ్ముల బిడ్డలు

తడ : పండగ సంబరం ఆ ఇంట్లో విషాదం నింపింది... వినాయక విగ్రహాన్ని నిమజ్జనానికి తీసుకువెళ్తూ విద్యుత్ షాక్‌కు గురై ఇద్దరు మృతి చెందగా.. మరో ఇద్దరికి గాయాలయ్యాయి. తడ మండలం అండగుండాల గ్రామంలో వినాయక చవితి ఉత్సవాలలో భాగంగా గ్రామంలో వినాయక విగ్రహాలు ప్రతిష్ఠించారు. మూడు రోజులపాటు సంబరాలను అంబరాన్ని అంటేలా చేసుకున్నారు. ఈ క్రమంలో ఆదివారం సాయంత్రం నిమజ్జనోత్సవానికి ఏర్పాట్లు చేశారు. ట్రాక్టర్‌పై విగ్రహాన్ని అందంగా అలంకరింపచేసి నిమజ్జనోత్సవానికి బయలుదేరారు. పిచ్చుక శ్రీనివాసులు (23), పిచ్చుక యువకృష్ణ (22), పిచ్చుక జయకృష్ణ (22), గుత్తి వినోద్ అలియాస్ చెంగలయ్య ట్రాక్టర్‌పై నిలబడి గణపతి బప్ప మోరియా అంటూ అరుస్తూ ఆ ఉత్సవంలో బయలుదేరారు. ఈ క్రమంలో గ్రామంలో 11 కేవీ విద్యుత్‌వైరు విగ్రహానికి అడ్డు తగలడంతో పిచ్చుక యువకృష్ణ దానిని తొలగించే ప్రయత్నంలో విద్యుత్ వైరును చేతితో పట్టుకున్నారు. దీంతో అతడికి విద్యుత్ సరఫరాకావడం ఆ పక్కనే ఉన్న శ్రీనివాసులు, జయకృష్ణ, వినోద్ అలియాస్ చెంగలయ్యలకు విద్యుత్‌షాక్ కొట్టడంతో అందరూ ట్రాక్టర్‌లోనే పడిపోయారు. ఈ ప్రమాదంలో శ్రీనివాసులు, యువకృష్ణ అక్కడికక్కడే మృతి చెందగా, మిగిలిన ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. అలాగే ట్రాక్టర్‌ను అంటిపెట్టుకొని నడుస్తున్న మరొకరికి సైతం విద్యుత్ షాక్ తగిలి అతను పక్కకు పడిపోయాడు. కాగా అతనికి గాయాలు కాలేదు. స్థానికులు సమాచారం మేర 108 సిబ్బంది నలుగురిని సూళ్లూరుపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. వైద్యులు ఇద్దరు మృతి చెందారని నిర్ధారించడంతో గ్రామస్థులు హడావుడిగా మృతదేహాలను గ్రామాలకు తీసుకువెళ్లిపోయారు. తీవ్రంగా గాయపడ్డ ఇద్దరికి ప్రథమ చికిత్సలు అందించి మెరుగైన చికిత్సల కోసం చెన్నైకు తరలించారు.

ఇద్దరు అన్నదమ్ముల బిడ్డలు :

విద్యుత్‌షాక్‌కు గురై మృతి చెందిన ఇద్దరు అన్నదమ్ముల బిడ్డలు కావడం, దాంతోపాటు వీరిద్దరు పక్క పక్క ఇళ్లవారు కావడంతో ఆ ప్రాంతం విషాదంలో మునిగిపోయింది. గాయపడ్డ జయకృష్ణ కూడా వారి కుటుంబీకుడే. దీంతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.


గాయపడ్డ జయకృష్ణ


గాయపడ్డ వినోద్

పురుగుమందు తాగి యువకుడి ఆత్మహత్య

కలిగిరి: మండలంలోని అయ్యపరెడ్డిపాళెంకు చెందిన పిట్టు సాయి(23) ఆదివారం పురుగుమందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. తండ్రి చనిపోవడంతో చదువు మధ్యలో ఆపివేసిన సాయి కొంతకాలం హైదరాబాదు జీహెచ్‌ఎంసీలో కార్మికుడిగా పనిచేశాడు. అనంతరం హనుమకొండపాలెంలోని అమ్మమ్మ, తాతగారి పాలడెయిరీ పనుల్లో చేదోడువాదోడుగా ఉంటున్నాడు. వినాయకచవితి సందర్భంగా స్వగ్రామమైన అయ్యపరెడ్డిపాలెంలో వేకువజాము వరకు ఉత్సవాల్లో పాల్గొన్నాడు. అనంతరం డెయిరీలో పనిముగించుకొని తిరిగివస్తానని స్నేహితులకు చెప్పి హనుమకొండపాలెం వెళ్లాడు. ఈ క్రమంలో పాడిపశువలవద్ద పనిముగించుకొని తిరిగి వెళుతున్న సాయిని పశువులకు మేతకోసి వెళ్లమని తాత చెప్పాడు. దీంతో ఆగ్రహించిన సాయి డెయిరీ సమీపంలోనే ఉన్న పొలంలోకి ఆవేశంగా వెంట పురుగుమందు డబ్బా తీసుకొని మార్గమధ్యలో తాగాడు. బాధ భరించలేక పెద్దగా కేకలు వేయడంతో డెయిరీవద్ద ఉన్న కుటుంబసభ్యులు గమనించి 108కి సమాచారమందించి ఆటోలో కలిగిరి సాయిని తరలించారు. మార్గమధ్యంలో ఆటొనుంచి 108 వాహనంలో సాయిని మార్చారు. సాయిని పరీక్షించిన వైద్యాధికారి అప్పటికే అతడు మృతి చెందాడని నిర్ధారించాడు. అయితే ఇటీవల సాయి పెద్దమ్మ కుమారుడు పరీక్షలో తప్పడం వలన కుటుంబ సభ్యులు మందలించడంతో వారిని బెదిరించడానికి పురుగు మందు తాగాడు. అదే కోవలో సాయి కూడా బెదిరించడానికి పురుగు మందు తాగి ఉంటాడని, మోతాదు ఎక్కువ కావడంతో మృతి చెంది ఉంటాడని స్థానికులు అంటున్నారు. ఈ విషయమై పోలీసు సిబ్బందిని వివరణ కోరగా తమకు ఇప్పటి వరకూ ఎలాంటి సమాచారం లేదని, కేసు నమోదు చేసి విచారిస్తామన్నారు.

రోడ్డు ప్రమాదంలో గుర్తుతెలియని మహిళ మృతి

కొడవలూరు: రాచర్లపాడు జాతీయ రహదారిపై గుర్తుతెలియని మహిళ రోడ్డు ప్రమాదానికి గురై మృతి చెందిన సంఘటన ఆదివారం వేకువజామున చోటు చేసుకొంది. ఎస్సై అంజిరెడ్డి కథనం మేరకు రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన మహిళ రాచర్లపాడు,రేగడచెలిక గ్రామాలలో భిక్షాటన చేస్తూ ఉండేదని చెప్పారు. ఆదివారం వేకువజామున ఆమెను గుర్తుతెలియని వాహనం ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందిదని అన్నారు.

నీటిగుంతలో పడి ఇంటర్ విద్యార్థి మృతి

దొరవారిసత్రం: దొరవారిసత్రం మండలం గొల్లపాళెం గ్రామంలో ఆదివారం నీటి గుంతలో జారిపడి ఇంటర్ విద్యార్థి సన్నుకూరు సాయి(16) మృతి చెందాడు. రవి కుమారుడైన సాయి నెల్లూరు శ్రీచైతన్యలో ఇంటర్ ఫస్ట్ ఇయర్ చదువుతున్నాడు. వినాయక చవితి సెలవులకు స్వగ్రామం విచ్చేశాడు. గ్రామం ముందు ఉన్న చెరువులోకి వెళ్లిన సాయి ప్రమాదవశాత్తు పడిపోయాడు. ఈత రానీ విద్యార్థి గుంతలో మునిగి పోవడంతో స్థానికులు గుర్తించి బటయకు తీసి హుటాహుటిన సూళ్లూరుపేట ఆసుపత్రికి తరలించారు. అయితే అప్పటికే విద్యార్థి మృతి చెందినట్లు గుర్తించారు. నీటిగుంతలో పడిన విద్యార్థిని వెంటనే గుర్తించి బయటకు తీయడంలో కొంత ఆలస్యం చోటుచేసుకో వడంతో ప్రాణాలు కోల్పోయినట్లు తెలుస్తుంది. విద్యార్థి మృతితో ఆ గ్రామంలో తీవ్ర విషాదం నెలకొంది.

యువకుడి ఆత్మహత్య

వింజమూరు: అప్పులు తీర్చలేక పురుగుమందు తాగి ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల మేరకు.. పాతూరుకు చెందిన జీ.శ్రీనివాసులు(32) చీటీలు నిర్వహించేవాడు. ఒకరికి తెలియకుండా ఒకరి వద్ద భారీగా అప్పులు చేశాడు. ఇటీవల రుణ దాతల వత్తిడి అధికం కావడంతో, శనివారం అర్ధరాత్రి పురుగుమందు తాగాడు. విషయం గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే స్థానిక ప్రైవేటు వైద్యశాలకు తరలించారు. మెరుగైన వైద్యం కోసం ఆత్మకూరు తరలించగా అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. అప్పులు తీర్చలేక పురుగుమందు తాగి ఓ యువకు డు ఆత్మహత్య చేసుకున్నాడు. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల మేరకు.. పాతూరుకు చెందిన జీ.శ్రీనివాసులు(32) చీటీలు నిర్వహించేవాడు. ఒకరికి తెలియకుండా ఒకరి వద్ద భారీగా అప్పులు చేశాడు. ఇటీవల రుణ దాతల వత్తిడి అధికం కావడంతో, శనివారం అర్ధరాత్రి పురుగు మందు తాగాడు. విషయం గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే స్థానిక ప్రైవేటు వైద్యశాలకు తరలించారు. మెరుగైన వైద్యం కోసం ఆత్మకూరు తరలించగా అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు.

విద్యుత్ షాక్‌తో యువకుడి మృతి

సిద్ధిగుంటపాళెం(వాకాడు): వాకాడు మండలంలోని సిద్ధిగుంట పాళెం గ్రామంలో ఓ బాలుడు విద్యుత్ షాక్‌కు గురై మృతిచెందాడు. దీంతో ఆ గ్రామంలో విషాదం నెలకొంది. స్థాని కుల కథనం మేరకు.. వినాయక చవితి వేడుకల్లో శనివారం రెండవ రోజు కావడంతో రాత్రి యువకులు ఆనందో త్సాహాలతో పండుగ వేడుకల్లో నిమగ్న మయ్యారు. ఇంతలో వర్షం కురవ డంతో అందరూ ఎవరి ఇళ్లకు వారు పరుగెత్తారు. ఈ క్రమంలో పేర్నాటి వెంకయ్య(17) ఇంటికి పరిగెట్టే క్రమంలో కాలుజారి పక్కనే ఏర్పాటు చేసిన సీరియల్ సెట్‌ను పట్టుకోవడంతో షాక్‌కు గురయ్యాడు. వెంటనే చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. అప్పటికే అతడు మృతిచెందాడని వైద్యులు నిర్ధారించారు. రమణయ్య-ఆదిలక్ష్మి దంపతులకు ఏకైక కుమారుడు వెంకయ్య. తండ్రి రమణయ్య పదేళ్ల క్రితం రోడ్డు ప్రమాదంలో మృతిచెందాడు. దీంతో వెంకయ్య ఓ కొయ్యల మిల్లులో కూలిపనులకు వెళ్లి తల్లికి చేదోడువాదోడుగా ఉండేవాడు. ఈ క్రమంలో కుమారుడు మృతి చెందడం తో ఆ తల్లి కన్నీరుమున్నీరుగా విలపించింది.


మృతుడు వెంకయ్య (ఫైల్)

గణేష్ నిమజ్జనంలో పలువురికి గాయాలు

- బాణసంచాపేలి బెంబేలెత్తిన భక్తులు
- ఓ చిన్నారికి తీవ్ర గాయాలు

బుచ్చిరెడ్డిపాళెంరూరల్ : జొన్నవాడ బ్రిడ్జిమీద ఆదివారం జరిగిన ఓ గణేష్ విగ్రహం నిమజ్జనంలో అపశృతి చోటు చేసుకుంది. ఆదివారం సాయంత్రం నిమజ్జనానికి వచ్చిన ఓ వ్యక్తి మద్యం మత్తులో నిర్లక్ష్యంగా బాణసంచా కాల్చడంతో ఆ నిప్పురవ్వలు ఆకాశచువ్వల కట్టకు అంటుకుని ఒక్కసారిగా పెద్దశబ్ధంతో పేలింది. దీంతో ఓ చిన్నారికి ముఖం కాలి గాయాలుకాగా, నిమజ్జనం చూసేందుకు వచ్చిన మరో 15ఏళ్ల బాలుడి కాలుకు తీవ్రగాయమైంది. ఆరుమంది మహిళల చీరలకు మంటలు అంటుకున్నాయి. దీంతో ఒక్కసారిగా భక్తులు పరుగులు తీశారు. దీంతో బ్రిడ్జిమీద రెండువైపులా అరగంటకుపైగా ట్రాఫిక్ ఆగిపోయింది. దీంతో పలువురు ప్రయాణీకులు బ్రిడ్జి పక్కనే ఉన్న పెట్రోలుబంకులో బాధితులకు ప్రథమ చికిత్సలు నిర్వహించి ఆసుపత్రికి తరలించారు.

బైక్ ఢీకొని యువకుడి దుర్మరణం

బుచ్చిరెడ్డిపాళెంరూరల్ : రోడ్డు ప్రమాదంలో బైక్ ఢీకొని ఓ గిరిజనుడు మృతి చెందిన సంఘటన ఆదివారం రాత్రి రేబాల వద్ద నెల్లూరు-ముంబాయి హైవేపై చోటుచేసుకుంది. అమ్మోరుతోపునకు చెందిన గిరిజనుడు నరసింహ(30) రేబాల సమీపంలోని రొయ్యల గుంటల వద్ద కాపలా నిమిత్తం భార్యాపిల్లలతో నెల్లూరు- ముంబాయి హైవేపై నడచి వస్తుండగా రేబాల వద్దకు వచ్చే సరికి ఎదురుగా వస్తున్న ఎఫ్‌జడ్ ఏపీ 26 బీఆర్, 3929 నెంబరుగల బైక్ ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందాడు, కాగా బైక్‌పై వున్న ఇద్దరు యువకులకు తీవ్రగాయాలయ్యాయి. వీరిని చికిత్స నిమిత్తం స్థానికులు ఆటోలో నెల్లూరు తరలించారు. కళ్లముందే భర్త ప్రమాదానికి గురై అక్కడికక్కడే మృతి చెందడంతో కుటుంబ సభ్యులు రోదనలు మిన్నంటాయి.



● నత్తనడకన సోమశిల ఆధునికీకరణ

● నాణ్యతా ప్రమాణాలు గాలికి..

● కొరవడిన పర్యవేక్షణ

పనులు మందగమనం

అనంతసాగరం: సోమశిల జలాశయం పరిధిలో సాగుతున్న పనులు మందగమ నంలో సాగుతున్నాయి. నాణ్యతా ప్రమాణాలు కూడా అంతంతమాత్రంగానే ఉన్నాయని అన్నదాతలు ఆరోపిస్తున్నారు. దీనికితోడు అధికారుల పర్యవేక్షణ కొరవడింది.

● నత్తనడకన పనులు

సోమశిల ఉత్తర కాలువ ఆధునికీకణ లో భాగంగా కాలువ నీటి సామర్థ్యం పెంపొందించేందుకు నిపుణుల కమిటి మేరకు ఆరేళ్ల క్రితం డిజైన్ చేశారు. ఆ దిశగా పనులు చేపట్టేందుకు ప్రభుత్వం 11, 32, 96 ప్యాకేజీ కింద కోట్ల నిధులు మంజూరు చేశారు. అయితే పనులు ఇంకా నత్తనడకన సాగుతున్నాయి.



12వ కిలోమీటరు వద్ద దెబ్బతిన్న లైనింగ్

● కాలువ డిజైనింగ్ ఇలా..

తొలుత ఉత్తర కాలువ పొడవు 72.92 కి లో మీటర్లుగా పనులు చేశారు. కాలువ పరిధిలో భూములకు నీటిపారుదల 380 క్యూసెక్కులు ప్రవాహం జరిగేలా 9.14 మీటర్ల వెడల్పుతో పనులు పూర్తి చేశారు. కాలువను ఆధునికీకరణ చేసే దిశగా ఉత్తర కాలువ పొడిగింపు చేపట్టారు. 72.93 కిలోమీటర్ల నుంచి ప్రకాశం జిల్లా రాళ్లపాడు రిజర్వాయర్ వరకు 106 కిలో మీటర్ల కాలువ పనులు చేపడుతున్నారు. 380 క్యూసెక్కుల నుంచి 750 క్యూసెక్కుల ప్రవాహం జరిగేలా గత ప్రభుత్వంలో డిజైన్ చేయగా, వివిధ ప్యాకేజీలతో ఉత్తర కాలువ వెంబడి అభివృద్ధి పనులు చేపడుతున్నారు. ఉన్న కాలువను వెడల్పు చేయడం, అడుగు భాగం, కాలువకు ఇరువైపుల కాంక్రీటు పనులు చేపట్టారు. 2011లో ఈ పనులు ప్రారంభమైనా ఇంత వరకు పూర్తి స్థాయిలో పనులు జరగలేదు.

● అంతంత మాత్రంగా నాణ్యతా ప్రమాణాలు

సోమశిల ఉత్తర కాలువ ఆధునికీకరణ పనుల్లో పర్యవేక్షణ లేకపోవడంతో నాణ్యతాప్రమాణాలు అంతంతమాత్రంగా ఉన్నాయని ఆయకట్టు వాపోతున్నారు. అనంతసాగరం మండలంలోని పాతాళపల్లి వద్ద 12వ కిలోమీటరు సమీపంలో ఒక వైపు కాలువ లైనింగ్ పనులు దెబ్బతిని ఉన్నాయి. ఆ ప్రాంతంలో ఇసుకబస్తాలు వేసి గండిని పూడ్చారు. అయితే కాలువకు ఒక వైపు తూము ఏర్పాటు చేసి ఉండగా ఆ దిశగా అక్కడ పనులు చేయకుండా లైనింగ్ పనులు చేశారు. దీంతో లైనింగ్ దెబ్బతిందని రైతులు ఆరోపిస్తున్నారు. నాణ్యతా ప్రమాణాలు పాటించకపోవడం వల్లనే కాలువ లైనింగ్ పనులు దెబ్బతింటున్నాయని పలువురు ఆరోపిస్తున్నారు.

పనులు మా పరిధిలో లేవు

ఉత్తరకాలువ పనులు మా పరిధిలో లేవు. సబ్ డివిజన్ల వారీగా పనులు కేటాయించాం. సంబంధిత అధికారుల పర్యవేక్షణలో పనులు జరుగుతున్నాయి.

-ఎస్వీ రావు,
ఈఈ, సోమశిల జలాశయం

నత్తనడకన పనులు

సోమశిల ఉత్తరకాలువ పనులు చాలా కాలంగా జరుగుతున్నాయి. పూర్తి చేసే దిశగా చర్యలు తీసుకోవడం లేదు. సోమశిలలో నీరు సంవృద్ధిగా ఉన్న సమయంలో కూడా రెండో పంట వేసుకోలేని పరిస్థితి. ఇకనైనా పనులు పూర్తి చేయాలి.

- కొమ్మి తిరుపతినాయుడు, బీజేపీ మండల అధ్యక్షుడు, అనంతసాగరం

వైద్య సేవలు మెరుగు పరచండి

● నిర్లక్ష్యానికి శిక్ష తప్పదు

● ఆరోగ్య శాఖ డైరెక్టర్ అరుణ

● ముఖ్యమంత్రి ఆరోగ్య కేంద్రాల ఆకస్మిక తనిఖీ

నెల్లూరు (వైద్యం) : ముఖ్యమంత్రి ఆరోగ్య కేంద్రాల్లో వైద్య సేవలు మెరుగుపరచాలని, విధి నిర్వహణలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని ఆరోగ్యశాఖ రాష్ట్ర డైరెక్టర్ డాక్టర్ అరుణకుమారి వైద్యులు, సిబ్బందిని హెచ్చరించారు. నెల్లూరులోని ముఖ్యమంత్రి ఆరోగ్య కేంద్రాలను ఆమె ఆదివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆయా ఆసుపత్రులలో అందిస్తున్న వైద్య సేవలు, సిబ్బంది పనితీరు, ఓపీ తదితర సేవలను పరిశీలించారు. పడారుపల్లి, కిసాన్‌నగర్, ఎన్టీఆర్ నగర్ ఆరోగ్య కేంద్రాలను తనిఖీలు జరిపారు. ఆసుపత్రికి వచ్చే రోగుల సంఖ్య పెంచాలని సూచించారు. వైద్యులు, సిబ్బంది సమయపాలన పాటించాలని, వ్యాధి నిర్ధారణ పరీక్షలు సక్రమంగా చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ వరసుందరం, కార్పొరేటర్ మామిడాల మధు తదితరులు పాల్గొన్నారు.

ఉత్తర కాలువ పూర్తయ్యేదెప్పుడు..?



నిర్మాణంలో ఉన్న సోమశిల ఉత్తరకాలువ

కొండాపురం: సోమశిల ఉత్తరకాలువ నిర్మాణం పూర్తయితే కొండాపురం మండలంలో పలు గ్రామాలకు ఎంతో మేలు జరుగుతుంది. ఈ కాలువ చింతలదేవి గ్రామం వద్ద ఉప్పుటేరులో కలపడం వలన పరిసర ప్రాంతాల మెట్టభూములను మాగాణి భూములుగా మార్చుకునేందుకు అవకాశం ఉంది. కాలువ తవ్వకం వలన భూములు నష్టపోతున్న రైతులకు నష్టపరిహారం అందించటంలో ప్రభుత్వం నిర్లక్ష్యధోరణిని విడనాడాల్సి ఉంది.

● ఎప్పటికీ పూర్తయ్యేను...?

కాలువ మంజూరుకు తీవ్ర కృషి చేసిన కావలి మాజీ ఎమ్మెల్యే గొట్టిపాటి కొండపనాయుడు పేరుతో అధికారికంగా కాలువకు గొట్టిపాటి కొండపనాయుడు కాలువ పేరు పెట్టారు. నిర్మాణ పనులు ప్రారంభమయ్యి 28 ఏళ్లు కావస్తున్నా ఇప్పటికి 70 శాతం వరకు పనులు పూర్తయ్యాయి. కాలువ తవ్వకం ద్వారా భూములు నష్టపోతున్న రైతులకు పరిహారం చెల్లించే విషయంలో అధికారులకు ప్రభుత్వ స్పష్టత ఇవ్వలేదని బాధిత రైతులు అంటున్నారు. దీంతో కాలువ పనులు జరగనివ్వకుండా రైతులు అడ్డుకున్నారు. ఈవిషయంపై ఉదయగిరి నియోజకవర్గ ఎమ్మెల్యే బొల్లినేని వెంకటరామారావు, భూములు కోల్పోతున్న రైతుల వద్దకు వెళ్లి న్యాయం చేస్తామని చెప్పారు.

కాలువపూర్తయి రాళ్లపాడు రిజర్వాయరుకు నీరు విడుదలయితే ప్రతి ఏటా 25 వేల ఎకరాలు పంటలు పండుతాయి. అంతేగాక కాలువలో నీటిద్వారా ఆనుకొని ఉన్న మెట్లభూములు సుమారు 2 వేల ఎకరాలలో పలురకాల పంటలు సాగుచేసుకోవచ్చు. ఇంతటి ప్రాముఖ్యత కలిగిన ఈ కాలువ నిర్మాణంపట్ల ప్రభుత్వం చిన్నచూపుచూడడాన్ని రైతులు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు.

గతంలోనే భూముల సేకరణ

కాలువ నిర్మాణానికి భూముల సేకరణ 2009 లోనే పూర్తయ్యింది. అప్పటి ఆర్డీవో చింతలదేవి గ్రామంలో 44మంది రైతులకు రూ 27.72 లక్షల నగదును చెల్లించబోగా, వారు తీసుకోలేదు. దీంతో ఆ నగదును ావలి కోర్టులో చెల్లించారు.

- దేశ్‌నాయక్, సోమశిల ఈఈ

పక్షం రోజుల్లో పరిహారం



ఎమ్మెల్యే బొల్లినేని 19 కోట్లు మంజూరు చేయించారు. నష్టపరిహారం చెల్లించే విషయంపై రైతుల అభ్యంతరాలను బొల్లినేని దృష్టికి తీసుకువెళ్లగా ఇప్పుడున్న ప్లానుప్రకారం పరిహారం చెల్లించేందుకు ప్రతిపాదనలు ప్రభుత్వానికి పంపారు. మరో 15 రోజుల్లో పరిహారం రైతులకు అందుతుంది.

- బొట్లగుంట హరిబాబు, మండల టీడీపీ అధ్యక్షుడు

ఎవరూ స్పష్టత ఇవ్వడంలేదు



గ్రామంలోని ఉప్పుటేరుపై నిర్మంచిన పికప్‌వ్యాయర్‌తో సుమారు 70 ఎకరాల సాగు భూమి మనకకు గురయ్యింది. నిర్మాణం పూర్తయి 5 నెలలు గడిచినప్పటికీ ఒక్కపైసా పరిహారం రైతులకు అందలేదు. పరహారం వెంటనే విడుదలచేసి ఆదుకోవాలి.

- ఉప్పలూరు మస్తాన్, రైతు, ఉప్పలూరు

పరిహారం వెంటనే చెల్లించాలి



గతంలో లెక్కల ప్రకారం కాకుండా ప్రభుత్వ రిజిస్ట్రేషన్ విలువ ప్రకారం భూములకు పరిహారం చెల్లించాలి. ఆయా భూముల్లోవున్న బావులకు, బోర్లకు పరిహారం అందించాలి.

- గోరంట్ల మాలకొండయ్య, రైతు, చింతలదేవి


విలేఖరులతో మాట్లాడుతున్న కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి

- ఎస్పీ కార్యాలయానికి కోటంరెడ్డి
- సిటీ ఎమ్మెల్యే అనిల్‌తో మరో రోజు
- ఆర్థిక లావాదేవీలపైనే ఆరా
- పక్కా ఆధారాలతోనే కార్యాచరణ
- గంటన్నరపాటు విచారణ

ఇది రాజకీయ కుట్ర

క్రికెట్ బెట్టింగ్‌లు, బుకీల వ్యవహారంలో ఎమ్మెల్యేలను విచారణకు పిలవడం వెనుక రాజకీయ కుట్ర జరుగుతోంది. బాధ్యతగల పౌరుడుగా, ఎమ్మెల్యేగా విచారణకు హాజరయ్యాను. తొలి విచారణలో అడిగిన ప్రశ్నలనే మళ్లీ అడిగినా అవే జవాబులు చెప్పాను. విచారణకు పూర్తిగా సహకరించాను. క్రికెట్ బెట్టింగ్‌లపై నాలుగు ప్రశ్నలను విచారణాధికారికి అందించాను. ఇందులో మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, మాజీ మంత్రులు, పోలీసు అధికారులు ఉన్నారు. కృష్ణసింగ్ కాల్ డేటా పరిశీలిస్తే ఇది నిజమవుతుంది. వారందరికి నోటీసులు జారీ చేసి విచారణ జరపాలి. వారం గడువు ఇస్తున్నా ఈ లోగా దీనిపై విచారణ జరిపితే సరి.. లేదంటే హైకోర్టును ఆశ్రయించి న్యాయ పోరాటం చేస్తా.

- కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, వైసీపీ ఎమ్మెల్యే

రెండోసారి విచారణ

నెల్లూరు, (ఆంధ్రజ్యోతి ప్రతినిధి) : ఈనెల 22న తొలి విడత విచారణలో సిటీ ఎమ్మెల్యే పీ అనిల్, రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి హాజరై పలు ప్రశ్నలకు సమాధానాలు ఇచ్చారు. ఎన్నికల ఫండ్ తోపాటు బెట్టింగ్‌లలో ఆర్థిక లావాదేవీలు, బుకీలతో ఉన్న అనుబంధం, బ్యాంకు ఖాతాల్లో జరిగిన నగదు జమలు తదితర అంశాలపైనే వివరాలు రాబట్టారు. మరి కొంత సమాచారం కోసం ఆదివారం ఉదయం ఇద్దరు ఎమ్మెల్యేలు హాజరు కావాలని పోలీసులు కోరారు. ఈ విచారణకు ముందుగానే బిరదవోలు శ్రీకాంత్‌రెడ్డిని పోలీసులు అదుపులోకి తీసుకుని మరో సారి పూర్తి స్థాయిలో విచారణ చేసి కొన్ని వివరాలు సేకరించారు. రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డికి అత్యంత ముఖ్య అనుచరుడుగా బిరదవోలు వ్యవహరిస్తుండడంతోపాటు కృష్ణసింగ్ సరెండర్ వెనుక కీలక పాత్ర పోషించారు. క్రికెట్ బెట్టింగ్‌ల వ్యవహారంలో జరిగిన ఆర్థిక లావాదేవీలపైనే శ్రీకాంత్‌రెడ్డి నుంచి పూర్తి సమాచారాన్ని మరో సారి పోలీసులు సేకరించుకుని నిర్ధారించుకున్నారు. ఆదివారం ఉదయం 11.15 నిమిషాలకు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి జిల్లా పోలీసు కార్యాలయానికి చేరుకున్నారు. ఏఎస్పీ శరత్‌బాబు, డీఎస్పీలు రాఘవరెడ్డి, బాలసుందరావులు కోటంరెడ్డితో మాట్లాడారు. ఈ విచారణను వీడియో రికార్డు చేశారు. బెంగుళూరులోని కేతన హళ్లిలో ఉన్న బ్యాంకు ఖాతా కోటంరెడ్డి శ్రీధ ర్‌రెడ్డి పేరుతో ఉందని, ఆ ఖాతాకు నెల్లూరు నుంచి పలు సార్లు నగదు బదిలీ జరిగినట్లు పోలీసులు ప్రశ్నించారు. ప్రస్తుతం రూ. 4.98 లక్షలు నగదు నిల్వ ఉన్నట్లు ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. ఆ ఖాతా తనది కాదని, ఎవరిదోనని నెల్లూరులో ఎస్‌బీహెచ్ బ్యాంకులో మాత్రమే ఖాతా ఉందని, తన కుటుంబ సభ్యులకు ఉన్న బ్యాంకు ఖాతాల వివరాలను పోలీసులకు అందించారు.

● రూపు తరువాతే అనిల్

సిటీ ఎమ్మెల్యే అనిల్ ముఖ్య అనుచరుడు, కార్పొరేషన్ ఫ్లోర్‌లీడర్ రూపుకుమార్ యాదవ్‌ను మొదట విచారించిన తరువాతే రెండో విడత ఎమ్మెల్యే అనిల్‌ను విచారించాలని భావించారు. మొదట అనుకున్నట్లు ఆదివారం ఉదయం 12 గంటలకు అనిల్ జిల్లా పోలీసు కార్యాలయానికి రావాల్సి ఉంది. ఉద యం 11.30 గంటల ప్రాంతంలో పోలీసులు అనిల్‌కు ఫోన్ చేసి ప్రస్తుతం రావాల్సిన అవసరం లేదని అందుబాటులో ఉంటూ చెప్పినప్పుడు హాజరు కావాలని కోరారు. పంటరుగా వ్యవహరించిన రూపకుమార్ కృష్ణసింగ్‌తో సన్నిహితంగా ఉండడం, బెట్టింగ్‌ల వ్యవహారాల్లో రూపు కీలకంగా వ్యవ హరించారని ఆధారాలు సేకరించిన పోలీసులు మొదట రూపును విచారించి ఆయన నుంచి కొంత సమా చారం సేకరించి నిర్ధారిం చిన తరువాతే అనిల్‌ను విచారించాలని రూపు కోసం ఆరా తీశారు. మూడు రోజులుగా అహోబిళంలో ఉన్న రూపు ఆది వారం రాత్రికి నెల్లూరుకు వచ్చిన వెంటనే కలుస్తానని ఫోన్‌లో చెప్పారు సోమవారం రూపును విచారించిన తరువాత కొంత క్లారిటీ తీసుకుని ఆ తరువాత అనిల్‌ను రెండో విడత విచారణ సాగిం చనున్నట్లు పోలీసు వర్గాలు తెలిపాయి. నెల్లూరు రూరల్ నియోజకవర్గం నుంచి తరలి వచ్చిన కార్యకర్తలు, నేతలు ఎమ్మెల్యే కోటంరెడ్డి కార్యాలయంలోనే మకాం వేశారు. ఒక వేళ అరెస్టు జరిగితే ఆందోళనలు చేయాలని నిర్ణయించుకు న్నారు. జిల్లా పోలీసు కార్యాలయం వద్ద పోలీసుబందోభస్తు ఏర్పాటు చేశారు.

● పోలీసుల వద్ద పక్కా సమాచారం.

క్రికెట్ బెట్టింగ్‌లు, బుకీలతో ఎమ్మెల్యేలకు సంబంధాలు ఉన్నాయని ఇప్పటికే పోలీసులు పక్కాగా సమాచారం సేకరించారు. 2014 ఎన్నికల్లో ఎవరెవరి ద్వారా ఎన్నికల ఫండ్ తీసుకుంది అన్న అంశంపై పూర్తి వివరాలు పోలీసుల వద్ద ఉన్నాయి. ఎమ్మెల్యేల అనుచరులుగా వ్యవహరిస్తున్న వారే ఇందులో కీలకంగా ఉన్నారని అందుకే వారినే మొదట పోలీసులు విచారించి చాలా విషయాలు రాబట్టారు. నెల్లూరు కార్పొరేషన్ మేయర్ ఎన్నికలో గోవా క్యాంపులో నగదు ఖర్చు అన్నది ఒకే ఒక ప్రశ్నగా ఎమ్మెల్యేల నుంచి రాబట్టారు. అభ్యర్థిగా మేయర్ అబ్దుల్ అజీజ్ చాలా వరకు ఖర్చు పెట్టగా, ఎమ్మెల్యేలు కోసం కృష్ణసింగ్ కొంత నగదు ఖర్చు పెట్టినట్లు ఆధారాలు సేకరించారు.గతంలో నెల్లూరులో 27 మద్యం షాపుల దక్కించుకోవడంలో కృష్ణసింగ్ బెట్టింగ్‌ల సొమ్మును విచ్చల విడిగా ఖర్చుపెట్టినట్లు సమాచారం. నెల్లూరులోని బ్యాంకుల ద్వారా బెంగుళూరులో ఉన్న కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి బ్యాంకు ఖాతాకు పలు సార్లు నగదు జమ అయినట్లు పోలీసులు గుర్తించారు. ప్రస్తుతం ఆ ఖాతాలో రూ. 4.98 లక్షలు ఉన్నట్లు తేల్చారు. రెండో విడతలో కూడా పలు ప్రశ్నలు కోటంరెడ్డి నుంచి రాబట్టారు. పూర్తి వివరాలు, ఆధారాలు సేకరించాం.


ఎస్పీ కార్యాలయంలోకి వెళుతున్న రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి

కొన్నింటికి క్లారిటీ కోసం మాత్రమే ఎమ్మెల్యేల నుంచి వివరాలు సేకరిస్తూ క్రాస్ చెక్ చేస్తున్నామని, అందుకే ఈ విచారణ సాగుతుందన్నది వాస్తవం. కాగా పక్కాఆధారాలున్నా వాటిని గోప్యంగానే పోలీసులు ఉంచుతున్నారు. మరోవైపు విజయవాడ,బెంగళూరు, హైదరా బాదు ,తదితర ప్రాంతాలకు వెళ్లిన ఎమ్మెల్యేలు పేరుమోసిన హోటళ్లల్లో బస చేయడంపై పెట్టిన ఖర్చులన్నిటిపై పోలీసులు ఆరాతీస్తున్నారు. ఎమ్మెల్యేల విచారణలో అడిగిన కొన్నింటికి మాత్రమే మీడియా ముందు ప్రస్తావించి మరి కొన్నింటికి అసలు చెప్పడం లేదన్న వాదనలు కూడా వినిపిస్తున్నాయి. పూర్తి సాక్ష్యాధారాలు ఉంటేనే ఎమ్మెల్యే లను విచారణకు పిలుస్తారు. లేదంటే ఎన్నో సమస్యలు ఎదుర్కోవాల్సి వస్తోందని పోలీసులకు తెలిసిన విషయమే. అందుకే పోలీసులు కూడా పక్కా ఆధారాలతోనే ఎమ్మెల్యేలను విచారణకు ఆహ్వానిం చామని చెబుతున్నారు. అందుకు ముందుగానే వారి అనుచరులనుంచి వివరాలు రాబట్టి ఆతర్వాతే ఎమ్మెల్యేతో క్రాస్‌చెక్ చేస్తు స్టేట్‌మెంట్లు రికార్డుచేస్తున్నారు. ఒకవేళ అరెస్టు చేయాల్సివస్తే సాక్ష్యాలు అవసరం కావడం తోనే ఇంత తంతు పోలీసులు నడుపుతున్నారు.

వేగంగా 'గంగ' పనులు

నెల్లూరు, (ఆంధ్రజ్యోతి) : ఇప్పటికే తెలుగు గంగ మూడు సర్కిళ్లలో పునరావాసం, పరిహారం పంపిణీ వేగంగా జరుగుతోంది. అలాగే మెట్ట రైతులకు వరం లాంటి ఆనం సంజీవరెడ్డి సోమశిల హైలెవల్ కెనాల్‌కు సంబంధించి భూసేకరణలో తలెత్తిన సమస్యలను పరిష్కరించేందుకు కలెక్టర్, తెలుగుగంగ స్పెషల్ కలెక్టర్ నడుంబిగించారు. ప్రధాన సమస్యగా ఉన్న భూసేకరణను పూర్తి చేయడంలో భాగంగా ముగ్గురు డిప్యూటీ తహసీల్దార్(డీటీ)ల నేతృత్వంలో మూడు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశారు. చాలా కాలం నుంచి ఈ కాలువ పనులు ఆశించినంతగా ముందుకు కదలడం లేదు. గత కాంగ్రెస్ ప్రభుత్వంలో మర్రిపాడు, దుత్తలూరు, వింజమూరు మెట్ట ప్రాంతా లకు సాగునీరందించేందుకు సోమశిల హైలెవల్ కెనాల్‌కు శంఖుస్థాపన జరిగింది. సోమశిల ప్రాజెక్టు నుంచి లిఫ్ట్ ఇరిగేషన్ ద్వారా ఈ కాలువ గుండా సు మారు 70 వేల ఎకరాలకు నీరందించడం లక్ష్యంగా పెట్టుకున్నారు. సుమారు రూ.1500 కోట్లతో పనులు ప్రారంభించారు. అయితే ఈ ప్రాజెక్టుకు భూసేకరణ ప్రధాన సమస్యగా మారింది. ఏళ్లు గడుస్తున్నా సమస్య కొనసాగుతూనే వ స్తోంది. ఈ కాలువ సోమశిలలో ప్రారంభమై మర్రిపాడు మండలం పడమ టి నాయుడు పల్లి గ్రామం నుంచి పొంగూరు, అల్లంపాడు, ఇస్కపల్లి, తెగళ్లపాడు, కంపసముద్రం, దుత్తలూరు మండలం జంగాలపల్లి, వింజమూరు మండలంలోని పలు గ్రామాల వరకు ఉంటుంది. ఈ పరిధిలోని పట్టాలు ఉన్న భూములకు మాత్రం పరిహారం చెల్లించడాన్ని అధికారులు ప్రారంభించారు. అయితే చాలా భూములకు పట్టాలు లేవు. వాటిల్లో కొన్ని చుక్కల భూములు కాగా మరికొన్ని డీఫారం పట్టాలు ఉన్నట్లు అధికారులు చెబుతున్నారు. వీటి దగ్గరే సమస్య ఉత్పన్నమైంది. ఇవన్నీ రైతుల ఆధీనంలో ఉండడంతో పరిహారం ఎలా, ఎంత చెల్లించాలన్న దానిపై సందిగ్ధత కొనసాగుతూ వస్తోంది. మరికొన్ని చోట్ల భూములు ఎవరివన్న సమస్యలు కూడా తలెత్తినట్లు అధికారులు చెబుతున్నారు. దీంతో ఈ కాలువకు సంబంధించి భూసేకరణ ముందుకు కదలడం లేదు.

● మూడు బృందాలు.. పదిహేను రోజులు

ఆనం సంజీవరెడ్డి సోమశిల హైలెవల్ కెనాల్ పూర్తి చేయగలిగితే బీడుగా సుమారు 70 వేల ఎకరాలు సాగులోకి వస్తుంది. మర్రిపాడు, దుత్తలూరు, వింజమూరు మండలాలు సస్యశ్యామలం గా మారుతాయి. ఈ నేపథ్యంలో ఎంత త్వరగా ప్రాజెక్టును పూర్తి చేయగలిగితే అంత ఉపయోగకరంగా ఉంటుందని అధికారులు భావిస్తున్నారు. ముఖ్యంగా మర్రిపాడు మండలంలో అత్యవసరంగా సుమారు 400 ఎకరాలను భూసేకరణ చేయాల్సి ఉంది. ఇది పూర్తయితే కాలువ పనులు మరింత ఊపందుకునే అవకాశా లున్నాయి. ఈ భూసేకరణను ఒక కొలిక్కి తెచ్చేందుకు ముగ్గురు డీటీల నేతృత్వంలో మూడు ప్రత్యేక బృందాలను కలెక్టర్ నియమించారు. ఈ మూడు బృందాలు పదిహేను రోజుల పాటు మర్రిపాడులో విధులు నిర్వహిస్తాయి. అక్కడ పట్టాలేని భూములను సేకరించడంలో తలెత్తుతున్న సమస్యలపై చర్చిస్తాయి. రెవెన్యూ రికార్డులు పరిశీలించి ఆ భూముల విషయంలో తీసుకోవాల్సిన చర్యలపై రిపోర్టును కలెక్టర్‌కు సమర్పిస్తాయి. ఈ రిపోర్టు ఆధారంగా భూసేకరణలో సమస్యలను పరిష్కరించేందుకు కలెక్టర్ చర్యలు తీసుకునే అవకాశం ఉందని గంగ ప్రాజెక్టు అధికారులు చెబుతున్నారు. ఇప్పటికే సుమారు రూ.900 కోట్లతో కెనాల్ పనులు జరుగుతున్నాయి. ఇక భూసేకరణను కూడా త్వరగా పూర్తి చేయగలిగితే కాలువ

ఇప్పటికే భూసేకరణ, పునరావాసం, పరిహారంపై ప్రత్యేక దృష్టి

సోమశిల హైలెవల్ కెనాల్ భూసేకరణ సమస్యకు మూడు ప్రత్యేక టీంలు

నేటి నుంచి ముగ్గురు డీటీల ఆధ్వర్యంలో పరిశీలన

అత్యవసరమైన 400 ఎకరాలను కొలిక్కి తెచ్చే ప్రయత్నం

70 వేల ఎకరాల ఆయకట్టుకు లబ్ధి

పనులను వేగంగా పూర్తి చేయవచ్చని అధికారులు భావిస్తున్నారు. కాగా ఈ విషయంపై తెలుగుగంగ ప్రాజెక్ట్ స్పెషల్ కలెక్టర్ ప్రశాంతి 'ఆంధ్రజ్యోతి'తో మాట్లాడుతూ సోమవారం నుంచి ముగ్గురు డీటీల నేతృత్వంలో మూడు బృందాలు మర్రిపాడు మండలంలోని భూ రికార్డులను పరిశీలిస్తాయని పేర్కొన్నారు. అక్కడ కెనాల్ పనులు వేంగం పుంజుకునేందుకు అత్యవసరంగా 400 ఎకరాలను భూసేకరణ చేయాల్సి ఉందని చెప్పారు. అలానే వీలైనంత త్వరగా ఈ కాలువకు సంబంధించి భూసేకరణ ప్రక్రియను పూర్తి చేస్తామని ఆమె వెల్లడించారు.


పొంగూరు రిజర్వాయర్‌లో జరుగుతున్న పనులు


నెల్లూరు: వినాయకులను ఊరేగింపుగా తీసుకెళ్తున్న భక్తులు


ఉదయగిరి: నిమజ్జనానికి తరలివెళ్తున్న గణనాథుడు


నాయుడు పేట: నిమజ్జనానికి తరలివెళ్తున్న గణనాథులు


తూపిలితీరంలో వినాయక విగ్రహాన్ని నిమజ్జనం చేస్తున్న భక్తులు

గణేశ్ మహారాజ్‌కీ జై

- బైబై వినాయకా.. మళ్లీ రావయ్యా
- అంగరంగ వైభవంగా నిమజ్జనం

జిల్లా వ్యాప్తంగా చవితినాడు ప్రతిష్ఠించిన వినాయక విగ్రహాలను మూడో రోజు ఆదివారం నిమజ్జనం చేశారు. తీర ప్రాంత మండలాల్లో సముద్రంలో నిమజ్జనం చేశారు.మిగతా చోట్ల చెరువుల్లోనూ, కాలువల్లోనూ, బావుల్లోనూ నిమజ్జనం చేశారు. ఈ సందర్భంగా ఉట్టి మహోత్సవాలు నిర్వహించారు. మధ్యాహ్నం అన్నదానం చేశారు. మధ్యాహ్నం మొదలైన నిమజ్జనం అర్ధరాత్రి వరకు కొనసాగింది. ఊరేగింపులో యువత కేరింతలు కొడుతూ, రంగులు చల్లకుంటూ కనిపించారు. అత్యధిక ప్రాంతాల్లో ఆదివారమే నిమజ్జనం చేశారు.


కొండాపురం: నిమజ్జనానికి తరలుతున్న గణనాథులు


వినాయకుడిని రిక్షాలో తీసుకెళ్తూ..


కావలి: తుమ్మలపెంట సముద్రపునీటిలో అలల తాకిడికి బయటకు కొట్టుకువచ్చి తేలియాడుతున్న గణనాథులు



కోటలో నిమజ్జనానికి వెళుతున్న గణేష్ విగ్రహాలు



గూడూరు : నిమజ్జనానికి ట్రాక్టర్లలో తరలుతున్న అశోక్‌నగర్‌లోని వినాయకుడి విగ్రహం



నెల్లూరులో వినాయకులను ఊరేగింపుగా తీసుకెళ్లి నిమజ్జనం చేస్తున్న భక్తులు


ఇందుకూరుపేట: మైపాడు సముద్రం వద్ద వినాయక విగ్రహాల నిమజ్జనం


నెల్లూరు: పెన్నానదిలో నిమజ్జనం చేస్తున్న భక్తులు



అన్నీ సమకూరిస్తే ఆర్థిక ఆహ్లాదమే!

తెలతెలవారుతుండగా...

సముద్రం శివమెత్తి భీకర రూపం దాల్చినా.. అందంగానే ఉంటుంది. తీరంలో పడిలేచే అలలు ఓ పక్క.. అందమైన ఇసుక తిన్నెలు, ఉప్పు కాలువ, దూరంగా తాటి చెట్లు, పర్యాటన శాఖ హరిత రిసార్టులు, జాలర్ల జీవన సమరం, మర పడవలు, నాటు పడవలు మరోపక్క.. అంతా అద్భుతమైన చిత్రంలా కనిపిస్తుంది. జిల్లాలోని కడలి తీరం పర్యాటకులను ఆకట్టుకుంటోంది. ఉన్న వనరులను ఉపయోగించుకుని మరింత అభివృద్ధి చేస్తే పర్యాటకుల సందడి పెరగడంతోపాటు రాష్ట్రానికి ఆర్థిక తోడ్పాటు అందనుంది.

- **కడలి తీరంలో సమస్యల నెలవు**
- **కనీస సదుపాయాలు లేక పర్యాటకుల కష్టాలు**
- **పట్టించుకోని పర్యాటక శాఖ**

బారికేట్స్ లేకపోవడంతో యువత హద్దులు లేనంతగా దూరం వెళ్లి స్నానాలు చేయడం ప్రమాదాలకు కారణమవుతుంది. ఇక్కడ ఔట్ పోలీస్‌స్టేషన్ కూడా హామీగానే ఉంది. బీచ్ అయినా మంచినీటి కొరద వేధిస్తోంది. మహిళలకు మరుగుదొడ్లు లేవు. సముద్ర స్నానాలు ముగిసిన తర్వాత దుస్తులు మార్చుకునేందుకు వసతులు లేదు. అధిక ధరలు అమ్మే హరితా రిసార్ట్స్ తప్పించి, వేరే ఆహార పానీయాలు దొరకవు. శని, ఆది, పండుగ రోజులు, ముఖ్యంగా కార్తీక, శ్రావణ మాసం, రొట్టెల పండుగ వేళల్లో లక్షలాది మంది హాజరవుతూ ఉంటారు. ప్రమాదాలు జరిగినప్పుడు గజ ఈతగాళ్లను ఏర్పాటు చేసుకోవాలని, కనీస చర్యలు చేపట్టాలని కూడా పోలీస్ యంత్రాంగం గుర్తించలేదు. కానీ రిసార్ట్స్ గదులు నిర్మించడం తప్పించి, మరి ఏ అభివృద్ధి చేయలేదు. అది కూడా అసాంఘిక కార్యక్రమాలకు కేంద్రంగా మారడంతో వాటిపట్ల కూడా ఎవరూ ఆసక్తి చూపడం లేదు.



పులికాట్ సరస్సులో పర్యాటకుల పడవ షికారు

మైపాడు తీరం..

ఇందుకూరుపేట : మైపాడును పర్యాటక రంగంగా తీర్చిదిద్దేందుకు నాయకులు, అధికారుల అడుగులు వెనుకకే పడుతున్నాయి.



తూపిలిపాళెంలో పర్యాటకుల సందడి

తూపిలిపాళెంపై శీతకన్ను

వాకాడు : రాష్ట్ర పర్యాటకశాఖ దృష్టి సారిస్తే వాకాడు మండలం తూపిలిపాళెం పర్యాటకంగా అభివృద్ధి చెందనున్నది. తూపిలిపాళెం గ్రామ సమీపాన బకింగ్‌హాం కెనాల్ కూడా ఉంది. ఈ కాలువను అభివృద్ధి చేస్తే తీర ప్రాంతానికి మరింత శోభ చేకూరుతుంది. పర్యాటకుల కోసం స్వర్ణముఖి గెస్ట్‌హౌస్‌లో మరిన్ని సౌకర్యాలు కల్పించాలి. దుగరాజపట్నం ఓడ రేవు కార్యరూపం దాలిస్తే చెన్నైలోని మెరీనా బీచ్‌ను మించి తయారవుతుంది. ఈ తీరప్రాంతాన్ని అభివృద్ధి చేసేందుకు ఇక్కడున్న ప్రభుత్వ భూముల్లో కాటేజీలు, పార్కులు నిర్మించ వచ్చు.




పర్యాటక కేంద్రానికి అనుకూలంగా ఉన్న తీరప్రాంతం

ఆదాయ వనరుగా ఇస్కపల్లి

అల్లూరు: అల్లూరు మండలం ఇస్కపల్లి తీరాన్ని పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేస్తే ఆదాయవనరుగా మారునున్నది. దాదాపు 8 ఏళ్ల క్రితం వరకు ఈ తీరం పర్యాటకులతో కళకళలాడేది. అయితే సునామీ సంభవించిన అనంతరం నుంచి ఈ ప్రాంతం ప్రమాదభరితంగా మారడంతో పర్యాటకుల రాక తగ్గుముఖం పట్టింది. దీంతో ఇస్కపల్లి తీరప్రాంతం పూర్వ వైభవం కోల్పోయింది. గత ఏడాది పర్యాటకశాఖ అధికారులు ఈ ప్రాంతాన్ని గుర్తించి పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేసేందుకు చర్యలు చేపట్టింది. ఇక్కడ గతంలో లైట్‌హౌస్ ఏర్పాటు చేయడంతో ఈ ప్రాంతం గుర్తింపును సంతరించుకుంది. 2016లో మాజీ ఎమ్మెల్యే బీద మస్తాన్‌రావు ఈ ప్రాంతాభివృద్ధికి 5 ఎకరాల భూమిని పర్యాటక శాఖకు దానంగా ఇచ్చారు. పర్యాటకులకు అన్ని వసతులతో పాటు రిసార్ట్స్‌లను ఏర్పాటు చేయనున్నారు.

తడను చూసొద్దాం రండి!

తడ : తడ చుట్టుపక్కల ప్రాంతాల్లో ఎన్నో పర్యాటక ప్రాంతాలు ఉన్నాయి. తడ నుంచి 8 కిలోమీటర్ల దూరంలో ఉన్న భీములవారిపాళెం పడవల రేవు ఉంది. అక్కడే ఉన్న పులికాట్ సరస్సుకు తెల్లవారుజామున చేరుకుంటే



ఉప్పలమడుగు కొండల నడుమ జలపాతం

సూర్యోదయాన్ని మనం కన్యాకుమారిలో చూసినట్లుగా చూడవచ్చు. సూర్యు లేలేత కిరణాలు పడే సమయంలో మత్స్యకారులు ఓ పక్క వేట చేస్తూ కనిపిస్తారు. ఆ పడవల విన్యాసాల మధ్య సూర్యకిరణాలు పులికాట్ సరస్సుపై ప్రసరించడంతో బంగారు వర్ణంలో కనపడుతూ పర్యాటకులను పులకించేలా చేస్తుంది. ఇక సరస్సులో పడవ షికారు అత్యద్భుతంగా అనిపిస్తుంది. మనం గోవాలో సముద్రపునీళ్లలో పడవ షికారు చేస్తే ఎంతటి అనుభూతి కలుగుతుందో అంతటి అనుభూతిని ఇక్కడ పొందవచ్చు. సరస్సుకు మరో ఒడ్డున ఇరకందీవి ఉంటుంది. ఈ దీవిలో నీటి దొరువులు, పేముచెట్లు, ఇసుక దిబ్బలు ఇవన్నీ ప్రకృతి ప్రేమికులకు ఎంతో ఆహ్లాదాన్ని కలిగిస్తాయి. తడ నుంచి 23 కిలోమీటర్ల దూరంలో చిత్తూరుజిల్లా వరదయ్యపాళెం మండలం ఉప్పలమడుగు జలపాతాలు పర్యాటకులను ఎంతగానో ఆకట్టుకుంటోంది. చుట్టూ కొండలు, వాటి మధ్య సన్నటి జలపాతాలు, ఆ నీళ్లు నేలపై పడే దృశ్యాలు, ఆ నేలపై పడ్డనీళ్లు అలా అలా వెళ్తూ అందరినీ ఆకర్షించడం విశేషం.



పర్యాటకులతో కళకళలాడుతున్న సముద్రతీరం

కోడూరుపై కరుణ చూపరా?

తోటపల్లిగూడూరు : మండలంలోని కోడూరు సముద్ర తీరానికి ప్రత్యేక గుర్తింపు ఉంది. అభివృద్ధి పదేళ్లుగా హామీలకే పరిమితమైంది. కనీసవసతులు లేక తీరానికి వచ్చే పర్యాటకులకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. జిల్లా కేంద్రానికి దాదాపు 22కి.మీ దూరంలో ఈ సముద్ర తీరానికి ఆది, సోమవారాలు అనే తేడా లేకుండా మండల పరిసర ప్రాంతాల పర్యాటకులతోపాటు జిల్లా నలుమూలల నుంచి విశేషంగా వస్తుంటారు. దానికితోడు సెప్టెంబర్‌లో తీరానికి పక్కనే ఉన్న వేళాంగణిమాత ఆలయంలో జరిగే ఉత్సవాలకు వేలాది సంఖ్యలో భక్తులు రావడంతోపాటు జిల్లా కేంద్రంలో జరిగే రొట్టెల పండుగ పర్వదినాలలో ఇతర రాష్ట్రాల నుంచి అధిక సంఖ్యలో తరలి వస్తుంటారు. ఈ క్రమంలో తీరంలో సేద తీరుతూ సముద్ర స్నానాలు చేస్తుంటారు. వీరికి తాగునీరు, మరుగుదొడ్లు, స్నానపు గదులు, ఆహారం సైతం లేని పరిస్థితి. తీరానికి తరలివచ్చే పర్యాటకులు కనీస వసతి సౌకర్యాలు లేక తీరంలోనే కుటుంబ సమేతంగా గడపాల్సిన పరస్థితి. తీరానికి వచ్చిన మహిళలు స్నానం చేయాలంటే పక్కనే ఉన్న వేళాంగణి మాత ఆలయం నిర్వాహకులు ఏర్పాటు చేసిన ఖాళీ స్థలాన్ని స్నానాల గదుల వద్దకు వెళ్లాల్సిన పరిస్థితి. 2006లో వచ్చిన సునామీ తో సముద్ర తీరాన్ని పరిశీలించిన అప్పటి రాష్ట్ర ఆర్థికశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి ప్రభుత్వం ద్వారా అన్ని విధాలా అభివృద్ధి చేస్తామని



నిర్మాణంలో ఉన్న రెస్టారెంట్

హామీ ఇచ్చారు. ఇప్పటి వరకు దాదాపు పదేళ్లు గడుస్తున్నా ఎటువంటి పురోభివృద్ధి లేదు. ప్రస్తుతం అధికార పార్టీలో ఉన్న తెలుగుదేశం ప్రభుత్వం బీచ్ అభివృద్ధికి దాదాపు రూ.11కోట్లు మంజూరు చేసింది. అందులో తొలివిడతగా రూ. 2.50కోట్లతో పర్యాటకులకు అవసరమైన రెస్టారెంట్, షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణ పనులు జరుగుతున్నాయి. తీరంలో సునామీ తుఫాన్ వంటి ప్రమాదాలను ముందస్తుగా తెలియచేసేందుకు ఎటువంటి ప్రమాద సూచికలు కనిపించిన దాఖలాలు లేవు. తీరానికి వచ్చే పర్యాటకులు అనుకోని పరిస్థితులలో ప్రమాదాల బారిన పడినట్లైతే రక్షించే గత ఈతగాళ్లు సైతం తీరంలో లేరు. శాంతి భద్రతలకు ఎటువంటి అసౌకర్యం కలుగకుండా ఉండాల్సిన పోలీసులు కేవలం ఆదివారం మినహా మిగతా రోజుల్లో కనిపించడం లేదు.


తుమ్మలపెంట.. ఆహ్లాదం

కావలి: కావలికి సమీపంలోని తుమ్మలపెంట తీరంలో బీచ్‌ను పూర్తిస్థాయిలో అభివృద్ధి చేస్తే ప్రజలకు ఆహ్లాదం, ప్రభుత్వానికి ఆదాయం సమకూరుతుంది. అలాగే యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కలుగుతాయి. తుమ్మలపెంట సముద్రతీరంలో 3 ఎకరాల్లో రూ. 3.77 కోట్లతో పర్యాటక శాఖ ఆధ్వర్యంలో 2014లో రిసార్ట్స్ నిర్మించారు. మిగిలిన 4 ఎకరాల ఖాళీ స్థలంలో కమ్యూనిటీ హాళ్లతోపాటు పర్యాటకులను ఆకర్షించేలా మొక్కలు పెంపకం చేపట్టాలి.



నిరుపయోగంగా చిన్నారుల ఆటవస్తువులు

నాటి నుంచి నేటి వరకు ఆ స్థలం పిచ్చిచెట్లతో నిరుపయోగంగా ఉంది. ఇక పర్యాటక కేంద్రానికి వచ్చే చిన్నారుల కోసం ఏర్పాటు చేసిన ఆటవస్తువులు శిథిలావస్థకు చేరాయి. పర్యాటక కేంద్రంలో 24 గంటలు ఆన్‌లైన్ ద్వారా రూములు అద్దెకు అందే అవకాశంతోపాటు భోజన వసతి కూడా అందుబాటులో ఉండటంతో వివిధ ప్రాంతాల నుంచి పర్యాటకులు వచ్చేందుకు అవకాశం ఉంది. కానీ ఆ బీచ్‌కు రోడ్డు మార్గం సరిగా లేకపోవడం, బస్సు సౌకర్యంతో పాటు అక్కడ వసతులు సక్రమంగా లేకపోవటంతో హరిత బీచ్ రిసార్ట్స్ ఆశించిన స్థాయిలో అభివృద్ధికి నోచుకోలేదు. ఎర్యాటక కేంద్రం డివిజనల్ మేనేజర్ ఉమామహేశ్వరరెడ్డి మాట్లాడుతూ తుమ్మలపెంట పర్యాటకకేంద్రంలో శని, ఆదివారాల్లో పర్యాటకులు ఎక్కువగా వస్తున్నారని అన్నారు. రోడ్డు, బస్సు వసతి మెరుగుపరిస్తే మరింత ఆదాయం వస్తుందని చెప్పారు.


దేహం నుంచి తీస్తున్న కన్ను

విడవలూరుకు చెందిన సుబ్రహ్మణ్యం తన మరణానంతరం రెండు కళ్లను దానం చేసి కంటి చూపులేని మరో ఇద్దరికి వెలుగును ప్రసాదించారు. ఇందుకూరుపే టకు చెందిన వెంకటేశ్వర్లు వృద్ధాప్యంలో మరణానంతరం కుటుంబ సభ్యులు నేత్రదానానికి అంగీకరించడంతో మృతుడి నేత్రాలను సేకరించారు. వెంకటేశ్వరపురా నికి చెందిన ఖాజావలి తన మరణా నంతరం నేత్రాలు దానం చేశారు. కావలికి చెందిన పద్మశ్రీ తన మరణానంతరం కుటుంబ సభ్యుల ద్వారా నేత్రదానం చేశారు... ఇలా ఎందరో జిల్లాలో నేత్రదానానికి ముందుకు వస్తున్నారు. అయితే వీరిసంఖ్య కేవలం 20శాతం మందే జిల్లాలో ఉండటం బాధాకరం. ఎంతో మంది అంధులు నేత్రదాతల కోసం ఎదురు చూస్తున్నారు.

- నెల్లూరు (వైద్యం)


అంధత్వంలో చిన్నారులు

వెలుగు దివ్వెలు వారు..

- అంధులకు కొత్త జీవితాన్ని ఇస్తున్న నేత్రదాతలు
- జిల్లాలో స్ఫూర్తిమంతంగా నేత్రదాన ఉద్యమం
- ప్రశంసనీయంగా స్వచ్ఛంద సంస్థల కృషి
- సెప్టెంబరు 8 వరకు పక్షోత్సవాలు

ప్రపంచంలోనే మూడో వంతు అంధులు భారతదేశంలోనే ఉన్నారు. ఈ పరిస్థితిల్లో నేత్రదానంపై ప్రజలకు అవగాహన కల్పించాల్సిన అవసరం ఉంది. కార్నియా (నల్లగుడ్డు) వ్యాధితో ఎంతోమంది అంధులవుతున్నారు. గతంలో 40 ఏళ్లపై బడ్డ వారు కార్నియా వ్యాధితో అంధులు అవుతుండగా, ప్రస్తుతం చిన్న పిల్లలను సైతం ఈ సమస్య వెంటాడుతోంది. వీరికి నేత్రదాతల నేత్రాలు ఇవ్వాల్సి ఉంది. అయి తే అవసరానికి తగ్గట్టు నేత్రదాతలు ముం దుకు రావటం లేదు దీన్ని దృష్టిలో పెట్టుకొని కేంద్ర ప్రభుత్వం ఆగస్టు 25వ నుంచి సెప్టెంబరు 8వ తేదీ వరకు నేత్రదాన పక్షోత్సవాలను నిర్వహిస్తున్నది.

● 1,958 మంది నేత్రదాతలు

ఇప్పటి వరకు జిల్లాలో 1,958 మంది దాతలు 3,916 నేత్రాలను దానం చేశారు. ఇంకా ఎంతోమంది నేత్రదానానికి తమ వంతు చేయూత ఇస్తామని ప్రతిజ్ఞచేశారు. ఇప్పటికే 80 వేలు మందికి పైగా తమ మరణానంతరం నేత్రదానం చేస్తామని వివిధ సంస్థలకు రాతపూర్వకంగా తెలిపారు.

● ఉద్యమం సాగుతుందిలా....

2006లో జిల్లా వ్యాప్తంగా కేవలం 34 నేత్రాలు సేకరించగా, ప్రజా చైతన్యం కారణంగా వీటి సంఖ్య ప్రస్తుతం 400 నుంచి 450కి పెరిగింది. గతంలో నేత్రాల సేకరణలో కనుగుడ్డును మరణించిన అనంతరం తీసేవారు. అయితే ప్రస్తుతం ఆధునిక విధానంలో కేవలం కంటి లోపల ఉన్న కార్నియా (నల్లగుడ్డు) పొరను మాత్రమే సేకరిస్తారు. దీంతో కంటి ప్రాంతాల్లో గుంట పడడం ఇతరత్రా సమస్యలు ఉండవు.

● సేకరణలో ఎన్నో సంస్థలు

నేత్రాల సేకరణలో ఎన్నో సేవా సంస్థలు కృషి చేస్తున్నాయి. నెల్లూరులోని వాసవీ సేవాదళ్, చిరంజీవి యువత, వాసవీ క్లబ్, లైన్స్ క్లబ్, రోటరీ క్లబ్, జేసీసీ క్లబ్, బీ పాజిటివ్ సుబ్బారావు సంస్థలతో పాటు కోవూరుకు చెందిన సుభాష్ సేవా సంస్థ, విడవలూరుకు చెందిన మనసేలా సంస్థ, గూడూరుకు చెందిన సునీతా సేవా సంస్థ,


తీసిన కన్ను


నాయుడుపేటకు చెందిన సాయి యంగ్ సేవా కేంద్రం (ఫ్రెండ్స్ ఆర్గనైజేషన్), సూళ్లూరుపేటకు చెందిన ఆచార్య భరద్వాజ సంస్థలు ఇందులో ప్రముఖమైనవి.

● ముందజంలో మోడరన్ ఐ ఆసుపత్రి

దాతల నుంచి నేత్రాల సేకరణలో నెల్లూరులోని మోడరన్ ఐ ఆసుపత్రి విశిష్ట సేవలందిస్తోంది. 24 గంటల పాటు నేత్రాలు సేకరించేలా వైద్యులు, సిబ్బంది అందుబాటులో ఉంటున్నారు. ఇప్పటి వరకు 2,383 నేత్రాలను తీసిన ఈ వైద్య బృందం ఆసు పత్రిలోనే అధునాతన చికిత్సలు ద్వారా వందల మందికి పైగా కంటి మార్పిడిల శస్త్ర చికిత్సలు చేశారు. మిగిలినవి హైదరాబాద్ ఎల్‌వీ ప్రసాద్ ఇనిస్టిట్యూట్, చిరంజీవి ఐ బ్యాంకుకు పంపిస్తున్నారు. ప్రభుత్వ జనరల్ ఆసుప త్రిలో కూడా నేత్రాల సేకరణకు ప్రత్యేక ఐ బ్యాంకును ఇటీవల ప్రారంభించారు.

జిల్లా వ్యాప్తంగా సేకరించిన నేత్రాలు

సంవత్సరం	సేకరించిన నేత్రాలు
2005-06	34
2006-07	124
2007-08	137
2008-09	253
2009-10	428
2010-11	418
2011-12	430
2012-13	564
2013-14	359
2014-15	383
2015-16	362
2016-17	276
2017-18	148 (ఇప్పటి వరకు)


అందమైన కళ్లు



జీజీహెచ్‌లో ఐ బ్యాంకు ద్వారా నేత్రాల సేకరణ



ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలోని కంటి విభాగంలో నూతనంగా ఐ బ్యాంకును ఏర్పాటు చేశాం. విజయవాడ ఎల్‌వీ ప్రసాద్ ఐ బ్యాంకు సహకారంతో నేత్రాలను సేకరించి భద్రపరుస్తాం. జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ ఆరోగ్య కేంద్రాల ద్వారా ప్రజల్లో చైతన్యం తీసుకొని వస్తాం. దాతలు ఎవరైనా మరణానంతరం నేత్రదానం చేసేలా కృషి చేస్తాం.

- డాక్టర్ శ్రీధర్, ఐ బ్యాంకు నిర్వాహ కులు

నేత్రదానానికి ప్రత్యేక చొరవ



నేత్ర దానానికి సంబంధించి ప్రత్యేక కృషి చేస్తున్నాం. కిమ్స్ ఆసు పత్రికి సంబంధించిన సంస్థల్లో నేత్ర దానం పట్ల ఉద్యో గులకు అవగాహన కల్పిస్తున్నాం. ప్రత్యేక వైద్య బృందం రోగులకు కూడా నేత్ర దానం వల్ల కలిగే ప్రయోజనాలను వివరిస్తున్నాం. ఇప్పటికే నేత్రదానంలో ఎన్నో సత్ఫలితాలు సాధించాం.

- టీ గిరినాయుడు, కిమ్స్ ఆసుపత్రి ఈడీ

నేత్రదానం ఇలా..

- కుటుంబ సభ్యుల సమ్మతితో మరణానంతరం నేత్రదానం చేయాల్సి ఉంటుంది.
- మరణించిన ఆరు నుంచి 8 గంటలలోపే కళ్లను దానం చేయాలి
- వయసు, లింగ బేధం, రక్తం గ్రూపు మతంతో సంబంధం లేకుండా ఎవరైనా నేత్రదానం చేయవచ్చు
- శుక్లాల వ్యాధి ఉన్న వాళ్లు కూడా తమ కళ్లను దానం చేయవచ్చు.
- రక్తపోటు, మధుమేహంతో బాధపడుతున్న వారు కూడా దానం చేయవచ్చు.

విస్తృత ప్రచారం చేస్తున్నాం



ప్రభుత్వం తరపున విస్తృత ప్రచారం చేస్తున్నాం. నేత్రదానంపై ప్రజలలో అవగాహన కల్పిస్తున్నాం. నేత్రాల సేకరణకు సహకరిస్తున్నాం. జిల్లావ్యాప్తంగా స్వచ్ఛంద సంస్థలు నేత్రదానంపై అవగాహన కల్పిస్తున్నాయి. ప్రజలు మరింత చైతన్యవంతం కావాల్సి ఉంది.

- డాక్టర్ మంజులమ్మ, జిల్లా అంధత్వ నివారణ సంస్థ నిర్వాహకులు

నేత్రాల సేకరణకు స్వచ్ఛందంగా సేవ



నేత్రాల సేకరణకు ప్రత్యేక చొరవ చూపిస్తున్నాం. సేవా భావంతో ఈ కార్యక్రమం చేపడుతున్నాం. కుటుంబ సభ్యులలో చైతన్యం తీసుకువచ్చి నేత్రదానానికి కృషి చేస్తున్నాం. అయితే ఈ నేత్రాల సేకరణలో ఎన్నో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఎవరు మృతి చెందారో తెలుసుకుని వారి కుటుంబ సభ్యులను ఒప్పించేలా చేస్తున్న కృషిలో 50 శాతం మాత్రమే ఫలితాలు వస్తున్నాయి. ప్రజలు మరింత చైతన్యం కావాల్సి ఉంది.

- బయ్యా ప్రసాద్, నేత్రదాన మోటివేటర్

ఎవరి ఖర్చులు వారివే..

నెల్లూరు (సిటీ) : నెల్లూరు అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ (నుడా) బాలరిష్టాలను ఎదుర్కొంటోంది. సిబ్బంది నియామకం, కార్యాలయం ఏర్పాటు ఆలస్యమవుతోంది. నిర్వహణ ఖర్చులకు నిధులు మంజూరు కాలేదు. దాంతో ఎవరి ఖర్చులు వారివే అవుతున్నాయి. నుడా ఏర్పాటు, నిర్వహణకు ప్రభుత్వం రూ.10 కోట్లు కేటాయిస్తూ జీవో జారీ చేసింది. అకౌంట్ పక్రియ పూర్తి కాలేదు. దాంతో నిధుల మంజూరు జీవోకే పరిమితమైంది. సుమారు 60 మంది సిబ్బంది నియామకం కావాల్సి ఉంది. ముగ్గురు అధికారులు మాత్రమే నియమితులయ్యారు. నియ రెండు నెలలుగా వారికి జీతాలు లేవు. ఛైర్మన్‌కు ఏర్పాటు చేసిన వాహనానికి బాడుగ ఇచ్చేందుకు నిధులు కరువయ్యాయి. బాడుగకు సొంత నిధులు ఇవ్వాల్సిన పరిస్థితి ఏర్పడి ఉంది.

రూ.10కోట్లు నిధుల మంజూరుకు జీవో

ప్రభుత్వం విడుదల చేయనున్న రూ. 10 కోట్లతో నుడా మాస్టర్ ప్లాన్ తయారీతో పాటు కార్యాలయం, వాహనాల బాడుగలు, సిబ్బంది వేతనాలు, ఇతరత్రా ఖర్చులు పెట్టుకోవాలి. మాస్టర్ ప్లాన్ తయారీకి రూ.5 కోట్లు కేటాయించారు. ఆ నిధులకు సంబంధించి ట్రెజరీలో ప్రత్యేక అకౌంట్‌ను ఏర్పాటు చేయాలి. దాని ద్వారా నుడా నిర్వహణకు డబ్బులు ఖర్చు చేయాలి. నిధుల జీవో జారీ అయి రెండు నెలలవుతున్నా అకౌంట్ ఏర్పాటు ప్రక్రియ పూర్తి కాలేదు. నిధులు మంజూరైనా వాడుకునే అవకాశం ఉండదు. ఈ ప్రక్రియను అధికార యంత్రాంగం త్వరితగతిన పూర్తి చేయాల్సిన అవసరం ఉంది.

- నుడాకు మంజూరు కాని నిధులు
- నత్తనడకన కార్యాలయం ఏర్పాట్లు

నత్తనడకన కార్యాలయ ఏర్పాటు పనులు

కార్యాలయం ఏర్పాటు పనులు నత్తనడకనే సాగుతున్నాయి. పలు ప్రాంతాలలో భవనాల పరిశీలన అనంతరం ఎట్టకేలకు బీవీ నగర్‌లోని ప్రైవేటు భవనంలో కార్యాలయం ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. ఈ భవనం బాడుగ వ్యవహారం పెండింగ్‌లో ఉంది. చదరపు అడుగుకు రూ.10 చెల్లిస్తామని అధికారులు చెబుతుండగా యజమాని రూ.15 అడుగుతున్నారు. ఈ ప్రతిపాదనను ప్రభుత్వానికి పాలకవర్గం పంపినా అక్కడ నుంచి ఎటువంటి నిర్ణయమూ ఇంకా రాలేదు. మొత్తమ్మీద ఆ భవనంలోనే కార్యాలయం ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. ఛైర్మన్ కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి పూజ కూడా చేశారు. కార్యాలయానికి హంగులు అద్దే పనులు ఆలస్యంగా జరుగుతున్నాయి. దాంతో పాలక వర్గంలో అసంతృప్తి నెలకొని ఉంది. ప్రమాణ స్వీకారం జరిగి నెల దాటినా ఇంటికే పరిమితం కావడం, ఎవరికి వారే నిర్వహణ ఖర్చులు భరించడంపై నిరాశ చెందుతున్నారు.

గణనాథుడికి ప్రత్యేక పూజలు

కొడవలూరు: మండలంలో వినాయక చవితి ఉత్సవాల సందర్భంగా మూడవరోజు కూడా గ్రామాల్లో గణనాథునికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.చంద్రశేఖరపురం,రాజుపాళెం సర్కారుతోపు వద్ద ఏర్పాటుచేసిన వినాయకుని విగ్రహం వద్ద స్వామివార్లకు ప్రత్యేక పూజల అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివార్త తీర్థప్రసాదాలు స్వీకరించారు. పలు గ్రామాల్లో ఆదివారం విగ్రహాలకు నిమజ్జన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా యువత కోలాహలంగా రంగులు చల్లుకుంటూ నిమజ్జన కార్యక్రమాన్ని నిర్వహించారు.

● ఇంటర్వ్యూ



1,119 మంది కొత్త ఓటర్లు

● చొప్పా రవీంద్రబాబు, తహసీల్దార్

? ఓటు హక్కు కోసం మొత్తం ఎంతమంది దరఖాస్తు చేసుకున్నారు

! మొత్తం 1119 మంది కొత్త ఓటర్లు దరఖాస్తు చేసుకున్నారు.

? కొత్త ఓటర్ల నమోదు కార్యక్రమం ఎన్ని పోలింగ్‌స్టేషన్లకు సంబంధించి ఎన్నిరోజులపాటు నిర్వహించారు

! మండలంలో మొత్తం 72పోలింగ్ స్టేషన్లకు సంబంధించి జూలై 1వతేదీ నుంచి 31వరకు ఓటరు నమోదు కార్యక్రమం జరిగింది.

? ఇప్పటి వరకు దరఖాస్తు చేసకున్న 1119 మంది కొత్త ఓటర్ల పేర్లన్నీ ఆన్‌లైన్‌లో నమోదయ్యాయా..

! ఓటుహక్కుకు నిబంధనల ప్రకారం అర్హత కలిగినవన్నీ నమోదౌతాయి

? కొత్త ఓటర్ల నమోదులో రాజకీయ నాయకుల ద్వారా దరఖాస్తులు స్వీకరిస్తున్నారన్న విమర్శలున్నాయి

! ఆ విధంగా స్వీకరించం. బీఎల్‌వోల ద్వారా దరఖాస్తులు స్వీకరిస్తారు. ఓటరు కుటుంబంలో ఎవరైనా ఒకరు దరఖాస్తు చేసుకుంటేనే స్వీకరిస్తాం.

- బుచ్చిరెడ్డిపాళెంరూరల్

కోలాహలంగా నిమజ్జనం

● మైపాడు బీచ్‌కు చేరిన వినాయక విగ్రహాలు ● పలుచోట్ల అన్నదానాలు

ఇందుకూరుపేట : మైపాడు బీచ్‌లో గణేష్ నిమజ్జనాలు ఆదివారం అత్యంత వైభవంగా నిర్వహించారు. చవితి తర్వాత మూడోరోజు, ఆదివారం కూడా కావడంతో పలు ప్రాంతాల నుంచి భారీ విగ్రహాలు భక్తజన సమూహంతో తరలిరావడంతో మైపాడు రహదారులు నిండిపోయాయి. సముద్రంలో నిమజ్జనం కోసం వాహనాలు క్యూలు కట్టడంతో కోలాహలం చోటు చేసుకుంది. తోటపల్లి గూడూరు, నెల్లూరు రూరల్, నెల్లూరు నగరం, ఇందుకూరుపేట మండలాలకు చెందిన పలు వినాయక విగ్రహాలు మైపాడు బీచ్‌కు తరలించడంతో తీరంలో ఎటు చూసిన గణనాథుల విగ్రహాలు దర్శనమిచ్చాయి. భక్తులు కూడా చూసేందుకు తరలిరావడంతో మరింత సందడి నెలకొంది. పోలీసులు కూడా అదనపు బలగాలతో ప్రత్యేక పహారా ఏర్పాటు చేశారు. ఎలాంటి ప్రమాదాలు జరగకుండా, ఒక్కసారిగా సముద్రంలోకి వెళ్లకుండా, వరుస క్రమంలో నిమజ్జానికి అనుమతి ఇస్తూ కట్టడి చేశారు. సాయంత్రం నాలుగు గంటల వరకు 80 విగ్రహాలు నిమజ్జనాలు జరిగినట్లు ఏఎస్‌ఐ మధు సూధనరావు తెలిపారు.

బుచ్చిరెడ్డిపాళెంరూరల్ : వినాయకచవితి పర్వదినం సందర్భంగా మండలంలోని పలు గ్రామీణ ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన గణేష్ విగ్రహాలకు వైభవంగా నిమజ్జనోత్సవాలు నిర్వహించారు. మండలంలోని పెనుబల్లి, సాల్మానుపురం గ్రామాలతోపాటు పలు గ్రామీణ ప్రాంతాల్లో ఏర్పాటైన పలు విగ్రహాలకు ఆదివారం నిమజ్జనోత్సవాలు జరిగాయి. పలు చోట్ల అన్నదాన కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. ఈసందర్భంగా నిర్వాహకులు గణేష్ విగ్రహాలకు ప్రత్యేక పుష్పాలంకరణ, విద్యుద్దీపాలంకరణ, బ్యాండుమేళాలు, డప్పులు చప్పుళ్లు, కీలుగుర్రాలు బాణాసంచాలతో పలు కూడళ్లు కళకళలాడాయి. యువతతోపాటు చిన్నాపెద్దా తేడాలేకుండా అందరూ ఆనంతోత్సాహాలతో కోలాహలంగా ఉత్సవాలలో రంగులు చల్లుకుంటూ వైభవంగా ఊరేగింపులు సాగించి అనంతరం జొన్నవాడ పెన్నానదిలో నిమజ్జనం చేశారు.

మండలంలోని దామరమడుగు, పల్లిపాళెం, కాలువకట్ట గిరిజనకాలనీ, ఇస్కపాళెం అరుంధతివాడ, రేబాల, పెనుబల్లి, సల్మానుపురం, కాళయకాగొల్లు, జొన్నవాడతోపాటు పలు గ్రామాలలో వైభవంగా ఉట్టి మహోత్సవాలు నిర్వహించి ఒకరిపై ఒకరురంగులు చల్లుకుంటూ ముందుగా ఉట్టిని గ్రామోత్సవంలో ఊరేగించి అనంతరం పలువురు యువకులు ఉట్టికొట్టారు.

కోవూరు: వినాయక చవితి పర్వదినాన్ని పురస్కరించుకుని ఏర్పాటుచేసిన గణనాథుని విగ్రహాల నిమజ్జనం ఆదివారం వైభవంగా జరిగాయి. కోవూరు మండలంలో వాడవాడలా గణనాథునికి ప్రత్యేక పూజా కార్యక్రమాలు, వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ప్రత్యేకంగా ఆలంకరించిన గణనాథుణ్ని ఆయా గ్రామాలలోని యువత భక్తి శ్రద్ధలతో ఊరేగించి నిమజ్జనం చేసింది.



ఇందుకూరుపేటలో..



సాల్మానుపురంలో..



కోవూరు: నిమజ్జనానికి తరలిస్తున్న వినాయక విగ్రహం



నార్తురాజుపాళెం సర్కార్‌తోపు వద్ద అన్నదాన కార్యక్రమం

పట్టపుపాళెంలో ఘర్షణలు

● 10 మందికి గాయాలు

ఇందుకూరు పేట : మైపాడు పట్టపుపాళెంలో రెండు వర్గాల మధ్య జరిగిన ఘర్షణలో పది మందికి గాయాలయ్యాయి. చవితి ఉత్సవాల సందర్భంగా రెండు వర్గాల మధ్య వివాదం రేగింది. ఇది ఉద్రిక్తతకు దారి తీసి ఘర్షణకు కారణమైందని పోలీసులు తెలిపారు. రెండు వర్గాలు మారణాయుధాలతో దాడి చేసుకోగా ఒక వర్గానికి చెందిన ఆరు మంది, మరో వర్గానికి చెందిన నాలుగురికి తీవ్ర రక్తపు గాయాలయ్యాయి. వీరిని నెల్లూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. రెండు వర్గాల నుండి ఫిర్యాదులు అందాయని, విచారణ జరుపుతున్నట్లు ఎస్సై బలరాంరెడ్డి తెలిపారు.

క్యాట్‌ఫిష్ చేపల పూడ్చివేత

తడ : నెల్లూరు నుండి మధురైకు తరలుతున్న 990 కేజీల క్యాట్‌ఫిష్‌ను పోలీసులు పట్టుకున్నారు. రెవెన్యూ, మత్స్యశాఖ అధికారుల సమక్షంలో శివాలయం వెనుకవైపు డంపింగ్‌యార్డ్ వద్ద గుంటతీసి పూడ్చిపెట్టారు.

అవినీతికి తావులేకుండా 'నీరు- ప్రగతి'

● కోవూరు ఎమ్మెల్యే పోలంరెడ్డి శ్రీనివాసులు రెడ్డి

బుచ్చిరెడ్డిపాళెం రూరల్ : అవినీతికి తావులేకుండా నాణ్యతాప్రమాణాలతో నీరుప్రగతి పథకం కింద నిర్మాణాలు సాగుతున్నాయని కోవూరు ఎమ్మెల్యే పోలంరెడ్డి శ్రీనివాసులురెడ్డి అన్నారు. ఆదివారం కోవూరు కాలువపై నిర్మాణ దశలో ఉన్న పలు కల్వర్టులను పెన్నాడెల్టా ప్రాజెక్టు కమిటీ ఛైర్మన్ యర్రంరెడ్డి గోవర్ధన్‌రెడ్డితో కలిసి పరిశీలించారు. నిర్మాణాలు పూర్తయిన, నిర్మాణ దశలో ఉన్న కల్వర్టులతోపాటు నిర్మాణాలకు నోచుకోవాల్సిన బ్రిడ్జిలను వారు పరిశీలించారు. శిథిలావస్థలో ఉన్న బ్రిటీష్ కాలం నాటి నిర్మాణాలను తొలగించి ఇప్పటి వరకు మొత్తం దాదాపు రూ.31కోట్ల 52లక్షల నిధులతో నియోజకవర్గంలో పలు కాలవలపై కేవలం కల్వర్టులు, బ్రిడ్జిలు, సైడ్‌వాల్స్ నిర్మాణం చేపట్టినట్లు ఎమ్మెల్యే తెలిపారు. ఈ కార్యక్రమంలో నీటిపారుదలశాఖ అధికారులు డీఈఈ. శంకర్‌నారాయణ, ఏఈఈ విజయభాస్కర్‌రెడ్డితోపాటు పలువురు టీడీపీ నాయకులు ఉన్నారు.

చెరువుల పూడికతీతకు విమర్శల బెంగ : ఈ సందర్భంగా రేబాలలోని యర్రంరెడ్డి నివాసంలో ఏర్పాటు చేసిన విలేఖర్ల సమావేశంలో కోవూరు ఎమ్మెల్యే పోలంరెడ్డి శ్రీనివాసులురెడ్డి మాట్లాడారు. చెరువులు పూడిక తీయాలంటే విమర్శల బెంగతో ముందుకు సాగలేకపోతున్నామని అన్నారు. గతంలో కోవూరు చెరువు పూడికతీతలో పలు అవకతవకలవల్ల విమర్శలు ఎదుర్కొన్నామన్నారు. ప్రస్తుతం అవినీతికి తావులేని నిర్మాణాలకు ప్రత్యక్షంగా పరిశీలిస్తూ అభివృద్ధికి కృషి చేస్తున్న తమకు మీడియా కూడా సహకరించాలన్నారు.

సంగం నుంచి ఊటుకూరు వరకు పెన్నాపరివాహక ప్రాంతంతోపాటు కనిగిరి రిజర్వాయర్ ఆక్రమణలకు గురైందన్నారు. ఏడాది క్రితమే చెరువుల పూడికతీతకు కలెక్టర్‌తో చర్చించినట్లు ఆయన తెలిపారు. మలిదేవి కాలువపై 25కిలోమీటర్లు పొడవునా పలు కల్వర్టులు, బ్రిడ్జిలు పునర్నిర్మాణాల నిమిత్తం రూ.92కోట్లతో ప్రతిపాదనలు పంపించినట్లు వారుతెలిపారు. రైతు సంక్షేమం, భూగర్భజలాల పెంపుదల, పచ్చదనం, గ్రామీణ ప్రాంతాల అభివృద్ధే ధ్యేయంగా ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు చేస్తున్న శ్రమ టీడీపీకే సాధ్యమన్నారు. ఈ కార్యక్రమంలో జొన్నవాడ ఆలయ ఛైర్మన్ పుట్టా సుబ్రహ్మణ్యంనాయుడు, బుచ్చి కోఆపరేటివ్ బ్యాంకు ఛైర్మన్ ఏటూరి శివరామకృష్ణారెడ్డి, టీడీపీ మండల అధ్యక్షుడు బత్తల హరికృష్ణ, పెనుబల్లి సాగునీటి సంఘం అధ్యక్షుడు కాటంరెడ్డి శశిధర్‌రెడ్డి, నేతలు డి. హరనాథ్, సన్నపురెడ్డి నారసింహారెడ్డి, తాళ్లస్వామి, టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



శ్రీరంగరాజపురం వద్ద కల్వర్టును పరిశీలిస్తున్న ఎమ్మెల్యే పోలంరెడ్డి

ఆర్థిక గండం నుంచి బయటపడ్డ వవ్వేరు రైతులు

బుచ్చిరెడ్డిపాళెం: పంటలు ఎండిపోయి నష్టపోతామనుకున్న మండల రైతుల్లో చిరునవ్వు మెరిసింది. రిజర్వాయర్‌ల్లో పంట చేతికి వచ్చే దశలో చుక్క నీరు లేకపోవడంతో పైర్లు ఎండిపోయే పరిస్థితి నెలకొన్నది. ఎకరాకు దాదాపుగా 15 నుంచి రూ.20 వేలు ఖర్చు చేశారు. రిజర్వాయర్‌ల్లో ఉన్న నీటితో పంటలు పండిపోతాయని 2 వేల ఎకరాల్లో రెండవ పంట సాగు చేశారు.ఈ నేపథ్యంలో రిజర్వాయర్‌ల్లో ఉన్న నీటిని పంటల సాగుకు వినియోగించడంతో చివరికి వచ్చేటప్పటికి ఆఖరు తడికి నీరు అందలేదు. వరి పైర్లు నిలువునా ఎండిపోయి సుమారు రూ. 4 కోట్లను రైతులు నష్టపోయే పరిస్థితి ఏర్పడింది. వానలు ముఖం చాటేయడంతో పొలాలకు నీరు అందని పరిస్థితి. సోమశిల జలాశయంలో డెడ్ స్టోరేజిలో 7 టీఎంసీల లోపల నీరు ఉండడం అక్కడ నుంచి రిజర్వాయర్‌కు నీటిని తరలించాలన్నా వీలుపడని పరిస్థితి. కలెక్టర్‌ను వేడుకుంటే సాగునీరు అందించేందుకు ఆయన ఒప్పుకుంటాడేమోననే చిన్న ఆశ రైతుల్లో మెదిలింది.ఓ పక్క చేతికి వచ్చే దశలో ఉన్న వరి పైర్లు వాడు ముఖం పడుతున్నాయి. కళ్ల ఎదుటే పంటలు ఎండిపోతుంటే వాటిని కాపాడుకోలేని నిస్సాహాయ పరిస్థితి రైతుల్లో నెలకొన్నది. అప్పుడు రైతుల మొర ఆలకించి సోమశిల జలాశయంలో డెడ్ స్టోరేజిలో నీరు ఉన్నా ఒక్క తడికి నీరిచ్చి ఆదుకోవాలని కలెక్టర్ ఆలోచించి నిర్ణయం తీసుకొన్నారు.14 నుంచి 20వ తేదీ వరకు 300 క్యూసెక్కుల లెక్కన కనిగిరి రిజర్వాయర్‌కు నీటిని విడుదల చేసి వాడు ముఖం పట్టిన వరి పైర్లకు సాగునీరు అందించారు.ఈ నేపథ్యంలో రైతులు పంటలు ఎండిపోయి పెట్టిన ఖర్చులు చేతికి అందక ఆర్థికంగా నష్టపోతామనుకొనే రైతుల ముఖాల్లో చిరునవ్వు కనిపించింది.సోమశిల జలాలతో పైర్లకు సాగునీరు అందిన రోజు రాత్రే వరుణదేవుడు కరుణించి వర్షం కురిపించాడు. పరిస్థితులు అనుకూలించి సాగునీరు అందడంతో రైతులు నష్టాల గండం నుంచి బయటపడే పరిస్థితి నెలకొన్నది.

మూడు రోజులుగా పూజలందుకున్న గణనాథులు ఆదివారం బాణ సంచా పేలుళ్లు, మంగళవాయిద్యాల నడుమ నిమజ్జనానికి తరలివెళ్లారు. యువకులు రంగులు చల్లుకుంటూ, కేరింతలు కొడుతూ ఉత్సాహంగా కార్యక్రమంలో పాల్గొన్నారు. పలు గ్రామాల్లో లడ్డూ వేలం, ఉట్టి ఉత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా పలుచోట్ల అన్నదానం చేశారు



వేలంలో దక్కించుకున్న స్వామివారి లడ్డూ ప్రదర్శిస్తున్న యువకుడు

గణపతి బప్పా.. మోరియా

ఉదయగిరి: ఉదయగిరి మండలంలోని గడ్డంవారిపల్లి, మిట్టపల్లి, జెట్టివారిపల్లి, నేలటూరు, కొట్టాలపల్లి, సర్వరాబాదుతోపాటు ఉదయగిరి పట్టణంలోని యానియన్‌రోడ్డు, అన్నపూర్ణానగర్, సుద్దబావివీధి తదితర ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన గణనాథులను కావలి సమీపంలోని తుమ్మలపెంట, పాపంపల్లి, గండిపాళెం జలాశయానికి నిమజ్జనానికి తరలించారు. జీ.చెరువుపల్లిలో సర్పంచ్ కప్పా శ్రీనివాసరాజు ఆధ్వర్యంలో నిమజ్జనం కార్యక్రమం నిర్వహించారు. యువకులు రంగు నీళ్ల చల్లుకుంటూ ఉట్టి కొట్టే కార్యక్రమంలో ఉత్సాహంగా పాల్గొన్నారు.

సీతారామపురం: సీతారామపురం, గుండుపల్లి, మారంరెడ్డిపల్లి, నాగరాజుపల్లి, సింగారెడ్డిపల్లి, నాంచారమ్మపల్లి తదితర గ్రామాల్లో కొలువు దీరిన గణనాథులను ఆదివారం నిమజ్జనం చేశారు. మేళతాళాలు, బాణసంచా పేలుళ నడుమ నిర్వహించిన ఊరేగింపులో భక్తులు పెద్దఎత్తున పాల్గొన్నారు.

వరికుంటపాడు: వరికుంటపాడు, ఆంధ్రావారిపల్లి, కనియంపాడు, తూర్పుచెన్నంపల్లి, వేంపాడు, గొల్లపల్లి ఎస్సీ కాలనీ, పెద్దిరెడ్డిపల్లి తదితర గ్రా మాల్లో వేదపండితులు గణనాథులకు పూజలు నిర్వహించారు. అనంతరం అన్నదానం చేశారు. లడ్డూ వేలం, ఉట్టి మహోత్సవంలో యువత ఉత్సాహంగా పాల్గొన్నారు.

దుత్తలూరు: ముత్తరాశిపల్లి, కొత్తపేట, నందిపాడు, బ్రహ్మేశ్వరం, ఏరుకొల్లు, రాచవారిపల్లి, దుత్తలూరు గ్రామాల్లో నిమజ్జనోత్సవాలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు.



దుత్తలూరు: నిమజ్జనోత్సవంలో చిన్నారులు

ఉదయగిరి రూరల్: గండిపాళెం, గంగిరెడ్డిపల్లి, గానుగపెంటపల్లి, వెంకట్రావుపల్లి, చెర్లోపల్లి, అప్పసముద్రం, సున్నంవారిచింతల, గుడినరవ, తిరుమలాపురం, అప్పసముద్రం తదితర గ్రామాల్లో గ్రామోత్సవాలు నిర్వహించారు. కొన్ని గ్రామాల్లో ఐదు, తొమ్మిది రోజులకు నిమజ్జనోత్సవం నిర్వ హించనున్నారు

వింజమూరు: వింజమూరులోని నడిమూరు, ఇందిరానగర్, బంగ్లాసెంటర్ తదితర ప్రాంతాల్లోని గణనాథులు నిమజ్జనానికి తరలారు. వాహనాలను విద్యుత్ దీపాలతో అలంకరించి బాణసంచా పేలుళ్ల మధ్య సముద్రానికి తరలించారు.

పోటాపోటీగా లడ్డూల వేలం

ఉదయగిరి రూరల్: వినాయక చవితి ఉత్సవాల్లో భాగంగా నిర్వహించిన లడ్డూల వేలం పాటలు ఆదివారం పోటాపోటీగా సాగాయి. వెంగళరావునగర్ గ్రామంలో వినాయకుని లడ్డూను బచ్చల వెంకటేశ్వర్లు అనే వ్యక్తి రూ.11 వేలకు దక్కించుకున్నారు. చెరువుపల్లి, గండిపాళెం, ఉదయగిరి, గంగిరెడ్డిపల్లి గ్రామాల్లో లడ్డూల వేలం పాటలు పోటాపోటీగా సాగాయి.



వరికుంటపాడు: నిమజ్జనానికి తరలివెళుతున్న వినాయకుడు



ఉదయగిరి రూరల్: గణనాథునికి పూజలు చేస్తున్న చిన్నారులు

దోమల దండయాత్ర

- గ్రామాల్లో పారిశుధ్యం అధ్వానం
- నివారణ చర్యలు శూన్యం

ఉదయగిరి: నియోజకవర్గంలోని పలు గ్రామాల్లో దోమలు ప్రజలకు కంటిమీద కునుకు లేకుండా చేస్తున్నాయి. ఆయా గ్రామాల్లో పంచాయతీ అధికారులు దోమల నివారణకు చర్యలు తీసుకోవడంలేదని ప్రజలు ఆరోపిస్తున్నారు.

రోడ్లపైనే మురుగు నీరు

గ్రామీణ ప్రాంతాల్లో ఇళ్ల నుంచి వచ్చే మురుగు నీరు రోడ్లపైనే పారుతోంది. మంచినీటి పథకాలు, బోర్లు, కొళాయిల వద్ద నీరు నిలిచి దుర్గంధం వెదజల్లుతోంది. ఉదయగిరి మండలంలోని జీ.అయ్యవారిపల్లి, పుల్లాయపల్లి, కృష్ణంపల్లి, కొండాయపాళెం, గుడినరవ, వెంగళరావునగర్, సీతారామపురం మండలం బసినేనిపల్లి, పోలంగారిపల్లి, పడమటి రొంపిదొడ్ల, దుత్తలూరు మండలం సోమలరేగడ, వెంకటంపేట, చింతలగుంట, వరికుంటపాడు మండలం జడదేవి, విరువూరు, పెద్దిరెడ్డిపల్లి, వింజమూరుల్లో వీధుల్లో చెత్త పడేయడంతో వీధులు దారుణంగా తయారయ్యాయి.



రోడ్లపై నిలచిన మురుగు

చిన్నపాటి వర్షానికే

ఇటీవల అడపాదడపా కురుస్తున్న గ్రామాల్లోని రోడ్లు బురదమయమయ్యాయి. దీంతో దోమల బెడద అధికమైంది. మురికినీరు నిల్వ ఉండడంతో దోమలు విజృంభిస్తున్నాయి. కొన్ని ప్రాంతాల్లో పందులు స్వైరవిహారం చేస్తున్నాయి.

దండగ యాత్ర



గతేడాది ప్రభుత్వం దోమలపై దండయాత్ర అని ఆర్భాటం చేసింది. ఈ కార్యక్రమంతో ప్రజలకు ఏలాంటి ప్రయోజనం చేకూరలేదు.

\- షేక్ జన్నత్

నిద్ర కరువు



దోమల కారణంగా రాత్రి వేళల్లో కంటి మీద కునుకు కరువైంది. విద్యుత్ అంతరాయం ఏర్పడితే దోమల రొద, దాడి భరించలేకున్నాం.

\- సొహల్

అధికారులు స్పందించాలి



గ్రామాల్లో పారిశుధ్యం మెరుగుకు పాలకులు, అధికారులు చర్యలు తీసుకోవాలి. దోమల నివారణకు చర్యలు తీసుకుని వాటి బారినుంచి రక్షించాలి.

\- చెన్నరాయుడు

పారిశుధ్య పనులు చేపడుతున్నాం



పారిశుధ్యం మెరుగుకు చర్యలు చేపడుతున్నాం. మురుగు నీటిలో బ్లీచింగ్ చల్లి చెత్తాచెదారాన్ని తొలగించి పారిశుధ్యంపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నాం.

\-షేక్ కరీముల్లా, పంచాయతీ కార్యదర్శి

లబ్ధిదారులు రుణాలు పొందాలి

వింజమూరు: మండల పరిధిలో వివిధ కార్పొరేషన్ల ద్వారా సబ్సిడీ రుణాలు పొందిన లబ్ధిదారులు బ్యాంకులను సంప్రదించి తమ రుణాలను మంజూరు చేయించుకోవాలని మండల టీడీపీ కన్వీనర్ చల్లా వెంకటేశ్వర్లు ఆదివారం తెలిపారు. 2015-16, 2016-17 ఆర్థిక సంవత్సరాలకు రుణాలు పొంది గ్రౌండింగ్ అయిన లబ్ధిదారులు బ్యాంకు మేనేజర్లను సంప్రదించి ఈనెల 31వ తేదీలోపు తమ రుణాలు పొందవచ్చని ఆయన తెలిపారు.

వర్షం కోసం సంకల్ప ధ్యానం

వింజమూరు: పుష్కలంగా వర్షం కురిసి భూగర్భజలం పెరగాలని స్థానిక సాయిబాబా ఆలయంలో ఆదివారం సంకల్ప ధ్యానం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ప్రముఖ ఆధ్యాత్మికవేత్త వైదేహి, శ్రీవల్లి హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు .సందేశమిస్తూ పర్యావరణ సమతుల్యతను సాధించేందుకు ప్రకృతిలోని అన్ని జీవరాశులు ప్రశాంతంగా జీవించేందుకు మానవుడు అన్ని జీవులపై కరుణ కలిగి ఉండాలన్నారు. జీవులకు ప్రాణాధారమైన నీటి వనరులు కళకళలాడాలంటే వర్షం కురవాలని సంకల్ప ధ్యానం చేయడమే మార్గమన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక పిరమిడ్ మాస్టార్ వి.వెంకటేశ్వర్లు, ధ్యానులు, భక్తులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

సూచిక బోర్డులు ఏర్పాటు చేయండి

ఉదయగిరి: మండల పరిధి లింగాలదొన ఆశ్రమానికి వెళ్ళే దారిలో అతి ప్రమాదకరమైన మలుపు ఉంది. ఈ మలుపులో రోడ్డు రవాణా భవనాల శాఖాధికారులు సూచిక బోర్డులు ఏర్పాటు చేయలేదు. దీంతో తరుచూ ప్రమాదాలు సంభవిస్తున్నాయి. ఇప్పటికైనా అధికారులు సూచిక బోర్డులు ఏర్పాటు చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది.



ప్రమాదకరంగా మలుపు

నిర్మించినా.. నిరుపయోగమే!

- నీటి వసతిలేని మరుగుదొడ్లు
- పలు పాఠశాలల్లో ఇదే దుస్థితి

ఉదయగిరి రూరల్: మండలంలోని పలు పాఠశాలల్లో మరుగుదొడ్లు నీటి వసతి లేక నిరుపయోగంగా మారాయి. విద్యార్థి దశ నుంచే విద్యార్థులు పరిశుభ్రత అలవర్చుకోవాలనే ఉద్దేశంతో ప్రభుత్వం ప్రతి పాఠశాలల్లో లక్షల రూపాయలు వెచ్చించి మరుగుదొడ్లు నిర్మించింది. కానీ నీటి వసతిలేకపోవడంతో నిరుపయోగంగా మారాయి. మండలంలోని ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలు 60 ఉండగా, 70 శాతం పాఠశాలల్లో నీటి వసతి అలంకారప్రాయంగా మారాయి. దీంతో అత్యవసర పరిస్థితుల్లో విద్యార్థినులు, ఉపాధ్యాయినుల అవస్థలు వర్ణనాతీతంగా మారాయి. ఇటీవల పంచాయతీరాజ్ శాఖ ఆధ్వర్యంలో మండల పరిధిలోని గుడినరవ, వీరారెడ్డిపల్లి, తిరుమలాపురం తదితర గ్రామాల పాఠశాలల్లో నిర్మించిన మరుగుదొడ్లు నిరుపయోగంగా మారాయి. ఆయా పాఠశాలల్లో స్వచ్ఛభారత్‌లో భాగంగా పలువురు దాతలు నిర్మించిన ఈ-టాయిలెట్స్ సైతం అలంకారప్రాయంగా మారాయి. ఇప్పటికైనా సంబంధిత ఉన్నతాధికారులు సత్వరమే స్పందించి మరుగుదొడ్లకు నీటి సౌకర్యం కల్పించి మరుగుదొడ్లను వినియోగంలోకి తీసుకురావాలని పలువురు కోరుతున్నారు.



వెంకట్రావుపల్లి పాఠశాలలో నిరుపయోగంగా మరుగుదొడ్డి



అలంకార ప్రాయంగా ఈ-టాయిలెట్స్

కూలీల కొరతతో రైతులకు ఇబ్బందులు



కూలీలను తరలిస్తున్న వాహనం

ఉదయగిరి రూరల్: కూలీల కొరత తీవ్రంగా వేధిస్తుండడంతో రైతులకు కష్టాలు తప్పడంలేదు. ఉదయగిరి వ్యవసాయ సబ్ డివిజన్‌లో ఇటీవల అడపాదడపా వర్షాలు కురుస్తుండడంతో రైతులు కంది, వేరుశనగ, మినుము, పెసర పంటల సాగుకు సమాయత్తమవుతున్నారు. మరోవైపు సజ్జ, పొద్దుతిరుగుడు, పసుపు తదితర పంటలు సాగులో ఉన్నాయి. ఆయా పంటల్లో కలుపు తీసేందుకు కూలీలు అందుబాటులో లేకుండా పోయారు. మరోవైపు బత్తాయి కోతలు సైతం సాగుతుండడంతో కూలీలకు డిమాండ్ పెరిగింది. దీంతో మర్రిపాడు, వింజమూరు, వరికుంటపాడు మండలాల నుంచి అధిక మొత్తం చెల్లించి కూలీలను వాహనాల్లో తరలిస్తున్నారు.

దినఫలాలు

అదృష్టసంఖ్యలు: 1, 9

మేషరాశి: (మార్చి21-ఏప్రిల్20): రుణాలు మంజూరవుతాయి. సన్నిహితుల ఆంతరంగిక విషయాల్లో జోక్యం చేసుకోవాల్సి రావచ్చు. పొదుపు పథకాల గురించి సహోద్యోగులతో చర్చిస్తారు. ఆస్పత్రులు, ఔషధ రంగాల వారికి ప్రోత్సాహకరం.

వృషభరాశి: (ఏప్రిల్21-మే20): స్పెక్యులేషన్లు లాభిస్తాయి. శ్రీవారు, శ్రీమతి విషయాల్లో శుభపరిణామాలు చోటుచేసుకుంటాయి. ప్రేమానుబంధాలు బలపడతాయి. కొత్త పరిచయాలు ఉల్లాసం కలిగిస్తాయి. ఆర్థిక పరిస్థితి ప్రోత్సాహకరం.

మిథునరాశి: (మే21-జూన్21): వృత్తి, వ్యాపారాల్లో మార్పులు, చేర్పులకు అనుకూలం. సహోద్యోగుల ఆంతరంగిక విషయాల్లో జోక్యం చేసుకోవాల్సి రావచ్చు. ఉద్యోగ ప్రయత్నాలు కొలిక్కి వస్తాయి. ఆరోగ్యం పట్ల శ్రద్ధ చూపుతారు.

కర్కాటకరాశి: (జూన్22-జూలై23): పొదుపు పథకాలు, చిట్‌ఫండ్‌లు లాభిస్తాయి. మెయిల్స్, శుభ సందేశాలు అందుకుంటారు. సాంకేతిక విద్యా కోర్సుల్లో ప్రవేశానికి అనుకూలం. ప్రేమానుబంధాలు బలపడతాయి. విద్యార్థులకు శుభప్రదం.

సింహరాశి: (జూలై24-ఆగస్ట్23): కుటుంబ సభ్యుల సహకారంతో ఆర్థిక విషయాల్లో లక్ష్యాలు సాధిస్తారు. ఇంటి కోసం విలువైన వస్తువులు కొనుగోలు చేస్తారు. ఆర్థిక విషయాలను సమీక్షించుకుంటారు. రుణాలు మంజూరవుతాయి.

కన్యారాశి: (ఆగస్ట్24-సెప్టెంబర్23): సోదరీ, సోదరుల వ్యవహారాలు, ప్రయాణాలు, చర్చలకు అనుకూల సమయం. వాహనాలు కొనుగోలు చేస్తారు. స్టేషనరీ, ఏజెన్సీలు, మార్కెటింగ్, బోధన రంగాల వారికి శుభప్రదం. శుభవార్త అందుకుంటారు.

తులారాశి: (సెప్టెంబర్24-అక్టోబర్23): ఆర్థిక వ్యవహారాలకు సంబంధించిన కీలక సమాచారం అందుకుంటారు. రాజకీయ, సినీరంగాల వారికి ఆర్థికంగా ప్రోత్సాహకరం. పెట్టుబడులను సమీక్షించుకుంటారు. పాత బకాయిలు వసూలవుతాయి.

వృశ్చికరాశి: (అక్టోబర్24-నవంబర్22): స్నేహానుబంధాలు విస్తరిస్తాయి. యూనియన్‌లు, సహకార సంఘాల కార్యక్రమాల్లో కీలకపాత్ర పోషిస్తారు. వేడుకల్లో పాల్గొంటారు. ఊరేగింపులు, ప్రదర్శనల్లో పాల్గొంటారు. సంకల్పం నెరవేరుతుంది.

ధనూరాశి: (నవంబర్23-డిసెంబర్21): ఉన్నత విద్య, విదేశీ వ్యవహారాల్లో ప్రముఖుల సహకారంతో లక్ష్యాలు సాధిస్తారు. రాజకీయ, సినీ, బోధన రంగాల వారు గౌరవ పదవులు అందుకుంటారు. పూర్వానుభవంతో లక్ష్యాలు సాధిస్తారు.

మకరరాశి(డిసెంబర్22-జనవరి21): న్యాయ, రక్షణ, బోధన రంగాల వారికి ఆర్థికంగా ప్రోత్సాహకరం. పెట్టుబడులకు సంబంధించిన సమాచారం సేకరిస్తారు. బ్యాంకులు, ఆర్థిక సంస్థలతో పనులు పూర్తవుతాయి. సంకల్పం నెరవేరుతుంది.

కుంభరాశి: (జనవరి22-ఫిబ్రవరి18): పెద్దల ఆరోగ్యం మెరుగుపడుతుంది. వృత్తి, వ్యాపారాల్లో పురోగతిని సమీక్షించుకుంటారు. ప్రముఖుల సహకారంతో ఆర్థికపరమైన లక్ష్యాలు సాధిస్తారు. శ్రమకు తగిన ఫలితం అందుకుంటారు.

మీనరాశి:(ఫిబ్రవరి19మార్చి20): బంధుమిత్రులతో ఉల్లాసంగా గడుపుతారు. న్యాయ, రక్షణ, బోధన రంగాల వారు ప్రణాళికాబద్ధంగా వ్యవహరించి లక్ష్యాలు సాధిస్తారు. సమావేశాలకు సన్నాహాలు చేస్తారు. సంకల్పం ఫలిస్తుంది.

-బిజుమళ్ళ బిందుమాధవ శర్మ

బస్సుల్లో బాదుడు!

● వరుస సెలవులతో రద్దీ
● భారీగా చార్జీల పెంపు
● లబోదిబోమంటున్న ప్రయాణికులు



నెల్లూరు (క్యాంపస్) : వినాయక చవితి పండుగను సొంతూరులో జరుపుకునేందుకు వచ్చిన ప్రజలకు తిరుగు ప్రయాణం మోయలేనంత భారంగా మారింది. వరుస సెలవుల అనంతరం ఆదివారం రాత్రి ప్రజలు అధిక సంఖ్యలో తిరుగు ప్రయాణమయ్యారు. ఇదే అదునుగా ప్రైవేటు, ప్రభుత్వ బస్సుల వారు భారీగా చార్జీలు పెంచి ప్రయాణికులను దోచుకున్నారు. ప్రైవేటు యాజమాన్యాలు తమకు ఇష్టం వచ్చినట్లు టిక్కెట్ల ధరలు పెంచితే ఆర్టీసీలో స్పెషల్ బస్సుల పేరుతో 50 శాతం అదనపు చార్జీ వసూలు చేశారు.

జిల్లా నుంచి ఆదివారం రాత్రి బెంగళూరు, హైదరాబాదు, చెన్నైవైపు వెళ్లే బస్సుల చార్జీలను ప్రైవేటు ట్రావెల్స్ వారు రెండింతలు పెంచారు. కొన్ని బస్సుల్లో చార్జీలు మూడింతలు పెరిగాయి. ప్రధానంగా బెంగళూరు వెళ్లే బస్సులలో చార్జీలు పోటాపోటీగా పెంచారు. కొందరు టికెట్‌కు రూ.3 వేలు కూడా వసూలు చేసినట్లు తెలిసింది. ఈ దందా మొత్తం ఆన్‌లైన్ ద్వారానే జరగడం గమనార్హం. ఇక ఆర్టీసీ విషయానికి వస్తే, ప్రయాణికుల రద్దీ దృష్ట్యా అదనపు బస్సులు ఏర్పాటు చేసి సాధారణ చార్జీకంటే సగం ఎక్కువ వసూలు చేశారు. బెంగళూరుకు 22, హైదరాబాదుకు 18 స్పెషల్ బస్సులు నడిపారు. సహజంగా సూపర్ లగ్జరీ బస్సులో బెంగళూరుకు చార్జీ రూ.531 ఉండగా, స్పెషల్ బస్సుల్లో రూ.796 వసూలు చేశారు. హైదరాబాదుకు సూపర్ లగ్జరీ బస్సు చార్జీ రూ.608 కాగా, స్పెషల్ బస్సులో రూ.912 వసూలు చేశారు. మొత్తం మీద పండుగకు వచ్చిన ప్రజలకు తిరుగు ప్రయాణం భారంగా మారుతోంది.

ఉపాధ్యాయుల బదిలీలపై విచారణ జరపాలి

● 1న మిలియన్ మార్చ్ ● ఏపీటీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెంకటేశ్వరరావు

నెల్లూరు (క్యాంపస్) : జిల్లాలో ఇటీవల జరిగిన ఉపాధ్యాయుల బదిలీల్లో అనేక అక్రమాలు జరిగాయని ఈ నేపథ్యంలో బదిలీల ప్రక్రియపై సమగ్ర విచారణ జరిపించాలని ఏపీటీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కే వెంకటేశ్వరరావు డిమాండ్ చేశారు. నెల్లూరులోని ఏపీటీఎఫ్ కార్యాలయంలో ఆదివారం జిల్లా కార్యవర్గ సమావేశం జరిగింది. ఆయన మాట్లాడుతూ సీపీఎస్ రద్దుకోసం సెప్టెంబర్ 1న విజయవాడలో జరిగే మిలియన్ మార్చ్ కార్యక్రమానికి ఏపీటీఎఫ్ సంపూర్ణ మద్దతు ప్రకటిస్తోందన్నారు. స్వయం పోషిత బిల్లును ఉపసంహరించుకోవాలని, ఉర్దూ పాఠశాలల్లో ఉర్దూ తెలుగు మీడియం కూడా కొనసాగించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు ఎస్ చిరంజీవి, ఐపియా జాతీయ ఉపాధ్యక్షుడు కే సుబ్బారెడ్డి, రాష్ట్ర ఆడిట్ కమిటీ సభ్యులు డీ తిరుపతిరెడ్డి, ఎస్ మోహన్‌దాస్, ఎస్‌కే ఇమామ్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న వెంకటేశ్వరరావు

1న విజయవాడలో మిలీనియం మార్చ్

నెల్లూరు (వేదాయపాళెం) : ప్రభుత్వ ఉద్యోగులకు శాపంలా మారిన సీపీఎస్ విధానాన్ని రద్దు చేయాలని కోరుతూ సెప్టెంబర్ 1వ తేదీన విజయవాడలో మిలీనియం మార్చ్ జరుగుతుందని, జిల్లాలోని ప్రభుత్వ ఉద్యోగులు తరలిరావాలని యాదవ ఎంప్లాయిస్ సొసైటీ (వైఈఎస్) అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు నాగళ్ల రవీంద్ర, జీ శ్రీనివాసులు పిలుపునిచ్చారు. నెల్లూరులోని సంఘం కార్యాలయంలో ఆదివారం వారు మాట్లాడుతూ ప్రభుత్వం ఉద్యోగం అంటే ఒక భరోసా అని, ప్రస్తుతం అది కరువైందన్నారు. ఈ కార్యక్రమంలో పీ శ్రీనివాసులు, ఓట్టూరు పాపయ్య, డీ వెంకటేశ్వర్లు, హాజరతయ్య తదితరులు పాల్గొన్నారు.

నేడు రాష్ట్ర స్థాయి కరాటే పోటీలు

నెల్లూరు (సాంస్కృతికం) : సినీనటుడు సుమన్ జన్మదినం సందర్భంగా ఆల్ ఇండియా సుమన్ యువసేన ఆధ్వర్యంలో సోమవారం రాష్ట్రస్థాయి కరాటే చాంపియన్‌షిప్ పోటీలు నిర్వహిస్తున్నట్లు యువసేన జిల్లా అధ్యక్షుడు ఎస్‌కే ఏ రషీద్ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఈ పోటీలు నెల్లూరు పురమందిరంలో ఉదయం 9 గంటల నుంచి రాత్రి 9 గంటల వరకు జరుగుతాయన్నారు. విజేతలకు సెప్టెంబర్ 17వ తేదీ సాయంత్రం టౌను హాలులో జరిగే వేడుకల్లో హీరో సుమన్ బహుమతులు ప్రదానం చేస్తారని తెలిపారు. ఈ పోటీలకు ముఖ్య అతిథులుగా డిప్యూటీ మేయర్ ముక్కాల ద్వారకానాథ్, అమరావతి కృష్ణారెడ్డి, హోంగార్డ్ డీఎస్పీ శ్రీనివాసరావు హాజరవుతారని, కరాటే క్రీడాకారులందరూ పాల్గొనాలని కోరారు.

గ్రంథాలయ సంస్థకు చైర్మన్‌ను నియమించండి

నెల్లూరు (సాంస్కృతిక ప్రతినిధి) : రాష్ట్ర గ్రంథాలయ సంస్థకు చైర్మన్‌ను తక్షణం నియమించి, తెలుగు పుస్తకానికి, భాషకు ఊతమివ్వాలని రాష్ట్ర రచయితల సంఘం కార్యదర్శి చిన్ని నారాయణరావు ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. నాలుగేళ్లుగా చైర్మన్‌ను నియమించలేదని, దీంతో తెలుగు భాషకు జీవం పోసే రచయితలు, కవుల వద్ద పుస్తక ముద్రణలు ఆగిపోయాయన్నారు. తెలంగాణ ప్రభుత్వం గ్రంథాలయ సంస్థకు చైర్మన్‌ను నియమించి, పుస్తక కొనుగోళ్లు వేగవంతంగా చేస్తున్నా నవ్యాంధ్రలో ఆ ఊసే లేకపోవడం విచారకరమన్నారు. ఇప్పటికైనా రాష్ట్ర చైర్మన్‌ను నియమించి, పుస్తక కొనుగోళ్లు జరిపి, తెలుగు భాషాభివృద్ధికి కృషి చేయాలని కోరారు.

రేపు సీపీఎస్ వ్యతిరేక దీక్ష

నెల్లూరు (క్యాంపస్) : సీపీఎస్ విధానాన్ని రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 29న కలెక్టరేట్ ఎదుట దీక్ష చేపడుతున్నట్లు ఎస్‌టీయూ జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు జీ వేణుగోపాల్, ఎస్ రవిరాజు ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఈ దీక్షకు జిల్లాలోని ఉద్యోగ, ఉపాధ్యాయులందరూ తరలిరావాలని కోరారు.

బంగారం, వెండి ధరలు

22 క్యారెట్స్ బంగారం

గ్రాము ధర	-	2,780
సవర (8 గ్రాములు)	-	22,240
వెండి కిలో ధర	-	42,000
వెండి గ్రాము ధర	-	42.00

చికెన్ ధరలు

వెన్‌కాబ్..

బాయిలర్ రైతు ధర	83
లేయర్	98
స్కిన్ చికెన్	137
స్కిన్‌లెస్ చికెన్	162
లేయర్ మాంసం	140

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్..

బాయిలర్ లైవ్	97
లేయర్ లైవ్	82
స్కిన్ చికెన్	150
స్కిన్‌లెస్	188
లేయర్	140

జీఎస్‌టీ రిటర్న్ కోసం 'వెప్' డిజిటల్ సాఫ్ట్‌వేర్

నెల్లూరు (సాంస్కృతికం) : జీఎస్‌టీ రిటర్న్స్ దాఖలు చేయడానికి కేంద్ర ప్రభుత్వ గుర్తింపు పొందిన వెప్ డిజిటల్ సాఫ్ట్‌వేర్‌ను ఉపయోగించాలని జిల్లాలోని ఆడిటర్లను చార్టెడ్ అకౌంటెంట్స్ ఆఫ్ ఇండియా నెల్లూరు శాఖ అధ్యక్షుడు ఏ వెంకటశేషయ్య, కార్యదర్శి లక్ష్మీప్రసన్న కోరారు. నెల్లూరు దర్గామిట్టలోని వెప్ డిజిటల్ ఫ్రాంచైజి అమ్మునూరు టెక్నాలజీ వారు ఆదివారం జీఎస్‌టీపై ఆడిటర్లకు అవగాహన సదస్సు నిర్వహించారు. ముఖ్య అతిథులుగా పాల్గొన్న వెంకట శేషయ్య, లక్ష్మీ ప్రసన్న మాట్లాడుతూ రిటైలర్లు సేల్సు, అమ్మకాలతో పూర్తి రిటర్న్స్ దాఖలు చేసేందుకు ఆగస్టు 25వ తేదీతో గడువు తీరిపోయిందన్నారు. వ్యాపారులు జీఎస్‌టీ ఆర్-1 (అమ్మకాలు)ను సెప్టెంబర్ 10వ తేదీ, జీఎస్‌టీ ఆర్-2 (కొనుగోళ్లు)ను సెప్టెంబర్ 15వ తేదీలోపు దాఖలు చేయాలని కోరారు. ఆ రెండూ కలిపి ఫైనల్ రిటర్న్స్ జీఎస్‌టీ ఆర్-3ని సెప్టెంబర్ 20వ తేదీన దాఖలు చేయాలని సూచించారు.

ఈ రిటర్న్స్ దాఖలుకు అవసరమైన వెప్ సాఫ్ట్‌వేర్‌ను వ్యాపారులకు అందజేస్తున్నందుకు అమ్మునూరు టెక్నాలజీస్ అధినేత చరణ్‌ను అభినందించారు.

ఓపెన్ వర్సిటీలో ప్రవేశానికి 7 వరకు గడువు

నెల్లూరు (క్యాంపస్) : డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీలో డిగ్రీ కోర్సులో ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఆ వర్సిటీ డీకేడబ్ల్యూ కళాశాల అధ్యయన కేంద్రం సంయుక్త కార్యదర్శి జీ పద్మప్రియ తెలిపారు. ఆసక్తి గల వారు సెప్టెంబర్ ఏడో తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలన్నారు. డీకే కళాశాలలో ఆదివారం ఓపెన్ యూనివర్సిటీ కౌన్సెలర్లతో సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ ఈ విద్యా సంవత్సరం నుంచి వర్సిటీలో సీబీసీఎస్‌ను ప్రవేశపెట్టారని, ఈ విధానం ద్వారా విద్యార్థుల్లో సామర్థ్యం, నైపుణ్యం విలువలు పెంచవచ్చన్నారు. ఈ విధానంపై అందరూ అవగాహన పెంచుకోవాలని సూచించారు.

నిమ్మ ధరలు (బస్తా) గూడూరు

పచ్చివి: రూ.2,500 నుంచి రూ. 3,200 వరకు
పండ్లు: రూ.1,500 నుంచి రూ.2,000 వరకు

జలాశయాల్లో నీటిమట్టాలు

సోమశిల

పూర్తి సామర్థ్యం:		78 టీఎంసీలు
ప్రస్తుత నీటినిల్వ:		10.50 టీఎంసీలు
ఇన్‌ఫ్లో :		23601 క్యూసెక్కులు
అవుట్‌ఫ్లో	:	550 క్యూసెక్కులు
ఆవిరి	:	50 క్యూసెక్కులు

సంగం ఆనకట్ట

నీటిమట్టం	: -------------
కనిగిరికాలువ :	-------------
ఎడమ కాలువ :	-------------
కనుపూరు కాలువ:	-------------
బీపీఆర్ కాలువ :	-------------
నెల్లూరుచెరువుకాలువ :	------------

టంగ్ ట్విస్టర్స్

1. Clean clams crammed in clean cans.
2. There those thousand thinkers were thining how did the other three thieves go through.
3. Singing Sammy sung songs on sinking sand.
4. Picky people pick Peter Pan PeanutButter, 'tis the peanut-butter picky people pick.

సూక్తి

అసత్యంతో సాధించే విజయం కంటే.. సత్యంతో సాధించే పరాజయమే మేలు.

ఔనా!



డాల్ఫిన్లు ప్రతి అరగంటకు ఒకసారి సముద్ర ఉపరితలానికి వచ్చి ఊపిరి పీల్చుకుంటాయి.

అద్దాల మయసభ

అదో అద్దాల దారి. అందులో అడుగుపెట్టామో.. ఎటు వైపు చూసినా ప్రతిబింబాలే కనిపిస్తాయి. ఏ దిక్కుకు వెళ్లాలో అర్థం కాదు. కాలు తీసి కాలు వేద్దామంటే.. అంతా అయోమయం. అద్దాల తళుకులు, మిరుమిట్లుగొలిపే కాంతులు కనులను మాయ చేస్తాయి. మరి అద్దాల దారుల్లో అసలు దారేదో కనుక్కోవడమే దీని ప్రత్యేకత. ఇదో 'దారి కనుక్కోండి' పజిల్ అన్న మాట. సింగపూర్‌లోని 'విజ్ఞాన కేంద్రం'(సైన్స్ సెంటర్)లో ఆకట్టుకుంటున్న ఈ 'మిర్రర్ మేజ్' ఓ ఆధునిక మయసభ అన్నమాట!





'దారి కనుక్కోండి' పజిల్ అంటే చాలామందికి ఎంతో ఇష్టం. చాలా దేశాల్లో రకరకాల 'మేజ్ పజిళ్లు' పర్యాటకులను ఆకట్టుకుంటాయి. మొక్కజొన్న, పొద్దు తిరుగుడు తోటల్లోనూ తికమక పెట్టే దారులు ఏర్పాటు చేస్తుంటారు. అలానే సింగపూర్‌లో 'సైన్స్ సెంటర్' ఏర్పాటు చేసి 40 సంవత్సరాలు పూర్తి అయిన సందర్భంగా ఇటీవలే అందులో ఓ 'మిర్రర్ మేజ్'ను ఏర్పాటు చేశారు. పెద్ద పెద్ద అద్దాలు ఫ్రేములతో దీన్ని తీర్చిదిద్దారు. ఇందులోకి అడుగుపెడితే చాలు.. పైనా, కిందా, ఎటు వైపు చూసినా అద్దాల అందాలే. ఒకటికి పది ప్రతిబింబాలు కనిపిస్తుంటే.. అంతా అయోమయంగా తోస్తుంది. ఎటువైపు వెళ్లాలో తెలియదు. దారి ఉంది కదా అని అటు వైపు వెళ్లామో.. అంతే అది 'డెడ్ ఎండ్'ను సూచిస్తుంది. ప్రతి మలుపులో భ్రమింపచేసే ఎన్నో మాయలు. అసలు దారి ఎటు ఉందో తెలుసుకుంటే ఈ పజిల్ పూర్తి చేసినట్టే. ఈ అద్దాల గందరగోళానికి తోడు, మిరుమిట్లు గొలిపే లైట్ల కాంతులు కళ్లను తప్పుదోవ పట్టిస్తాయి. మొత్తంగా 270 చదరపు మీటర్ల విస్తీర్ణంలో ఉన్న ఆ అద్దాల మేజ్ సందర్శకులన ఎంతగానో ఆకట్టుకుంటోంది. ఈ మేజ్ సెప్టెంబర్ వరకు పర్యాటకుల కోసం అందుబాటులో ఉంటుంది. మయసభను తలపిస్తున్న ఈ మాయ అద్దాల దారిలో నడుస్తూ, తెగ సంతోషపడుతు ఆ జ్ఞాపకాల్ని తమ సెల్‌ఫోనుల్లో బంధించుకుంటున్నారు. ఎవరైనా ఉచితంగానే మిర్రర్ మేజ్‌ను సందర్శించవచ్చు.

- **ఆసియాలోని అతి పెద్ద 'మిర్రర్ మేజ్'గా ఇది రికార్డు సృష్టించింది.**
- **కాంతి భౌతిక ధర్మంతో పాటు, రంగులు కలిగించే భ్రమను సందర్శకులకు తెలియజేయడమే ఈ మిర్రర్ మేజ్ లక్ష్యమని నిర్వాహకులు అంటున్నారు.**
- **బ్రిటన్‌కు చెందిన ప్రముఖ మేజ్ డిజైనర్ 'అడ్రియన్ ఫిషర్' ఈ మేజ్‌ను రూపొందించాడు.**

నవ్వుల్ నవ్వుల్

లంబూ : ఏరా! మేధావీ కొత్త కారు కొన్నావట? ఏ కంపెనీది?

మిస్టర్ మేధావి : కంపెనీ పేరు గుర్తుకు రావడం లేదు కానీ 'టీ'తో స్టార్ట్ అవుతుంది.

లంబూ : అవునా! నాది పెట్రోల్ పోస్తే గానీ స్టార్ట్ కాదు.

చెప్పగలరా?


వనంలో ఉన్నా కానీ మనంలో లేను
దివిలో ఉన్నా కానీ భువిలో లేను
నత్తిలో ఉన్నా కానీ సుత్తిలో లేను
అయితే ఇంతకీ నేనెవర్నో చెప్పగలరా?


మీకు తెలుసా?




పడుకున్నప్పటికంటే టీవీ చూస్తుంటేనే ఎక్కువ క్యాలరీలు ఖర్చు అవుతాయి.

బొమ్మ గీయండి





రంగులు వేయండి



జవాబులు

చెప్పగలరా? : వదిన

జంతర్‌మంతర్ :

1. మెలకువ
2. వినియోగం
3. సుప్రభాతం
4. పంచాయతి

జంతర్‌మంతర్

1. మెకువల ▸ ....
2. వియోనిగం ▸ ....
3. భాతంసుప్ర ▸ ....
4. చాపంయతి ▸ ....

చుక్కలు కలపండి



వైభవంగా ఓనం



సంప్రదాయ వేషధారణలో కేరళ కుట్టీలు

● సంగీత, నృత్యాలతో సంప్రదాయబద్ధంగా...

● కేరళది గొప్ప సంస్కృతి : సంపూర్ణేష్ బాబు

నెల్లూరు (సాంస్కృతిక ప్రతినిధి) : మలయాళీల పెద్ద పండుగ ఓనం నెల్లూరు పురమందిరంలో ఆదివారం



జ్యోతి ప్రజ్వలనతో వేడుకను ప్రారంభిస్తున్న సంపూర్ణేష్‌బాబు

వైభవంగా జరిగింది. మలయాళీస్ వెల్ఫేర్ అసోసియేష్ ఆధ్వర్యంలో కేరళ సంస్కృతి, ఆచారాలను ప్రతిబింబిస్తూ సంప్రదాయబద్ధంగా ఉదయం నుంచి రాత్రి వరకు ఈ వేడుకలు నిర్వహించారు. గజరాజులతో స్వాగత తోరణాలు, పుష్ప రంగవల్లులు, దీపపు కాంతులు, వాద్యకారుల సంగీత ఘోష, యువతుల సంప్రదాయ వేషధారణ, ప్రత్యేక నృత్యాలు అలరించారు. బలి చక్రవర్తి వేషధారణలో యువకుడు ఆకట్టుకున్నాడు. మలయాళీస్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు నందకుమార్ ఆధ్వర్యంలో జరిగిన ఈ ఉత్సవంలో ఆహుతులకు కేరళ సంప్రదాయ రుచులను వడ్డించారు.

మదర్, ఐష్ కలిస్తే కేరళ కుట్టి : సంపూర్ణేష్‌బాబు

ముఖ్య అతిథిగా హాజరైన సినీ నటుడు సంపూర్ణేష్ బాబు వేడుకలను ప్రారంభించి ప్రసంగించారు. దేశంలో గొప్ప సంస్కృతికి కేరళ నిదర్శనం అని కొనియాడారు. మనస్సుంటే మదర్ థెరిస్సా, అందం, అదృష్టముంటే ఐశ్వర్యారాయ్ అంటారని, ఆ ఇద్దరి కలబోతే కేరళ యువతులని ప్రస్తుతించారు. నెల్లూరంటే మహనీయుల పుట్టినిల్లు అని, ఇక్కడ పెరిగిన చిరంజీవి గొప్ప నటుడు కాగలిగాడని, ఈ ప్రాంతానికే చెందిన సాయిరాజేష్ తనను సినీ నటుడిని చేశారని, వారికి, ఈ నేలకు రుణపడి ఉంటానని చెప్పారు. నెల్లూరీయుల అభిమానముంటే తాను నటుడిగా స్థిరపడతానన్నారు. మరో అతిథి అమరావతి కృష్ణారెడ్డి మాట్లాడుతూ స్నేహం, ప్రేమ, సేవాభావాలతో కేరళీయులు సింహపురీయులలో కలసిపోయారని అభినందించారు.

నిజాయితీ, అభిమానం, నమ్మకం వారి పెట్టుబడి అని, అవే వారికి దేశవిదేశాల్లో పేరు ప్రఖ్యాతులు తెచ్చి పెట్టాయని చెప్పారు. ఈ కార్యక్రమంలో మలయాళీస్ సంఘం నాయకులు శివరామన్, డేవిస్ కూట్లే, హాస్య నటుడు దోర్నాల హరిబాబు తదితరులు పాల్గొన్నారు. నెల్లూరు, చిత్తూరు, కడప జిల్లాలకు చెందిన మలయాళీలు హాజరయ్యారు.



గజరాజులతో స్వాగత ద్వారం



కేరళ వాయిద్యకారుల విన్యాసం

షార్ బస్టాండ్‌లో లక్ష్మీగణపతి హోమం



గణపతి హోమంలో పాల్గొన్న భక్తులు

సూళ్లూరుపేట : సూళ్లూరుపేట షార్ బస్టాండ్‌లో జరుగుతున్న వినాయక చవితి ఉత్సవాలలో భాగంగా ఆదివారం సామూహిక గాయత్రి సహిత లక్ష్మీగణపతి హోమం వైభవంగా జరిగింది. సాయంత్రం 3 గంటలకు స్వామివారి ఉట్టి మహోత్సవం జరిగింది. రాత్రి నెల్లూరు శక్తి ఈవెంట్స్ వారిచే జరిగిన పాటకచ్చేరి అలరింపచేసింది. చెంగాళమ్మ ఆలయ ట్రస్ట్ బోర్డు మాజీ చైర్మన్ ఇసనాక హర్షవర్ధన్ రెడ్డి స్వామి వారిని దర్శించుకున్నారు.

ఆర్‌ఎం ఉమామహేశ్వర్‌రావుకు సన్మానం

ఈ సందర్భంగా ఆంధ్రజ్యోతి అసిస్టెంట్ ఎడిటర్, రాయలసీమ ఏబీఎన్ ఆంధ్రజ్యోతి ప్రతినిధి, తాపీ ధర్మారావు అవార్డు గ్రహీత ఆర్‌ఎం ఉమామహేశ్వర్‌రావును చవితి నిర్వాహకులు ఘనంగా సన్మానించారు. సూళ్లూరుపేట ప్రాంతీయుడైన ఉమామహేశ్వర్‌రావు రచయితగా, ఉత్తమ జర్నలిస్టుగా ఈ ప్రాంతానికి గర్వకారణమయ్యాడని పలువురు వక్తలు అభినందించారు. అలాగే సూళ్లూరుపేట వాసి, షార్ శాస్త్రవేత్త ఎల్ శ్రీనివాసులు కుమారుడు చరిత్ బిట్స్‌పిలానిలో సీటు సాధించినందుకు ఆయనను సన్మానించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నేత బద్దెపూడి వేణుగోపాల్‌రెడ్డి, షార్ కంట్రోలర్ రాజారెడ్డి, జైగణేష్ ఉత్సవ కమిటీ నిర్వాహకులు బైరి పార్థసారథిరెడ్డి, బి. ధనంజయరెడ్డి, టి. ఆదినారాయణరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



ఆర్‌ఎం ఉమామహేశ్వర్‌రావును సన్మానిస్తున్న చవితి నిర్వాహకులు

అథ్లెటిక్స్ పోటీల్లో బళ్లారి ముందంజ

● హోరాహోరీగా 'నవోదయ' క్రీడలు



లాంగ్‌జంప్ చేస్తున్న క్రీడాకారుడు

మర్రిపాడు: జిల్లాలోని మర్రిపాడు మండలం, కృష్ణాపురం జవహర్ నవోదయ విద్యాలయంలో నిర్వహిస్తున్న అథ్లెటిక్ పోటీల్లో ఆదివారం 73 నవోదయ విద్యాలయాల క్రీడాకారులు పాల్గొన్నారు. రెండు రోజులుగా జరుగుతున్న ఈ పోటీల్లో బళ్లారి నవోదయ క్రీడాకారులు ముందంజలో ఉన్నారు. దక్షిణ భారతదేశంలోని తమిళనాడు తప్ప అన్ని నవోదయ విద్యాలయాల నుంచి మొత్తం 471 మంది పాల్గొన్నారు. బళ్లారి



పరుగు పోటీలో బాలికలు

విద్యాలయం-91, పుదుచ్చేరి-73, షిమోగా-69, కొట్టాయం-67, కాసరగోడ్-61, ఆదిలాబాద్- 57, పశ్చిమగోదావరి-31, మైసూర్- 24 పాయింట్లు సాధించాయి.

మాతృభాష మనకు వరం

గూడూరు(రూరల్): మాతృభాష మనకు వరంలాంటిదని మండలంలోని నెర్నూరు ప్రాథమికోన్నత పాఠశాల తెలుగుపండిట్ కొండూరు వెంకటేశ్వర్లురాజు అన్నారు. మంగళవారం మాతృభాషా దినోత్సవం పురస్కరించుకుని ఆదివారం మన తెలుగుభాష విశిష్టతను గుర్తుజేసేలా మర్రి ఆకుపై అ,ఆ అక్షరాలతోపాటు చెట్టు ఆకృతి సృజన చిత్రాన్ని రూపొందించి ప్రదర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చెట్టులా మేలు చేసే భాష మన తెలుగుభాష అన్నారు. నేటి తరం తెలుగు భాషను విస్మరించకుండా మక్కువ పెంచుకోవాలన్నారు. దేశభాషలందు తెలుగు లెస్స అన్న విషయాన్ని మరువరాదన్నారు.



మర్రిఆకుపై అ,ఆల సృజనచిత్రం

స్వర్ణ గరుడుడిపై పెంచల నరసింహుడు

పెంచలకోన(రాపూరు): పెంచల నరసింహుడు తన ఇష్ట వాహనమైన స్వర్ణగరుడుడిపై కొలువు దీరి భక్తులకు దర్శనమిచ్చాడు. కొండ కోన భక్తుల గోవిందనామస్మరణలతో మార్మోగింది. ఆదివారం శ్రీవారి జన్మనక్షత్రం(స్వాతి) కావడంతో నరసింహుడు గరుడ వాహనంపై విహరించారు.



నరసింహుడుకి విశేషపూజలు, హోమాలు



స్వర్ణగరుడపై విహరిస్తున్న నరసింహుడు

ఉదయం మూలవిరాట్‌కు అభిషేకాలు, చందన అలంకారం చేశారు. శ్రీవారి మండపంలో శ్రీవారిని ప్రత్యేకంగా అలంకరించి హోమాలు, విశేషపూజలు నిర్వహించారు. పెద్దసంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

ఏఎస్‌పేట దర్గాలో పెరిగిన రద్దీ

ఏఎస్‌పేట: ఏఎస్‌పేటలోని హ జరత్‌ఖాజానాయబ్ రసూల్ దర్గాకు ఆదివారం భక్తుల రద్దీ పెరిగింది. దేశ నలుమూలల నుంచి భక్తులు విచ్చేయడంతో, దర్గా సజ్జాదా, ముతవలి షాగులాం నక్షబంద్ వాఫీజ్‌పాషా ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. సెలవు దినాల్లో సాధారణంగా దర్గాకు విచ్చేసే భక్తుల రద్దీ పెరుగుతుండడంతో ఆయా రోజుల్లో ప్రత్యేక ప్రార్థనలు సైతం నిర్వహిస్తున్నారు. భక్తులు దర్గాలోని స్వామి, అమ్మవార్ల సమాధులను దర్శించుకుని పూలు, గలేఫాలు కప్పి ప్రార్థనలు చేశారు. కందూరీలు, అన్నదానం చేశారు. భక్తుల రద్దీ పెరగడంతో దర్గా ప్రాంగణంలోని దుకాణాలతో పాటు, గ్రామవీధులు కళకళలాడాయి.

● ఇంటర్వ్యూ



ప్రజల రక్షణకే
పోలీసులు

అబ్దుల్ రజాక్, ఎస్ఐ

?. మండలంలో శాంతిభద్రతల పర్యవేక్షణకు ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు?
!. మండల ప్రజలకు ఎటువంటి సమస్యలు లేకుండా శాంతిభద్రతలు కాపాడేందుకు నిరంతరం కృషి చేస్తున్నాం.
?. మండలంలోని యువత చెడు అలవాట్లకు పాల్పడకుండా ఎలాంటి చర్యలు చేపడుతున్నారు?
!. బెల్టుషాపులు, పేకాటస్థావరాలపై దాడులు చేసి, కేసులు నమోదు చేస్తున్నాం. గ్రామాల్లో రాత్రివేళల్లో గస్తీ నిర్వహిస్తున్నాం.

\- మర్రిపాడు

పడకేసిన పారిశుధ్యం

● అధ్వానంగా వీధులు ● రోడ్ల పక్కనే దిబ్బలు ● ప్రబలుతున్న దోమలు ● వ్యాధుల బారిన ప్రజలు



కావలియడవల్లి అధ్వానంగా ఉన్న వీధులు

ఏఎస్‌పేట: పారిశుధ్య పరిరక్షణను పాలకులు విస్మరించడంతో గ్రామీణ ప్రాంతాలు మురికి కూపాలుగా మారుతున్నాయి. దీంతో



రోడ్ల పక్కనే దిబ్బలు

ప్రజలు రోగాలబారిన పడి సమస్యలు ఎదుర్కొంటున్నారు. మండల కేంద్రమైన ఏఎస్‌పేటతో పాటు పలు గ్రామాల్లో పారిశుధ్యం పడకేసింది. మురుగు కాలువలు లేక కొన్ని గ్రామాల్లో మురుగునీరు వీధుల్లోకి చేరుతుండగా, ఉన్న గ్రామాల్లో పూడిక తీయకపోవడంతో అవి పొంగి పొర్లుతున్నాయి. కావలియడవల్లి గ్రామంలోని బజారు వీధి, తూర్పు వీధుల్లో మురుగునీరు రోడ్లపై చేరి దుర్వాసన వెదజల్లుతోంది. చౌడేశ్వరాలయం, బ్యాంకు, వాటర్‌ప్లాంట్లకు ఈ మార్గం నుంచే వెళ్లాల్సి ఉండడంతో ప్రజలు అవస్థలు పడుతున్నారు.

రోడ్ల పక్కనే దిబ్బలు

కావలియడవల్లిలోని పలు వీధుల్లో చాలాకాలంగా చెత్త తొలగించకపోవడంతో, దోమలు పెరిగిపోయి ప్రజలు. మలేరియా, డెంగ్యూ వంటి వ్యాధుల బారిన పడుతున్నారు. పారిశుధ్య పనులు చేపట్టి దోమలు ప్రబలకుండా చర్యలు తీసుకోవాల్సిన అధికారులు, పాలకులు నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో ప్రజలు ఆసుపత్రుల చుట్టూ తిరుగుతూ అవస్థలు పడుతున్నారు. ఇకనైనా అధికారులు, పాల కులు స్పందించి గ్రామీణ ప్రాంతాల్లో పారి శుధ్య పనులు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

పారిశుధ్యం అధ్వానం



గ్రామంలో పారిశుధ్యం అధ్వా నంగా తయారైంది. వీధుల్లో మురుగునీరు చేరి దుర్గంధం వెదజల్లుతుండడంతో ఆయా మార్గాల్లో రాకపోకలు సాగించ డానికి ప్రజలు అవస్థలు పడుతున్నారు.

\- శ్రీనివాసులునాయుడు

కాలువల్లో పూడిక తీయించాలి



జీసీ కాలనీలోని మురుగు కాలువలు చెత్తాచెదారాలతో నిండి పూడిపోవడంతో మురుగు పొంగి పొర్లుతోంది. చాలా కాలం నుంచి కాలువల్లో పూడిక తీయకపోవడంతో అస్తవ్యస్థంగా తయారైంది.

\- మురళీకృష్ణ


సిమెంట్ రోడ్లు వేయాలి



గ్రామంలోని పలువీధుల్లో సిమెంట్ రోడ్లు లేకపోవడంతో వీధులు అధ్వానంగా తయారయ్యాయి. వర్షం కురిస్తే నీరు నిలచిపోయి బురదమయం అవుతున్నాయి. నిలువ నీరు దోమలు పెరిగిపోవడానికి కారణమవుతున్నాయి

\- ముప్పూరి రమణయ్య

పారిశుధ్య పనులు చేపట్టాలి



గ్రామంలోని ప్రధానవీధుల్లో పారిశుధ్యం అధ్వానంగా మారింది. దీంతో ఆలయాలకు, బ్యాంకులకు వెళ్లడానికి ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. గ్రామంలో వెంటనే పారిశుధ్య పనులు చేపట్టాలి.

\- గుది శ్రీనివాసులు

మంగుపల్లిలో మొక్కలు నాటిన యువత



మొక్కలు నాటుతున్న యువకులు

అనంతసాగరం: మండలంలోని మంగుపల్లి గ్రామంలో స్థానిక యువకులు ఆదివారం మొక్కలు నాటారు. మొక్కలు నాటడం సామాజిక బాధ్యత అని ఈ సందర్భంగా వారు తెలిపారు. నాటిన మొక్కల సంరక్షణ బాధ్యతలు చేపట్టనున్నట్టు ప్రతిజ్ఞ చేశారు. మొక్కలు నాటడం వలన కలిగే ప్రయోజనాలపై గ్రామస్థులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో స్థానిక యువకులు, మండల కో-ఆప్షన్‌సభ్యులు షబ్బీర్, తదితరులు పాల్గొన్నారు.

లబ్ధిదారులు రుణాలు పొందాలి

వింజమూరు: మండల పరిధిలో సబ్సిడీ రుణాల లబ్ధిదారులు బ్యాంకులను సంప్రదించి తమ రుణాలను మంజూరు చేయించుకోవాలని మండల టీడీపీ కన్వీనర్ చల్లా వెంకటేశ్వర్లు ఆదివారం తెలిపారు. 2015-16, 2016-17 ఆర్థిక సంవత్సరాలకు రుణాలు పొంది గ్రౌండింగ్ చేసినవారు ఈనెల 31వ లోపు తమ రుణాలు పొందవచ్చన్నారు.

చేపల పెంపకందారులపై చర్యకు డిమాండ్



చెరువు నుంచి కాలువలోకి వృథాగా వెళుతున్న నీరు



నీట మునిగిన పొలాలు

చేజర్ల: మండలంలోని తిమ్మాయపాళెం పంచాయతీ చెరువులో నీటిని వృథా చేస్తున్న చేపల పెంపకందారులపై చర్యలు తీసుకోవాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు. గత రెండు, మూడు రోజులుగా చేపల పెంపకందారులు రాత్రి వేళల్లో నీరు వృథాగా వదిలేస్తుండడంపై స్థానికులు అధికారులకు సమాచారం అందించారు. వారు తమకేమీ తెలియనట్లు వ్యవహరిస్తుండడంపై ఆగ్రహం వ్యక్తం చేసున్నారు. నాలుగు రోజుల క్రితం మడపల్లి చెరువులో నీరు వృథా చేయడంతో సంబంధిత వ్యక్తులపై పంచాయతీ కార్యదర్శి చేజర్ల పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఒక వైపు నీరు వృథా చేయరాదని ప్రభుత్వం చెబుతున్నా, పట్టనట్లు వ్యవహరించడం సబబు కాదని విమర్శిస్తున్నారు.

ప్రమాదకరంగా డౌన్‌స్ట్రీమ్



డౌన్‌స్ట్రీమ్‌లో నిలిచిన నీరు

అనంతసాగరం: సోమశిల జలాశయం డౌన్‌స్ట్రీమ్ ప్రాంతం ప్రమాదభరితంగా మారింది. వర్షపునీరు నిలిచి పాచిపట్టి ఉండడంతో రాకపోకలకు తీవ్ర ఇబ్బందికరంగా ఉంది. వాహన చోదకులు ఆదమరిచి ఆ ప్రాంతంలోకి వెళ్లిన సమయంలో ప్రమాదాలకు గురవుతున్నారు. డౌన్‌స్ట్రీమ్ పనులు జరిగే సమయంలో అవగాహన లేక వర్షపునీరు బయటకు వెళ్ళే వెసులుబాటు కల్పించకుండా పనులు చేపట్టడంతో చిన్నపాటి వర్షం కురిసినా డౌన్‌స్ట్రీమ్‌ప్రాంతం నీటిమడుగుగా మారుతోంది. వాహన చోదకులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నా అధికారులు తగిన చర్యలు పట్టడం లేదు. డౌన్‌స్ట్రీమ్ ప్రాంతంలో వర్షపునీరు నిల్వ లేకుండా ఉండేలా అధికారులు పనులు చేపట్టాలని పలువురు కోరుతున్నారు.

మట్టి పెళ్లలు విరిగి పడి పలువురికి గాయాలు

చేజర్ల: మండలంలోని కొట్టాలు గ్రామంలో శనివారం రాత్రి వినాయక మండపం వద్ద అన్నదానం నిర్వహిస్తుండగా వర్షం కురవడం తో ప్రజలు సమీపంలో నూతనంగా నిర్మిస్తున్న ఆలయం వద్దకు వెళ్లారు. అయితే ఆలయానికి సంబంధించిన మూస ఇటీవలే తొలగించి పనులు చేస్తున్నారు. ఇందుకు సంబంధించిన మట్టిపెళ్లలు విరిగిపడడంతో నలుగురికి తీవ్ర గాయాలు కాగా, ఐదు గురికి స్వల్ప గాయాలయ్యాయి. వెంటనే స్థానికులు ఆత్మకూరులోని ప్రైవేట్ వైద్యశాలకు చికిత్స నిమిత్తం తరలించారు. ఈ సంఘటనతో మహిళలు, చిన్నారులు భయభ్రాంతులకు గురయ్యారు.

వంతెనకు మరమ్మతులు చేయండి

ఏఎస్‌పేట: గండువారిపల్లి, పందిపాడుకు వెళ్లే మార్గంలో వంతెన పూర్తిగా దెబ్బతిని రాకపోకలకు ఆటంకం ఏర్పడిందని వెంటనే వంతెన నిర్మాణం చేపట్టాలని గ్రామస్థులు కోరుతున్నారు వంతెన మధ్యలో పెద్ద రంధ్రం ఏర్పడడంతో 20 రోజులుగా పందిపాడు గ్రామానికి ఆర్డీసీ బస్సు, ప్రైవేట్ పాఠశాలల బస్సుల రాకపోకలు నిలిచిపోయానని, దీంతో గ్రామస్థులతో పాటు విద్యార్థులకు అవస్థలు తప్పడం లేదన్నారు. సుమారు 300 మంది విద్యార్థులు ఆదర్శ పాఠశాలలో చదువుకుంటున్నారని, కానీ బస్సు సౌకర్యం ఆగిపోవడంతో సుమారు ఒకటిన్నర కిలోమీటర మేర నడిచి వెళ్లాల్సి రావడంతో సకాలంలో పాఠశాలలకు చేరుకోలేకపోతున్నారని అంటున్నారు. రోజూ మండల స్థాయి అధికారులు రాకపోకలు సాగించే మార్గంలో వంతెన అధ్వానంగా మారినా ఎవరూ స్పందించకపోవడం దారుణమని పలువురు వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు, పాలకులు స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

దుర్గామల్లేశ్వరాలయంలో పూజలు



అన్నప్రసాదం స్వీకరిస్తున్న భక్తులు

ఆత్మకూరు: కామిరెడ్డిపాడు గ్రామ సమీపంలో వెలసిన దుర్గామల్లేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం వినాయకచవితి సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేకువజామున విఘ్నేశ్వరునికి ప్రత్యేక పూజలు నిర్వహించి, అమ్మవారి మూలవిరాట్‌కు అభిషేకాలు చేశారు. శంకరనగరం గ్రామానికి చెందిన టీడీపీ నాయకుడు శాఖమూరి వెంకటేశ్వర్లునాయుడు కుటుంబసభ్యులు ఉభయకర్తలుగా వ్యవహరించారు. మధ్యాహ్నం భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు. ప్రత్యేకపూజల్లో పలువురు భక్తులు పాల్గొన్నారు.

- కోలాహలంగా నిమజ్జనం
- ఉత్సాహంగా పాల్గొన్న యువత
- పలు గ్రామాల్లో ఉట్టి ఉత్సవం
- లడ్డూ ప్రసాదం వేలం
- పూజల్లో పాల్గొన్న నేతలు, అధికారులు
- ఆత్మకూరులో పోలీసులతో వాగ్వాదం


ఆత్మకూరులో నిమజ్జనానికి తరలివెళుతున్న గణనాథులు

నిమజ్జనానికి తరలిన

గణనాథులు

ఆత్మకూరు: ఆత్మకూరు పట్టణం, మండల పరిధిలోని గ్రామాల్లో ఆదివారం గణేష్ నిమజ్జన మహోత్సవాలు ఘనంగా జరిగాయి. విగ్రహాలను ట్రాక్టర్లపై ఉంచి ఊరేగించారు. పట్టణంలో పలు కూడళ్లలో ఏర్పాటు చేసిన 19 విగ్రహాలు నిమజ్జనానికి తరలివెళ్ళాయి. వినాయకునికి పూజలు, భజనలు, కోలాటాలు ఏర్పాటు చేశారు. పంట వీధిలో ఏర్పాటు చేసిన వినాయకుడి విగ్రహం వద్ద పూజల్లో ఆర్డీవో బాపిరెడ్డి, మున్సిపల్ కమిషనర్ వి.శ్రీనివాసరావు, పలువురు పట్టణ ప్రముఖులు పాల్గొన్నారు. జేఆర్‌పేటలో వినాయక విగ్రహం వద్ద జరిగిన పూజాల్లో బీజేపీ రూరల్ అధ్యక్షుడు నలిశెట్టి శ్రీనివాసులు, పలువురు నేతలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన. సాంస్కృతిక కార్యక్రమాలు కనువిందు చేశాయి. నిమజ్జనం సందర్భంగా పట్టణం బాణసంచా, తప్పెట మోతతో హోరెత్తింది. సంగం ఆనకట్ట, అప్పారావుపాళెం బ్రిడ్జి వదనిమజ్జనం చేశారు. సీఐ ఖాజావలి నేతృత్వంలో ఎస్ఐ ఖాజీబాబు బందోబస్తు ఏర్పాటు చేశారు.


చుంచులూరులో ఉట్టికొడుతున్న యువకుడు

వాగ్వాదం

జేఆర్‌పేటలో యువకులు కోడిగుడ్లు విసరడం తగదంటూ ఓ కానిస్టేబుల్ అభ్యంతరం వ్యక్తం చేయగా... తమ వద్ద కోడిగుడ్లు లేవని, రంగులు చల్లుకుంటూ ఉత్సవాలు చేసుకుంటుంటే మీ జోక్యం తగదంటూ కొంతమంది యువకులు వాదనకు దిగారు

సంగం: మండలంలోని అన్ని గ్రామాల్లో ఘనంగా నిమజ్జనం నిర్వహించారు. మంగళవాయిద్యాలు, తప్పెట్ల మోత, యువకులు కేరింతలు నినాదాల నడుమ పెన్నానదిలో నిమజ్జనం చేశారు.

మర్రిపాడు: మర్రిపాడు మండలంలోని పలు గ్రామాల్లో ఆదివారం నిమజ్జన వేడుకలు నిర్వహించారు. అంతకు ముందుగా ఉట్టి ఉత్సవం నిర్వహించి, రంగుల్లో మునిగి తేలారు.

చేజర్ల: మండలంలోని అన్ని గ్రామాల్లో ఏర్పాటు చేసిన వినాయక విగ్రహాలను ఆదివారం నిమజ్జనం చేశారు. పెన్నానది పరివాహక ప్రాంతాల్లోని గ్రామాల్లో వినాయక విగ్రహాలను పెన్నానదిలో నిమజ్జనం చేయగా, మెట్టప్రాంత గ్రామాల్లో ఏర్పాటు చేసిన విగ్రహాలను కండలేరు జలాశయంలో నిమజ్జనం చేశారు. ఈ సందర్భంగా పలు గ్రామాల్లో అన్నదాన కార్యక్రమాలను ఏర్పాటు చేశారు. నిమజ్జనానికి తరలుతున్న గణనాధులకు గ్రామస్థులు హారతులతో వీడ్కోలు పలికారు.

అనంతసాగరంలో...

అనంతసాగరం మండలంలోని పలు గ్రామాల్లో ఉట్టి ఉత్సవం నిర్వహించి గణనాథులను ఊరేగింపుగా నిమజ్జనానికి తరలించారు. అనంతసాగరం చెరువు, సోమశిల జలాశయం వద్ద నిమజ్జన ఏర్పాట్లను అనంతసాగరం, సోమశిల పోలీసులు పర్యవేక్షించారు.

ఏఎస్‌పేటలో...

ఏఎస్‌పేటతో పాటు అన్ని గ్రామాల్లో నిమజ్జన కార్యక్రమాలు నిర్వహించారు. పలు చోట్ల యువకులు ఉట్టి ఉత్సవం నిర్వహించారు. పలు చోట్ల అన్నదాన కార్యక్రమాలను ఏర్పాటు చేశారు.

వినాయకుడి లడ్డు వేలం

ఆత్మకూరులోని ప్రియదర్శినినగర్‌లో లడ్డూ వేలంలో రూ.8500లు పలకగా, కందివీధిలో రూ.6,735లు పలికింది. అనంతసాగరం మండలం కచ్చిరి దేవరాయపల్లిలో నిర్వహించిన వేలంలో కరివేటి పెంచలయ్య అనే భక్తుడు రూ.12,200లకు లడ్డు ప్రసాదం దక్కించుకున్నాడు.మర్రిపాడు మండలపరిధిలోని కేతిం గుంట గ్రామంలో లడ్డూ వేలంలో స్థానికులు పోటీ పడడంతో అదే గ్రామానికి చెందిన మోదేపల్లి వెంకట్రామయ్య రూ. 35వేలకు దక్కించుకున్నాడు.


సంగం: నిమజ్జనానికి తరలి వెళుతున్న వినాయకుడు


మర్రిపాడు: నిమజ్జనోత్సవంలో పాల్గొన్న యువకులు


నిమజ్జనోత్సవంలో ఆకట్టుకున్న కాళికా వేషం


అనంతసాగరం సోమశిల జలాశయం వద్ద నిమజ్జనం

ఆదూరమ్మకు పొంగళ్లు


ఆదూరమ్మకు పొంగళ్లు సమర్పించేందుకు వెళుతున్న భక్తులు

చేజర్ల: ఆదురుపల్లి గ్రామదేవత ఆదూరమ్మకు ఆదివారం పొంగళ్ళు నిర్వహించారు. సంవత్సరానికొకసారి గ్రామస్థులందరూ ఉమ్మడిగా పొంగళ్లు నిర్వహించడం ఆనవాయితీ.. ఈ సందర్భంగా ఆదూరమ్మతల్లికి ప్రత్యేక అభిషేకాలు, పూజలు నిర్వహించారు. అనంతరం పొంగళ్లు తయారు చేసి అమ్మవారికి నైవేద్యం సమర్పించారు. దూరప్రాంతాల్లో ఉండే బంధుమిత్రులు రావడంతో గ్రామంలో సందడి వాతావరణం నెలకొంది.

వర్షం కోసం సంకల్ప ధ్యానం

వింజమూరు: పుష్కలంగా వర్షం కురిసి భూగర్భజలం పెరగాలని స్థానిక సాయిబాబా ఆలయంలో ఆదివారం సంకల్ప ధ్యానం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ప్రముఖ ఆధ్మాత్మికవేత్త వైదేహి, శ్రీవల్లి హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు .సందేశమిస్తూ పర్యావరణ సమతుల్యతను సాధించేందుకు ప్రకృతిలోని అన్ని జీవరాశులు ప్రశాంతంగా జీవించేందుకు మానవుడు అన్ని జీవులపై కరుణ కలిగి ఉండాలన్నారు. జీవులకు ప్రాణాధారమైన నీటి వనరులు కళకళలాడాలంటే వర్షం కురవాలని సంకల్ప ధ్యానం చేయడమే మార్గమన్నారు.

సంగం అభివృద్ధికి రూ.9.48 కోట్లు మంజూరు

- డ్రైనేజీ, రహదారులకు మహర్దశ
- పాలకులు, గ్రామస్థుల హర్షం

సంగం: సంగం మేజర్ పంచాయితీకి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఇచ్చిన హామీలు నెరవేరనున్నాయి. సంగం గ్రామంలో పూర్తి స్థాయిలో సిమెంట్, డ్రైనేజీ నిర్మాణానికి రూ. 9.48 కోట్లు మంజూరయ్యాయి. ఈ నిధులతో 10 కిలోమీటర్ల పొడవునా సిమెంట్ రోడ్లతోపాటు అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ పనులు చేపట్టనున్నారు.

మండలంలోని ఏకైక మేజర్ పంచాయతీ అయిన సంగంలో ప్రజలు తాగునీరు, రహదారులు, డ్రైనేజీ సమస్యలతో సతమతమవుతున్నారు. పంచాయితీలో తగినన్ని నిధులులేక పోవడంతో పాలకులు ఎలాంటి అభివృద్ధి సాధించలేకపోయారు. ఈ నేపథ్యంలో 2015 జూన్ 5వ తేదిన రాష్ట్ర ముఖ్యమంత్రి నారా


సంగం గ్రామం

చంద్రబాబునాయుడు జన్మభూమి - మా ఊరు కార్యక్రమంలో భాగంగా సంగం సందర్శించారు. గ్రామాన్ని ఆదర్శంగా తీర్ధిదిదేందుకు పదకొండు వందల వంట గ్యాస్ కనెక్షన్లు, గ్రామమంతా సిమెంట్ రహదారులు, అండర్ డ్రైనేజీ, తాగునీటి వసతి, వంద శాతం మరుగుదొడ్లు నిర్మిస్తామని ప్రకటించారు.

నెరవేరుతున్న హామీలు

. ఇప్పటికే ఇంటింటికి వంట గ్యాస్ పంపిణీ, మరుగుదొడ్ల నిర్మాణాలు పూర్తి కావచ్చాయి. రూ. 59 లక్షలతో సుమారు లక్ష లీటర్ల సామర్థ్యంలో రెండు వాటర్ ట్యాంకులు నిర్మించి పెన్నానది నుండి తాగునీరు సరఫరా చేస్తున్నారు. 4.5 కిలో మీటర్ల మేర సిమెంట్ రహదారులు ఏర్పాటు చేశారు.

రూ. 9.48 కోట్లు నిధులు మంజూరు

ఇటీవల సిమెంట్ రోడ్ల ఏర్పాటుకు సుమారు రూ.5 కోట్లు, 25 కిల్లో మీటర్ల పొడవునా అండర్ డ్రైనేజి ఏర్పాటుకు 4.48 కోట్లు రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేసింది. త్వరలో ఈ పనులు ప్రారంభం కానున్నాయి. ఈ పనులు పూర్తయితే సంగం మేజర్ పంచాయితీలో ఆదర్శ పంచాయితీగా మారనుంది.

వసతులు అంతంత మాత్రమే



సంగం మేజర్ పంచాయితీ అయినా సౌకర్యాలు అంతంత మాత్రమే ఉన్నాయి. ఇప్పటి వరకు ప్రజలు తాగునీరు, రహదారులు, డ్రైనేజీ సరిగాలేక ఇబ్బందులు పడుతున్నారు. సీఎం హామీతో సమస్యలు తీరుతాయని ఆశగా ఎదురు చూస్తున్నాం.

\- కృష్ణ

నిధుల మంజూరుతో ఆనందం



సీఎం ఇచ్చిన హామీలు ఒక్కొక్కటిగా నెరవేరుతున్నాయి. ఇప్పటికే తాగునీరు, మరుగుదొడ్లు, వంట గ్యాస్ సమస్యలు తీరాయి. డ్రైనేజీకి, రహదారులకు నిధులు మంజూరు అయ్యాయని తెలిసింది. దీంతో ఆనందంగా ఉంది.

\- మాఘం గిరిబాబు

ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు



సమస్యల సాధనకు నిధులు మంజూరు చేసిన ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు, ఇప్పటికే సుమారు 59 లక్షలతో వాటర్ ట్యాంకులు నిర్మించాం. సిమెంట్ రహదారులు, డ్రైనేజి నిర్మాణానికి సుమారు 9.48 కోట్లు మంజూరు చేశారు.

\- బుజ్జమ్మ, సర్పంచు

పలు వాహనాలు సీజ్

కోట : మండలంలోని పలు గ్రామాలలో నిబంధనలకు విరుద్ధంగా తిరుగుతున్న వాహనాలపై స్పెషల్ స్క్వాడ్ అధికారులు దాడులు జరిపారు. కొత్తపాళెం, విద్యానగర్, కోట, క్రాస్‌రోడ్డు ప్రాంతాలలో లైసెన్సులు లేకుండా తిరుగుతున్న పలు వాహనాలను సీజ్ చేశారు. నాలుగు మోటారుబైకులు, రెండు ఆటోలను సీజ్ చేసి కోట పోలీసులకు అప్పగించినట్లు తెలిపారు. అధికారులు తనిఖీ చేస్తున్న సమయంలో కోట నుంచి వాకాడు, నాయుడుపేట, గూడూరు ప్రాంతాలకు వెళ్లే పలు వాహనాలు ఆగిపోయాయి. పలు ఆటోలు, మోటారుబైకులు, లారీలు రూటుమార్చి దొంగచాటుగా గమ్యస్థానాలకు చేరారు.

విద్యార్థులకు ఉపకార వేతనాల పంపిణీ



ఉపకారవేతనాలు అందుకున్న విద్యార్థులతో రోటరీక్లబ్ సభ్యులు

గూడూరు(టౌన్): స్థానిక రోటరీ భవన్‌లో ఆదివారం రోటరీక్లబ్ ఆధ్వర్యంలో దొడ్ల రుక్మిణమ్మ రోటరీ ఉపకారవేతనాల పథకం ద్వారా విద్యార్థులకు ఉపకార వేతనాలు అందజేశారు. ఈ సందర్భంగా రోటరీ క్లబ్ గవర్నర్ మునిగిరీష్ మాట్లాడుతూ దొడ్ల సుబ్బరామిరెడ్డి, అల్లూరు ఆది శేషారెడ్డి పేద విద్యార్థులను చదువులో ప్రోత్సహించేందుకు పదేళ్ల క్రితం దొడ్ల రుక్మిణమ్మ రోటరీ ఉపకారవేతనాల పథకాన్ని రూపొందించి నిధులు సమకూర్చారన్నారు. ఈ నిధుల ద్వారా ఇంజనీరింగ్, మెడిసెన్ చదివే 8 మంది విద్యార్థులకు రూ. 45 వేలు ఉపకార వేతనాలుగా అందజేశామన్నారు. విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఉన్నతస్థాయికి చేరి గురువులకు, కన్నవారికి, దాతలకు మంచి పేరు తేతీసుకురావాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో రోటరీ క్లబ్ సభ్యులు పీవీ కృష్ణయ్య, బాలకృష్ణంరాజు, జానకిరామిరెడ్డి, నాగేంద్రప్రసాద్, హరిప్రసాద్, అశోక్ చక్రవర్తి తదితరులు పాల్గొన్నారు.



నిమజ్జనానికి ట్రాక్టర్లలో తరలుతున్న రాణీపేటలోని వినాయకుడి విగ్రహం



నిమజ్జనానికి ట్రాక్టర్లలో తరలుతున్న వీరారెడ్డిపల్లిలోని వినాయకుడి విగ్రహం



ఊరేగింపు సందర్భంగా నృత్యాలు చేస్తున్న యువకులు

బై..బై..గణేశా..!

గూడూరు: వినాయక చవితి పర్వదినాన్ని పురస్కరించుకుని పట్టణంలోని వివిధ కూడళ్లలో ఏర్పాటు చేసిన వినాయక విగ్రహాలను మూడో రోజైన ఆదివారం నిమజ్జనానికి తరలించారు. స్వామి వారికి ముందుగా పూజలు నిర్వహించి అన్నదాన కార్యక్రమాలు చేపట్టారు. మాళవ్యానగర్‌లోని విఘ్నేశ్వరుని విగ్రహం ముందు మహిళలు కుంకుమ పూజలు నిర్వహించారు. అదేవిధంగా అదే ప్రాంతంలో ఏర్పాటు చేసిన విగ్రహం వద్ద బాలకృష్ణంరాజు ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం జరిపారు. దూర్జటినగర్, రాణీపేట, చినకమ్మరివీధి, అశోక్‌నగర్, విఘ్నేశ్వరపురం, బీసీ కాలనీ, పూలతోట, జనార్దనరెడ్డికాలనీ తదితర కూడళ్లతో పాటు మండల పరిధిలోని వివిధ గ్రామాల్లో ఏర్పాటు చేసిన వినాయక విగ్రహాలను ఆటోలు, ట్రాక్టర్లు, విగ్రహాలను ఉంచి ఆర్చిలు కట్టి గ్రామోత్సవం నిర్వహించారు. అనంతరం నిమజ్జనానికి యువకుల చిందుల మధ్య బాణసంచా పేలుస్తూ బ్యాండు మేళాలతో సందడిగా ఉత్సవాలు కదిలాయి. బ్యాండ్ మేళాల మధ్య రంగులు చల్లుకుంటూ తరలించారు. పలు చోట్ల ఉట్టి మహోత్సవాలు, అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. నిమజ్జనానికి వినాయక విగ్రహాలను వాకాడు మండలం తూపిలిపాళెంకు తరలించడంతో పట్టణంలో సందడి వాతావరణం నెలకొంది. మరికొన్ని చోట్ల ఏర్పాటు చేసిన వినాయక విగ్రహాలను 5, 7, 9వ రోజు నిమజ్జనానికి తరలించేందుకు సన్నాహాలు చేసుకున్నారు.

గూడూరురూరల్‌లో....

అడవిలో స్వయంభు వరసిద్ధి వినాయక ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. గణపతి హోమం చేపట్టారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరయ్యారు. ఆలయ ప్రాంగణంలో భారీ అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. అదేవిధంగా మండలంలోని పలు గ్రామాలలో వినాయక విగ్రహాలను ట్రాక్టర్లు, ఆటోలలో ఉంచి గ్రామోత్సవాలు జరిపి తూపిలిపాళెంలో నిమజ్జనానికి తరలించారు.



మాళవ్యనగర్‌లో వినాయక విగ్రహం వద్ద పూజలు చేస్తున్న మహిళలు



మాళవ్యానగర్‌లో అన్నదాన కార్యక్రమం



గూడూరుమండలం అడవిలో వినాయకుని గుడిలో గణపతి హోమంలో భక్తులు

సేవ ద్వారా జీవించే ఉంటారు

గూడూరు: మరణించినవారి పేరు మీద సేవా కార్యక్రమాలు నిర్వహించడం ద్వారా ప్రజల హృదయాల్లో మరణించిన వారు జీవించి ఉంటారని ఎమ్మెల్యే పాశం సునీల్ కుమార్ అన్నారు. ఆదివారం స్థానిక సీఎస్ఎం ఉన్నత పాఠశాలలో సునీత సేవా సంస్థ 17వ వార్షికోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సారంగం శ్రీనివాసులు, సులక్ష్మీల కుమార్తె 17 ఏళ్ల క్రితం మృతి చెందిందన్నారు. ఈ దంపతులు తమ కుమార్తెను జ్ఞాపకం చేసుకుంటూ ఆమె పేరు మీద సునీత సేవా సంస్థ ఏర్పాటు చేసి మహిళలకు ఆసరాగా నిలిచారన్నారు. వీరిని స్ఫూర్తిగా తీసుకుని వారి అడుగుజాడల్లో నడవాలన్నారు. అనంతరం సంస్థ నిర్వాహకులు ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్‌కు జ్ఞాపికను అందజేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ చంద్రశేఖర్‌రెడ్డి, హెచ్ఎం పరంజ్యోతి, సీడీపీవో ఉమామహేశ్వరి, వ్యవసాయ శాఖ ఏడీ ఉషారాణి, సంస్థ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సారంగం శ్రీనివాసులు, సారంగం సులక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.



ఎమ్మెల్యేకు మెమెంటో అందజేస్తున్న సంస్థ నిర్వాహకులు

జీతాలు చెల్లించాలి

గూడూరు(టౌన్): జూలై నెల జీతాలు అందక గ్రంథాలయాల ఉద్యోగులు అవస్థలు పడుతున్నారని వెంటనే చెల్లించాలని జిల్లా గ్రంథాలయ సంస్థ అధ్యక్షుడు నాగేంద్రరావు కోరారు. ఆదివారం ఆయన విలేఖరులతో మాట్లాడుతూ గ్రంథాలయ సంస్థల్లో పని చేసే ఉద్యోగులకు, విశ్రాంత ఉద్యోగులకు గ్రాంటు లేకపోయినా చెస్ నుంచి జీతాలు చెల్లించాలని గ్రంథాలయ చైర్మన్ వెంకటస్వామి నాయుడు ఆదేశాలు జారీచేసినా ప్రభుత్వం ఫ్రీజింగ్ పెట్టిందన్నారు. దీంతో జీతాలు అందలేదన్నారు. జీతాలు రాక ఉద్యోగుల కుటుంబాలు ఆర్థిక ఇబ్బందులు పడుతున్నారని విచారం వ్యక్తం చేశారు. ప్రభుత్వం వెంటనే ఫ్రీజింగ్‌పై ఆంక్షలను ఎత్తివేయాలని కోరారు. లేనిపక్షంలో ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో కార్యదర్శి రవీంద్రనాథ్‌రెడ్డి, వెంకటేశ్వరరావు, వెంకటకృష్ణయ్య, రవీంద్ర తదితరులు పాల్గొన్నారు.

ఆహార పొట్లాల పంపిణీ



ఆహారపొట్లాలు పంపిణీ చేస్తున్న నిర్వాహకులు

గూడూరు(టౌన్): ఎంఎఫ్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక అంబేద్కర్ భవన్ ప్రాంతంలో పేదలు, వికలాంగులకు ఆహార పొట్లాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సంస్థ ప్రతి నిధులు మాట్లాడుతూ ప్రతి ఆదివారం సంస్థ తరపున సేవా కార్యక్రమాలను నిర్వహిస్తున్నామన్నారు. సేవా కార్యక్రమాలను విస్తృత పరిచేందుకు చర్యలు చేపట్టామన్నారు. ప్రతి ఆదివారం క్రమం తప్పకుండా ఇప్పటికే నూట ఇరవై ఆరు వారాలకు పైగా ఆహార పొట్లాలను అందజేయడం ద్వారా సంతృప్తి పొందుతున్నామన్నారు. భవిష్యత్తులో సేవా కార్యక్రమాలను విస్తృత పరచడంతో పాటు విద్యాభివృద్ధికి కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు మగ్దూమ్, సర్తాజుద్దీన్, అమ్మద్దీన్, జావిద్అలీ, తదితరులు పాల్గొన్నారు.

రెడ్ సంస్థ ఆధ్వర్యంలో..

పట్టణంలోని పలు ప్రాంతాలలో యాచకులు, పేదలకు ఆహారపొట్లాలను అందజేశారు. ఈ సందర్భంగా సంస్థ సభ్యులు మాట్లాడుతూ రోడ్ల వెంబడి భిక్షాటన చేసే వారికి, పేదలకు తమ సంస్థ ఆధ్వర్యంలో దాతల సహకారంతో ఆహారపొట్లాలను అందజేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో జాహ్నవి, మహదేవ్, రాజేష్, సుధీర్, శ్రీధర్, శ్రీనివాసాచారి, మస్తాన్ పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో సాయి సత్సంగ నిలయ వార్షికోత్సవం

గూడూరు(టౌన్): స్థానిక సాయి సత్సంగ నిలయంలో ఆదివారం 20వ వార్షికోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఉదయం బాబాకు అభిషేకం, విజయదుర్గా అమ్మవారికి నవావరణ హోమం, బాబా కీర్తనలు, పాటల పోటీలు, మధ్యాహ్నం హారతి, స్తవనమంజరి నిర్వహించారు. అనంతరం కోట ప్రకాశం రచించిన శ్రీసాయి ప్రబోధ చంద్రిక పుస్తకాన్ని ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్ ఆవిష్కరించారు. తర్వాత సత్సంగం, బాబాకు పల్లకీ సేవ, సేజ్‌హారతి వైభవంగా జరిగాయి. పట్టణంలోని పలువురు ప్రముఖులు బాబాను దర్శించుకుని ప్రత్యేక పూజలు జరిపారు. హెచ్‌డీపీటీ జిల్లా కో-ఆర్డినేటర్ కోట సునీల్‌కుమార్, డాక్టర్ రోహిణి, డాక్టర్ జనార్దన్‌రెడ్డి, సాయి, మహేష్, కిషోర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



శ్రీసాయి ప్రభోద చంద్రిక పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే

మంత్రికి తమ్ముళ్ల స్వాగతం

కోట : రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డికి ఆదివారం కోట క్రాస్‌రోడ్డులో తెలుగు తమ్ముళ్లు ఘనస్వాగతం పలికారు. చిట్టమూరు మండలం ఆరూరులో ఉక్కు జనార్దన్ అంతిమయాత్రకు వెళుతున్న సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డిని సెంట్రల్ బ్యాంక్ వైస్ చైర్మన్ నల్లపరెడ్డి జగన్‌మోహన్‌రెడ్డి, మండల పరిషత్ ఉపాధ్యక్షులు మధు యాదవ్, విప్ దారా సురేష్, నాయకులు దారా వల్లయ్య శాలువాలు, పూలమాలలతో అభినందించారు. 15 నిమిషాల పాటు క్రాస్‌రోడ్డులో మండల రాజకీయాలపై సోమిరెడ్డి టీడీపీ నేతలతో చర్చించారు. పలు సమస్యలను టీడీపీ నాయకులు మంత్రి దృష్టికి తీసుకువచ్చారు. నాయకులంతా ఐకమత్యంగా పార్టీకోసం పనిచేయాలని ఆయన సూచించారు.



మంత్రి సోమిరెడ్డితో చర్చిస్తున్న తెలుగుదేశం పార్టీ నేతలు

సినిమాగైడ్

గూడూరు

శ్రీనివాస్ తేజ:	వివేకం
సుందరమహల్:	జయ జానకి నాయక
సీవీ :	వివిపి 2
సంగం:	అర్జున్‌రెడ్డి

కోట

ఆర్ఆర్‌టి :	పిదా
రామ్‌రాజ్:	జయ జానకి నాయక
అరుణ:	నేనే రాజు నేనే మంత్రి

ఉండ్రాళ్లయ్యా.. ఇక సెలవయ్యా..!



గూడూరు మండలం అడవిలో వినాయకుడి ఆలయంలో అన్నదాన కార్యక్రమం



వాకాడు: జనసంద్రమైన తూపిలితీరం



కోట: ఉట్టి కొడుతున్న తెలుగుదేశం నాయకుడు మనోజ్‌రెడ్డి తదితరులు



తూపిలితీరంలో వినాయకుడి నిమజ్జనం

- భక్త జన సంద్రం తూపిలితీరం
- 1523 విగ్రహాల నిమజ్జనం
- తరలివచ్చిన వేలాది మంది

తూపిలిపాళెం(వాకాడు): మండలంలోని తూపిలిపాళెం సముద్ర తీరం ఆదివారం భక్తజన సంద్రంగా మారింది. నిమజ్జనానికి మూడవరోజు కావడంతో విగ్రహాలను నిమజ్జనం చేసేందుకు భక్తులు వినాయక విగ్రహాలతో బారులు తీరారు. దీంతో తూపిలిపాళెం సముద్ర తీరం నుంచి కొండూరు వరకూ 5 కిలో మీటర్లు దూరం వాహనాలతో సుమారు 3 గంటల పాటు రాకపోకలు స్తంభించాయి. తమిళనాడు, శ్రీకాళహస్తి, పుత్తూరు, సూళ్లూ రుపేట, నాయుడుపేట తదితర ప్రాంతాల నుంచి భక్తుల తాకిడి అధికమవడంతో కేవలం ఆదివారం ఒక్కరోజే 1523 విగ్రహాలు నిమజ్జనం కాగా 10 వేల మందికి పైగా భక్తులు తరలివచ్చారు. దీంతో తూపిలితీరం జనసంద్రంగా మారి కళకళలాడింది. నిమజ్జనాలకు వచ్చే వినాయక ప్రతిమలను పోలీసులు రికార్డుల్లో నమోదు చేశారు. భక్తుల సంరక్షణకు తీరంలో పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. వాకాడు సీఐ సత్య నారాయణ ఆధ్వర్యంలో తీరంపై ప్రత్యేక దృష్టి సారించి ఎలాటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా పటిష్ట భద్రతా ఏర్పాట్లు నిర్వహించారు.

నిమజ్జనానికి తరలిన వినాయక విగ్రహాలు

చిల్లకూరు: మండల పరిధిలోని పలు గ్రామాల్లో ఏర్పాటుచేసిన వినాయక విగ్రహాలు ఆదివారం మూడోరోజు కావడంతో నిమజ్జనానికి తరలివెళ్లాయి. స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. యువకులు ఉత్సహంగా కేరింతలు కొడుతూ ఉట్టి కార్యక్రమాలు నిర్వహించారు. పలు విగ్రహాల వద్ద అన్నదాన కార్యక్రమాలు నిర్వహిం చారు. అనంతరం స్వామివారి విగ్రహాలను మేళ తాళాల నడుమ యువకులు నత్యాలు చేస్తూ పురవీధుల్లో ఊరేగించుకుంటూ స్వామి వారి విగ్రహాలను నిమజ్జ నానికి తరలించారు.

పోటాపోటీగా నిమజ్జనోత్సవాలు

కోట : వినాయక చవితి మూడవ రోజు పర్వదినాన్ని పురస్కరించుకుని ఆదివారం పలు గ్రామాలలో పోటాపోటీగా గణేష్ ఉత్సవాలు జరిగాయి. ఆయా గ్రామాలలోని గణేష్ విగ్రహాలను ఊరేగింపుగా తీసుకువెళ్లి నిమజ్జనానికి తరలించారు. గోవిందపల్లిపాళెం, శ్రీనివాసత్రం, గ్రామాలలో గల బంగాళాఖాతంలో పోటాపోటీగా నిమజ్జనాలు జరిగాయి. యమదిన్నెపాళెం, గున్నంపడియ, కొత్తపట్నం, శ్రీనివాసనత్రం, చెందోడు, విద్యానగర్, తదితర గ్రామాలలో యువత కేరింతలు కొడుతూ ఉత్సాహంగా ఉట్టిని కొట్టడం జరిగింది. ఆయా గ్రామాలలో వీధివీధిలో వినాయక విగ్రహాలు పెట్టడంతో గ్రామాలలో పండుగ వాతావరణం నెలకొంది.

ఇటుకల భారం మోయలేం

- భారంగా మారిన పక్కాగృహాల నిర్మాణం
- ఆందోళనలో లబ్ధిదారులు

కోట : ఎన్నడూలేని విధంగా ఈ ఏడాది ఇటుకల డిమాండ్ విపరీతంగా పెరిగింది. డిమాండ్‌కు తగ్గట్లు పక్కాగృహాల నిర్మాణం వేగవంతంగా సాగుతుండడంతో ఇటుకల ధరలు అందనంత ఆకాశానికి వెళ్లిపోయాయి. సామాన్యుడు ఇటుకలు కొని పక్కాగృహాలు నిర్మించుకునే స్థితిలో లేని పరిస్థితిలో ఉన్నా డు. దీంతో పక్కాగృహాల నిర్మాణానికి లబ్ధిదారులు ముందుకు రాకపోవడంతో ఎన్టీఆర్ గృహనిర్మాణ పథకం ముందుకు సాగ డంలేదు.

కోట మండలంలోని 21 పంచాయతీలలో ఈ ఏడాది ఎన్టీఆర్ గృహనిర్మాణ పథకం కింద 280 పక్కాగృహాలు, ప్రధానమంత్రి ఆవాస్ యోజన కింద మరో 50 పక్కాగృహాలు మంజూ రయ్యాయి. ఆయా గృహాల నిర్మాణాలను వేగవంతం చేయాలని గృహనిర్మాణ శాఖ అధికారులు లబ్ధిదారులను అప్రమత్తం చేశారు. ఇందుకోసం అవగాహన సదస్సులు ఏర్పాటు చేసి పక్కాగృహాల నిర్మాణాన్ని వేగవంతం చేసేందుకు శ్రీకారం చుట్టారు. అంతేకాకుండా ప్రభుత్వం మంజూరుచేసే పక్కాగృహాలకు తక్షణం బిల్లులు చెల్లింపులు చేసేలా ఆ శాఖ ఉన్నతాధికారులు చర్యలు చేపట్టారు. దీంతో మండలంలోని సముద్రతీర ప్రాంత గ్రామాలైన కొత్తపట్నం, శ్రీనివాసనత్రం, కర్లపూడి, సిద్దవరం, ఉత్తమనెల్లూరు, వెంకన్నపాళెం, కోట, మైక్రోటవర్ కాలనీ, చిట్టేడు తదితర గ్రామాలలో ఎన్టీఆర్ గృహనిర్మాణం కింద పక్కాగృహాలను లబ్ధిదారులు వేగవంతం చేశారు. ప్రభుత్వం ఇచ్చే డబ్బులు ఇటుకల కొనుగోలుకే సరిపోకపోవడంతో లబ్ధిదారులు పనులను పూర్తిచేయలేకున్నారు.

ఆగిన నిర్మాణాలు..

నాలుగు సంవత్సరాల నుంచి పోల్చుకుంటే ఈ ఏడాది ఇటుకల ధరలు గణనీయంగా పెరిగి పోయాయి. గతంలో కంటే ఈ ఏడాది పక్కాగృహాల నిర్మాణం తక్కువే అయినప్పటికీ ఇటుకల వ్యాపారులు రాయి ధరను విపరీతంగా పెంచేశారు. ఒకప్పట్లో ఒక ఇటుక రాయి ఒకటి నుంచి రెండు రూపాయలుండగా ప్రస్తుతం రూ 4 నుంచి 5 పలుకుతోంది. అదే వెయ్యి నుంచి ఆరువేల లోపు ఇటుకలు కొనుగోలు చేసిన వ్యక్తికి వెయ్యిరాయి రూ4వేల నుంచి రూ5వేల వరకు విక్రయిస్తున్నారు. విడిగా కొనుగోలు చేస్తే రాళ్లధర తడిసి మోపెడవుతోంది. దీంతో ఊనుగుంటపాళెం, తిన్నెలపూడి, గూడలి, రాఘవపురం, వెంకన్నపాళెం, తాటితోపు తదితర గ్రామాలలోని లబ్ధిదారులు అంత డబ్బులు వెచ్చించి ఇటుకలు కొనుగోలు చేయలేక పక్కాగృహాల లబ్ధి దారులు వెనకడుగు వేస్తున్నారు. గృహ నిర్మాణ శాఖ అధికారులు పక్కాగృహాలను వెంటనే నిర్మించుకోవాలని ఒత్తిడి చేస్తున్నారు. పెరిగన ధరలతో లబ్ధిదారులు ముందుకుసాగలేకున్నారు. జిల్లా ఉన్నతాధికారులు తక్షణం స్పంచింది పెరిగి ఇటుక ధరలను తగ్గింపునకు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.



వెంకన్నపాళెంలో తయారువుతున్న ఇటుక బట్టీలు

గృహాలు భారంగా మారాయి



ఇటుకల ధరలు విపరీతంగా పెరిగిపోయాయి. పక్కాగృహాలు నిర్మించుకోవడం కష్టతరంగా మారింది. ఒకప్పట్లో రూ.2లు ఉన్న ఇటుక రెట్టింపయ్యింది. పక్కాగృహాలు కట్టుకునే పరిస్థితిలో లేము.

- సురేష్, గూడలి

అధికారులు స్పందించాలి

ఇటుకల వ్యాపారులు కుమ్మక్కయ్యారు. ధరలు పెంచేశారు. ఎక్కడికెళ్లినా ధరలు ఒకే విధంగా ఉన్నాయి. కలెక్టర్ తక్షణం స్పందించాలి. ఇటుకల ధరలు అదుపులోకి తేవాలి.

- వెంకటేశ్వర్లు, లబ్ధిదారుడు

- ధరలు తగ్గిస్తాం



ఇటుకల ధరలు విపరీతంగా పెరిగిపోయింది వాస్తవమే. అ లబ్ధిదారుడు తహసీల్దార్, ఆర్డీవోని కలిస్తే తగిన ధరలకే ఇటుకలు ఇప్పించేందుకు ప్రయత్నాలు చేస్తున్నాం.

- షబ్బీర్, హౌసింగ్ ఏఈ

ఉక్కు మృతి టీడీపీకి తీరనిలోటు

కోట : పార్టీ ఆవిర్భావం నుంచి పనిచేస్తూ ఎన్నో వడిదిడుకులు ఎదుర్కొని పార్టీ పటిష్టత కోసం పనిచేసిన ఉక్కు జనార్ధన్ అకాల మరణం చెందడం తీరని లోటని టీడీపీ నాయకులు వేరువేరు ప్రకటనలో తెలియజేశారు. మండల టీడీపీ కన్వీనర్ మద్దాలి సర్వోత్తమరెడ్డి, సిద్దవరం సింగల్‌విండో అధ్యక్షులు కోటేశ్వరరెడ్డి, మండల పరిషత్ ఉపాధ్యక్షులు మధుయాదవ్, దేవారెడ్డి మనోజ్‌రెడ్డి, నెల్లూరు మోహన్‌రెడ్డి, కోనిశెట్టి రమేష్, ఉచ్చూరు రవీంద్రరెడ్డిలు మాట్లాడుతూ ఉక్కు జనార్ధన్ పార్టీ పటిష్టత కోసం ఎంతో కృషిచేశారన్నారు. అంతేకాకుండా పార్టీలో కీలకంగా వ్యవహరించి ఎంతోమంది బీసీలకు అండగా ఉన్నారన్నారు. అలాంటి వ్యక్తి చనిపోవడం పార్టీకి తీరని లోటన్నారు. వారి కుటుంబ సభ్యులకు తమ ప్రగాడ సంతాపాన్ని తెలియజేశారు.

ముత్యాలమ్మకు విశేష పూజలు



చిల్లకూరు: మండల పరిధిలో తూర్పు కనుపూరు గ్రామంలో వెలసివున్న ముత్యాలమ్మ అమ్మవారికి ఆదివారం విశేష పూజలు నిర్వహించారు. చుట్టుపక్కల ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో ఆలయం వద్దకు వచ్చి పొంగ ళ్లు పెట్టుకుని ప్రత్యేక అలంకణలో వున్న ముత్యాలమ్మ అమ్మవారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం ఆలయ సిబ్బంది భక్తులకు తీర్థ ప్రసాదాలు పంచి పెట్టారు. కార్యక్రమంలో ఈవో కోవూరు జనార్ధన్ రెడ్డి, సురేంద్ర తదితరులు పాల్గొన్నారు.

అలంకరణలో ముత్యాలమ్మ

వాన.. వరద.. బురద



వీధులలో నిల్వచేరిన వర్షపునీరు

కోట : మండలంలోని పలు గ్రామాలలోని వీధులన్నీ రొచ్చు రొచ్చుగా మారాయి. శనివారం అర్ధరాత్రి కురిసిన వర్షం కారణంగా పలు వీధుల్లోకి వర్షపు నీరు నిల్వ చేరింది. అదేవిధంగా ఆదివారం చిరుజల్లులు పడుతూ ఉన్నాయి. దీంతో గ్రామాలలో రోడ్లన్నీ బురదమయంగా మారాయి. అంతేకాకుండా పలు డెల్టా గ్రామాలలో ఇప్పుడిప్పుడే వరికోతలు మొదలయ్యాయి. కొంతమంది రైతులు రోడ్లపైనే ధాన్యాన్ని నిల్వచేసి ఉన్నారు. ఆ ధాన్యమంతా వర్షంలో తడిసిపోయింది. విద్యానగర్, వెంకన్నపాళెం, వంజివాక, తిమ్మానాయుడుపాళెం, కొక్కుపాడు గ్రామాలలో కాల్చేందుకు సిద్ధం చేసిన ఇటుక బట్టీలు పూర్తిగా తడిసిపోయాయి.

ప్రభుత్వ పాఠశాలల మనుగడ ప్రశ్నార్థకం

వెంకటగిరి: ప్రైవేట్ పాఠశాలలను రద్దు చేయకుంటే ప్రభుత్వ పాఠశాలల మనుగడ ప్రశ్నా ర్థకంగా మారే ప్రమాదం ఉందని మాజీ ఎమ్మెల్యే, ఆర్వీఎం హైస్కూల్ కరస్పాండెంట్ సాయికృష్ణ యాచేంద్ర ఆందోళన వ్యక్తం చేశారు. ఆదివారం పాఠశాల ప్రాంగణంలో 1964లో ఆర్వీఎం ఉన్నత పాఠశాలలో ఎస్ఎస్ఎల్‌సి చదివిన పూర్వపు విద్యార్థులు నిర్వహించిన ఆత్మీయ సమావేశానికి ముఖ్య అతిథిగా ఆయన విచ్చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో కార్పొరేట్ స్థాయి వసతులను ప్రభుత్వం కల్పిస్తోందన్నారు. ఉత్తమ విద్యా బోధన చేస్తున్నా విద్యార్థుల తల్లిదండ్రులు కార్పొరేట్ పాఠశాలలపై మోజుతో పిల్లలను ప్రైవేట్ పాఠశాలలకు పంపుతున్నారన్నారు. ప్రభుత్వం పాఠశాలల్లో చదివే విద్యార్థులు పరీక్షల్లో ప్రతిభ కనబరిస్తే వారిని తమ పాఠశాలల్లో, కళాశాలల్లో చేర్చుకునేందుకు కార్పొరేట్ విద్యా సంస్థలు క్యూ కడుతుంటాయని గుర్తు చేశారు. విద్యార్థుల తల్లిదండ్రులు ఈ విషయాలు తెలుసుకోవాలని సూచించారు. తమ పిల్లలను ప్రభుత్వం పాఠ శాలలలో చేర్పించి వారికి ఉజ్వల భవిత అందించాలని సూచించారు. దీనిపై ప్రతి ఒక్కరూ ఆలోచించాలని కోరారు. అనంతరం పూర్వపు విద్యార్థులను అభినందించారు. ఈ సందర్భంగా పదో తరగతి పరీక్షల్లో ప్రతిభ కనపరిచిన విద్యార్థులకు పూర్వపు విద్యార్థులు అందించిన డిక్షనరీలు, నగదు ప్రోత్సాహక బహుమతులను ఆయన చేతుల మీదుగా అందజేశారు. ఈ కార్యక్రమంలో పూర్వపు విద్యార్థుల సంఘ అధ్యక్షులు కుమార స్వామి, చెంగల్‌రాయలు, ప్రస్తుత ఆర్వీఎం ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే

నేటి నుంచి గాలికుంటు వ్యాధి టీకాలు

ఓజిలి: మండలంలో గాలికుంటు వ్యాధి నివారణకు 18 వేల టీకా డోసులు సరఫరా చేసినట్లు మండల పశువైద్యాధికారి సుదర్శన్‌రావు ఆదివారం తెలిపారు. సోమవారం నుంచి 24వ విడత టీకాల కార్యక్రమం ప్రారంభమవుతున్నట్లు ఆయన చెప్పారు. ఈకార్యక్రమం సెప్టెంబరు నెల 24వ తేదీవరకు కొనసాగుతుందన్నారు. ఇందులో భాగంగా 28వ తేదీ మండలంలోని రాచపాళెం, గుర్రంకొండ గ్రామాలలో గాలికుంటు వ్యాధి టీకా మందు డోసులను వేయనున్నట్లు తెలిపారు. ఆయా గ్రామాలలోని గొర్రెలు, జీవాల యజమానులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

కొండ దిగని కూరగాయలు

● టమోటాతో పోటీ పడుతున్న ఉల్లి ● సామాన్యుల ఇంట వంట పెనుభారం

నాయుడుపేట : సామాన్యుడికి కాస్తా..కూస్తో అందుబాటులో ఉండే కూరగాయలు కూడా కన్నీళ్లు పెట్టిస్తున్నాయి. కోయకుండా ఉల్లి ఏడిపిస్తుంటే.. టామోటా మాత్రం మార్కెట్‌లో పైపైకి ఎగబాకి వినియోగదారుడిని ఉక్కిరి బిక్కిరి చేస్తోంది. ఇలా అందుబాటులో ఉండాల్సిన కూరగాయలు అధికరేట్లు ఉండడంతో పండుగ రోజు కూడా సర్దుకుని కూర చేసుకోవాల్సి వచ్చిందని పలువురు వాపోతున్నారు.

వర్షాకాల సీజన్‌లో కూరగాయలు సాధారణ ధరలతో సామాన్య ప్రజలకు అందుబాటులోకి వస్తుంటాయి. ఈ ఏడాదిమాత్రం అడపదడప వర్షాలు కురుస్తున్నప్పటికి.. అందుబాటులో ఉండాల్సిన కూరగాయాలు మాత్రం కొండెక్కి కూర్చొన్నాయి. మరీ ముఖ్యంగా పండగనాడు కూరగాయాల ధరలు భగ్గుమన్నాయి. ఈ ధరలు చూసి పేదలు లబోదిబోమన్నారు. కొద్ది రోజులుగా కూరగాయల ధరలు



కూరగాయలు కొనుగోలు చేస్తున్న ప్రజలు

ఆకాశాన్ని అంటుతున్నాయి. ముఖ్యంగా టమోటా, ఉల్లిపాయల ధరలు ప్రస్తుతం పోటీ పడి పెరుగుతున్నాయి. టమోటా ఇటీవల కిలో వంద రూపాయల వరకు చేరి సగానికి దిగింది. దీంతో కూరగాయలను కూడా చూసిచూసి కొనుగోలు చేయాల్సి వస్తోందని పలువురు వాపోతున్నారు. 200 రూపాయలు పెట్టినా సంచి నిండక పోవడంతో నిరాశతో వెనుతిరుగుతున్నారు. కేవలం ఆకుకూరలతో సరిపుచ్చుకోవాల్సి వస్తుందని పలువురు గృహిణులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పండగ వస్తుందంటే పండ్ల ధరలకు కూడా ఒక్కసారి రెక్కలు వస్తున్నాయి. దేవుడికి నైవేద్యంగా పెట్టాల్సిన పండ్లను కూడా ఒకటి, అరాతో సరిపుచ్చాల్సి వస్తుందని నాయుడుపేట పట్టణానికి చెందిన ఓ ఉద్యోగి వాపోయాడు. ఇలా కూరగాయాలు ఆకాశాన్ని అంటుతుంటే ఆకు కూరలు మాత్రం సామాన్యుడికి అందుబాటులో ఉన్నాయి. ఏదీ ఏమైన ప్రతి నెలలో ఏదొక రూపంలో నిత్యావసరాలు సామాన్యుడి నడ్డి విరగొడుతున్నాయి.

ధరల పట్టిక

టమోటాలు 50, వంకాయలు 50, పచ్చిమిర్చి 60, ఉర్లగడ్డలు 40, క్యారెట్ 80, బీన్సు 80, బెండ 30, అల్లం 65, బీన్స్ 40, యర్రగడ్డలు 40, కాకర 20, దొండ 20, చామగడ్డలు 20, బీరకాయలు 30, దోసకాయలు 20, మామిడికాయలు 40, మునక్కాయలు 30, అరటికాయ (ఒకటి) 5, పొట్లకాయ (ఒకటి) 10, కందగడ్డలు 40, ముల్లంగి 20, పందిరి చిక్కుళ్లు 50, గోరుచిక్కుళ్లు 20, సొరకాయ (ఒకటి) 10, గుమ్మడికాయ (ఒకటి) 40, బీట్రూట్ 30, క్యాలీఫ్లవర్ 30, సీమవంకాయలు 25

అమ్మకాలు తగ్గిపోయాయి



కూరగాయల ధరలు విపరీతంగా పెరగడంతో అమ్మకాలు బాగా తగ్గిపోయాయి. కూరగాయలు అమ్మకాలు లేక మిగిలిపోతే వాటి నాణ్యత తగ్గిపోతుండటంతో నష్టపోతున్నాం.

- వాసు, కూరగాయల వ్యాపారి

సంచి నిండడం లేదు



200 రూపాయలకు కూరగాయలు కొన్నా సంచి నిండడం లేదు. వర్షాకాలంలో కూరగాయల ధరలు మండిపోవడం విచిత్రంగా ఉంది. కూలీనాలీ చేసిన సంపాదన అంతా కూరగాయాలకే సరిపోతుంది.

- మస్తానమ్మ

సంపాదన కూరగాయలకే..



వినాయక చవితి పండగ అంటేనే పిల్లలంతా ఇంటికొస్తారు.. వారి కోసమైన ఈ పండగను చేసుకోవాల్సిన పరిస్థితి. అయితే సంపాదించిన నాలుగురాళ్లు కూరగాయాలకే సరిపోతుంది.

- సంచి కృష్ణయ్య



జననీరాజనాల మధ్య కొనసాగుతున్న ఉక్కు అంతిమయాత్ర

అశ్రునయనాల మధ్య..

● జనార్దన్ అంతిమయాత్ర

● నివాళులు అర్పించిన మంత్రి సోమిరెడ్డి, ఎమ్మెల్సీ బీద, ఎమ్మెల్యే పాశం, గంగాప్రసాద్ నివాళులు

● ఆరు మండలాల నుంచి అభిమానులు హాజరు

చిట్టమూరు : చిట్టమూరు మండల పరిషత్ అధ్యక్షుడు, తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకుడు ఉక్కు జనార్దన్ అంతిమయాత్ర జన నీరాజనాల మధ్య సాగింది. టీడీపీ ప్రముఖులు, నేతలు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొని నివాళులు అర్పించారు. వ్యవసాయ శాఖా మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి, టీడీపీ జిల్లా అధ్యక్షుడు బీద రవిచంద్ర, గూడూరు ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్, ప్రముఖ పారిశ్రామికవేత్త కొండేపాటి గంగాప్రసాద్, మాజీమంత్రి పరసా రత్నం,నల్లపరెడ్డి జగన్ మోహన్‌రెడ్డి, తదితరులు ఉక్కు జనార్దన్ మృతదేహానికి బాధతప్తహృదయాలతో నివాళులు అర్పించి కుటుంబ సభ్యులను ఓదార్చారు. టీడీపీ మండల కన్వీనర్ గణపర్తి కిశోర్‌నాయుడు, గోపాల్‌రెడ్డి, మస్తాన్‌రెడ్డి ఉక్కు పార్ధీవదేహం వద్దే ఉండి అంత్యక్రియలు నిర్వహించారు. అదే విధంగా కోట, వాకాడు, చిట్టమూరు, నాయుడుపేట, గూడూరు సూళ్లూరుపేట ప్రాంతాలకు చెందిన టీడీపీ నేతలు, ఎంపిడీవో సురేష్‌బాబు, తహసిల్దారు చంద్రశేఖర్, వివిధ శాఖల అధికారులు జనార్దన్ పార్ధివదేహం వద్ద నివాళులు అర్పించారు. ఆమేరకు ఉక్కు అభిమానుల కన్నీటి వీడ్కోల మధ్య ఆరూరు చెరువులో అంత్యక్రియలు జరిగాయి. నివాళులు అర్పించిన వారిలో పెంచలకోన ఆలయ చైర్మన్ తానంకి నానాజీ, ఓస్‌డీ పెంచలరెడ్డి, టీడీపీ మండల ప్రధాన కార్యదర్శి గుంపర్ల చిన్నారావు, చిట్టమూరు, కోట, వాకాడు జెడ్‌పిటిసి సభ్యులు దువ్వూరు భారతమ్మ, ప్రసాద్, ప్రమీల, శివకోటారెడ్డి, చిట్టిబాబు, చిరంజీవిరెడ్డి, పోలిన శ్రీనివాస్, సీఐ అక్కేశ్వరావు, తహసీల్దార్ చంద్రశేఖర్, ఎంపీడీవో సురేష్‌బాబు, ఎస్సై వేణుగోపాల్ తదితరులు ఉన్నారు.



ఎంపీపీ మృతదేహం వద్ద నివాళులు అర్పిస్తున్న మంత్రి సోమిరెడ్డి





జనార్దన్ మృతదేహానికి నివాళులు అర్పిస్తున్న గూడూరు ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్, కొండేపాటి గంగాప్రసాద్, నానాజీ

వెంకయ్యనాయుడుకి వేనాటి సత్కారం



వెంకయ్యనాయుడుని సత్కరిస్తున్న వేనాటి

సూళ్లూరుపేట : భారత ఉపరాష్ట్రపతిగా నియమితులైన ముప్పవరపు వెంకయ్యనాయుడును జడ్పీ ఫ్లోర్ లీడర్ వేనాటి రామచంద్రారెడ్డి శనివారం అమరావతిలో కలసి శాలువాతో సత్కరించారు. జిల్లాతో పాటు సూళ్లూరుపేట అభివృద్ధికి సహకరించాలని ఈ సందర్భంగా ఆయన విజ్ఞప్తి చేశారు.

సినిమా గ్రిడ్

నాయుడుపేట

సీఎస్‌తేజ : జయ జానకి నాయక
మురారి : ఫిదా
శ్రీవెంకటేశ్వర : నేనే రాజు..నేనే మంత్రి

సూళ్లూరుపేట

శ్రీలక్ష్మి : జయ జానకి నాయక
ఎన్‌వీఆర్ : నేనే రాజు..నేనే మంత్రి

సాగు గుర్తింపుకార్డులకు దరఖాస్తు చేసుకోండి

దొరవారిసత్రం: వ్యవసాయ శాఖ ద్వారా రాయితీ పొందే యంత్రీకరణ యంత్రీకరణ పనిముట్లు, ఎరువులు, విత్తనాల కోసం రైతులు సాగు గుర్తింపు కార్డులు పొందాలని మండల ఇన్‌చార్జ్ వ్యవసాయాధికారి జోగి గణేష్ తెలియజేశారు. ఆదివారం ఆయన విలేఖర్లతో మాట్లాడుతూ రైతులు సాగు గుర్తింపు కార్డుల కోసం మండల వ్యవసాయ శాఖ కార్యాలయంలో దరఖాస్తులు చేసుకోవాలని తెలిపారు. అయితే ఈ కార్డులకు పట్టాదారు పాసుపుస్తకాలున్న రైతులు దరఖాస్తులు చేసుకోవాల్సిన అవసరం లేదని తెలిపారు. భూములు సాగుచేసుకొంటున్నప్పటి పట్టాదారు పాస్తుకాలు లేకుండా, తమ భూములకు సంబంధించిన రికార్డులు అగ్రిమెంట్లుగా, రిజిస్ట్రర్ డాక్యుమెంట్స్‌గా, వారసత్వ పత్రాలతో ఉండిన వారు దరఖాస్తులు చేసుకోవాలని కోరారు. రైతులు తాము సాగు చేసుకొనే భూములకు సంబంధించిన పత్రాలు ఏమీ ఉన్నా వాటితో పాటు, ఆధార్ కార్డు జత పరిచి దరఖాస్తు చేసుకొంటే వారిని గుర్తించి వ్యవసాయశాఖ సాగు గుర్తింపు కార్డులు ఇవ్వడం జరుగుతుందన్నారు. ఈ కార్డు ఈ సీజన్ వరకు పంటలకు సంబంధించిన ఎరువులు, విత్తనాలు, యంత్రీకరణ పనిముట్లు రాయితీపై పొందేలా అవకాశం ఉంటుందని తెలిపారు. ఈ కార్డు పొందిన రైతులు రాయితీపై ఎరువులు, విత్తనాలను తమ ఆధార్ బయోమెట్రిక్ విధానంలో పొందవచ్చుని తెలిపారు. రైతులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు. అలాగే మండలంలో కౌలు రైతులు కూడా తాము చేసుకొంటున్న భూములకు సంబంధించిన యజమానుల ఆధార్ కార్డును, భూమి పత్రాల జెరక్స్‌కాపీలు తీసుకొస్తే వారికి కూడా సాగు గుర్తింపు కార్డు ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. వారు కూడ భూములు ఉన్న యజమానుల వలె అన్నీ రాయితీలు పొందవచ్చుని తెలిపారు. ఇలా కౌలు రైతులకు సాగు గుర్తింపు కార్డులు ఇవ్వడం వలన భూయజమానులకు ఎలాంటి ఇబ్బంది రాదని, కేవలం పంట వేసే ఆ సీజన్ వరకు వ్యవసాయశాఖ ద్వారా రాయితీ పొందేందుకు మాత్రమే ఆ కార్డు చెల్లుబాటు అవుతుందని ఆయన స్పష్టంగా తెలియజేశారు. ముఖ్యమంత్రి రైతులు కోసం చేపట్టిన ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు.



మాట్లాడుతున్న గణేష్

బదిలీ ప్రధానోపాధ్యాయుడికి సన్మానం



హెచ్‌ఎంను సన్మానిస్తున్న సిబ్బంది

తడ : మండల పరిధిలోని పాములమిట్ట గ్రామంలో ప్రధానోపాధ్యాయుడుగా పనిచేస్తూ బదిలీ అయిన ఎ. సుజన్‌ను గ్రామస్థులు ఆదివారం ఘనంగా సత్కరించారు. 8 ఏళ్లుగా ఇదేపాఠశాలలో పనిచేస్తూ విద్యార్థులకు అందించిన సేవ, సహాయం గుర్తించుకున్న గ్రామస్థులు ఆయనను ప్రశంసిస్తూ ఆయనను శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎంసీ చైర్మన్ మునిరాజ, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఉస్మాన్‌బాషా, ఉపాధ్యాయురాలు పర్వీన్, తదితరులు పాల్గొన్నారు.

తనియాలిలో 352వ నేత్రదానం

దొరవారిసత్రం: సూళ్లూరుపేటకు చెందిన ఆచార్య భర్వధ్వాజ సేవాసంస్థ ఆధ్వర్యంలో దొరవారిసత్రం మండలం తనియాలిలో ఆదివారం 352వ నేత్రదానం సేకరించారు. తనియాలిలో అరిగిల రమణమ్మ(62) అనారోగ్యంతో మృతి చెందగా, ఆమె కుటుంబ సభ్యుల ఇష్టపూర్వకంతో ఆమె నేత్రాలను సేకరించారు. చెన్నై శంకర్ నేత్రాలయ వారిచే నేత్రాలను సేకరింపచేశారు. రమణమ్మ 352 నేత్ర దాతగా నిలిచినట్లు ఆచార్య భర్వధ్వాజా సేవాసంస్థ ప్రతినిధులు ఎంఎం చంద్రబాబు తెలిపారు. నేత్రాల సేకరణలో ఆలపాటి అశోక్, సాయికుమార్, తదితరులు పాల్గొన్నారు.

మేడపై నుంచి పడిన మహిళ

● పరిస్థితి విషమం



గాయపడ్డ వెంకటరమణమ్మకు చికిత్సలు అందిస్తున్న వైద్యురాలు

నాయుడుపేటరూరల్ : నాయుడుపేట పట్టణం ఎన్‌బీకేఆర్ కాలనీలో నివాసం ఉంటున్న వెంకటరమణమ్మ ఆదివారం మేడపై నుంచి పడి తీవ్రంగా గాయపడింది. వివరాలు ఇలా ఉన్నాయి. ఎన్‌బీకేఆర్ కాలనీకి చెందిన వెంకటరమణమ్మ, భర్త వెంకటరమణయ్యబంధుమిత్రులతో కలసి ఆదివారం ఉదయం శుభకార్యక్రమం నిర్వహించుకున్నారు. అదే సమయంలో వెంకటరమణమ్మ మేడపైకి వెళ్లగా అక్కడ నుంచి ప్రమాదవశాత్తు జారి కిందపడి తీవ్రంగా గాయపడ్డట్లు భర్త వెంకటరమణయ్య తెలిపాడు. సమాచారం అందుకున్న 108 సిబ్బంది నాయుడుపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ప్రాథమిక చికిత్సల అనంతరం ఆమె పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన వైద్యం కోసం నెల్లూరుకు తరలించారు.

విద్యుత్ స్తంభాన్ని ఢీ కొన్న కంటైనర్ లారీ

● తప్పిన పెను ప్రమాదం



విద్యుత్ పోల్‌ను ఢీ కొన్న కంటైనర్ లారీ

నాయుడుపేటరూరల్ : నాయుడుపేట స్వర్ణముఖి బ్రిడ్జి సమీపంలో ఆదివారం తెల్లవారుజామున 11 కేవీ విద్యుత్ లైన్‌ను కంటైనర్ లారీ ఢీ కొంది. నాయుడుపేట మండలం మేనకూరు సెజ్‌లోని ఓ పరిశ్రమలోకి విజయవాడ నుంచి ముడిసరుకులు తీసుకొని పరిశ్రమలో అన్‌లోడ్ చేసి తిరిగి ఆదివారం తెల్లవారుజామున విజయవాడకు బయలుదేరింది. ఈ క్రమంలో బ్రిడ్జి సమీపంలో కంటైనర్ లారీ మలుపు తిప్పే సమయంలో 11 కేవీ విద్యుత్ స్తంభాన్ని ఢీ కొనడంతో ఆకస్మాత్తుగా ఫీడర్ ట్రిప్ అవడంతో పెను ప్రమాదం తప్పింది. అదే సమయంలో ఓజిలి ఎస్సై అటు వైపు వెళ్తుండగా లారీ డ్రైవర్‌ను అదుపులోకి తీసుకొని విచారిస్తున్నట్లు విద్యుత్‌శాఖాధికారులు తెలిపారు.

గణనాథుడికి ఘనవీడ్కోలు





నాయుడుపేటలో నిమజ్జనానికి తరలివెళ్తున్న వినాయక విగ్రహాలు



ఓజిలి: నిమజ్జనోత్సంలో చిందులేస్తున్న యువత

నాయుడుపేట : వినాయకచవితి పండుగ పర్వదినాలలో భాగంగా ఆదివారం వినాయకస్వామి విగ్రహాలను నిమజ్జనానికి తరలించారు. వినాయకస్వామి నిమజ్జనోత్సవంలో మేళతాళాలు, పాశ్చాత్త వాయిద్యాలతో యువత రంగులు చల్లుకొంటూ ఎంతో ఉత్సాహంగా నిమజ్జనోత్సవంలో పాల్గొన్నారు. ఈ నెల 25వ తేదీ శుక్రవారం వినాయకచవితి పండుగకు పట్టణంలోని, గ్రామాల్లో ముఖ్య కూడలి ప్రాంతాలలో వినాయకస్వామి విగ్రహాలను ప్రతిష్ఠ చేశారు. అప్పటి నుంచి వినాయకస్వామికి ప్రత్యేక పూజలు చేశారు. కొన్ని ప్రాంతాలలో వినాయకస్వామి నిమజ్జనానికి తరలించారు. వినాయక చవితి వేడుకల్లో ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య, మున్సిపాలిటీ ఫ్లోర్ లీడర్ రఫీ, రాజగోపాలపురంలో టీడీపీ నాయకులు జీవీఆర్ నాయుడు, అన్నమనేని నాగేశ్వరరావునాయుడు, గాంధీనాయుడు, లక్ష్మీనరసయ్యనాయుడు తదితరులు పాల్గొన్నారు. మహాలక్ష్మినగర్‌లో శ్రీ వినాయక చవితి వేడుకల్లో స్వామివారి లడ్డు వేలం పాట వేయగా లడ్డును 23,116 రూపాయలకు కామిరెడ్డి రవీంద్రరెడ్డి వేలంపాటలో సొంతం చేసుకున్నారు.

ఓజిలి: వినాయక చవితి పర్వదినాన్ని పురస్కరించుకుని ఏర్పాటుచేసిన గణనాథుని నిమజ్జన కార్యక్రమాలు ఆదివారం ఘనంగా జరిగాయి. ఓజిలి మండలంలో వాడవాడలా గణనాథునికి ప్రత్యేక పూజా కార్యక్రమాలు, వివిధ సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించారు. ప్రత్యేకంగా ఆలంకరించిన గణనాథుణ్ని ఆయా గ్రామాలలోని యువత భక్తి శ్రద్ధలతో ఊరేగించింది. ఈ సందర్భంగా యువకులు జైబోలో గణేష్ మహారాజ్‌కే... జై... అంటూ నినాదాలలో హోరెత్తించారు. చిన్నలనుంచి పెద్దల వరకు నిమజ్జన కార్యక్రమంలో పాల్గొన్ని గణనాథుని సాగనంపారు.

చిట్టమూరు: మూడు రోజులుగా జరుగుతున్న చవితి ఉత్సవాల్లో భాగంగా ఆదివారం నిమజ్జన కార్యక్రమాలు వైభవంగా జరిగాయి. మండల కేంద్రమైన చిట్టమూరులో ప్రత్యేకపూజలు నిర్వహించారు. కొత్తగుంట, ఎల్లసిరి, మల్లాం, కోగిలి, పలు ప్రాంతాల్లో వినాయక విగ్రహాలను తూపిలి పాళెం , పంబలి, లైట్‌హౌస్ సముద్ర తీరంలో నిమజ్జన కార్యక్రమాలు చేశారు.



ప్రత్యేక పూజల్లో పాల్గొన్న టీడీపీ నాయకులు, తదితరులు



వినాయక చవితి వేడుకల్లో ఎమ్మెల్యే సంజీవయ్య, రఫీ తదితరులు



చిట్టమూరులో..

నాయుడుపేటలో కుండపోత

నాయుడుపేట : నాయుడుపేటలో శనివారం రాత్రి ఈదురుగాలులతోపాటు కుండపోత వర్షం కురిసింది. ఉదయం నుంచి వాతావరణం పొడిగా ఉన్నప్పటికి రాత్రి వాతావరణంలో మార్పులు చోటుచేసుకొని దాదాపు గంటసేపు కుండపోత వర్షం కురిసింది. తరువాత కూడా జల్లులు పడుతూనే ఉన్నాయి. దీంతో నాయుడుపేటలోని ప్రధాన వీధులన్నీ జలమయమయ్యాయి. నాయుడుపేట రైల్వే స్టేషన్‌లో చెట్లు ఈదురు గాలులకు చెట్టు నెలకొరిగింది. భారీగా కురిసిన వర్షంతో ప్రజలు తెప్పరిల్లారు.

అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు

నాయుడుపేటరూరల్ : నాయుడుపేట పట్టణం పొగగొట్టంకాలనీలో 24 అడుగుల వినాయక విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. స్వామివారికి ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించి ఉట్టి కార్యక్రమం, అన్నదాన కార్యక్రమం అనంతరం లడ్డు వేలంపాట నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు అందర్నీ అలరించాయి. ఈ కార్యక్రమంలో సునీల్, రాము, యశ్వంత్, గోపీ పాల్గొన్నారు.



గీతాలు ఆలపిస్తున్న గాయకులు

నిరుపేదలకు దుప్పట్ల పంపిణీ

సూళ్లూరుపేట : సూళ్లూరుపేట సాయినగర్‌లో వినాయక ఉత్సవాలు సందర్భంగా ఉత్సవ కమిటీ నిరుపేదలకు ఆదివారం దుప్పట్లను పంపిణీ చేసింది. మధ్యాహ్నం అన్నదానం చేశారు. సాయంత్రం గణేష్ నిమజ్జనం చేశారు.



సాయినగర్‌లో నిరుపేదలకు దుప్పట్లు పంపిణీ చేస్తున్న ఉత్సవ కమిటీ సభ్యులు

క్యాట్‌ఫిష్ పూడ్చివేత



క్యాట్‌ఫిష్‌ను గుంతలో పారబోస్తున్న పారిశుధ్య సిబ్బంది

తడ : పోలీసులు స్వాధీనం చేసుకున్న క్యాట్‌ఫిష్ చేపలను పూడ్చిపెట్టారు. వివరాలలోకి వెళ్లితే.. శుక్రవారం అర్ధరాత్రి సమయంలో నెల్లూరు నుంచి మధురైకు 990 కేజీల క్యాట్‌ఫిష్ చేపల ట్రక్ ఆటోను పోలీసులు పట్టుకున్న విషయం పాఠకులకు విదితమే. పట్టుబడ్డ చేపలను రెవెన్యూ, మత్స్యశాఖ అధికారుల సమక్షంలో స్థానిక శివాలయం వెనుకవైపు డంపింగ్‌యార్డ్ వద్ద గుంటతీసి పూడ్చిపెట్టారు. వీటి పూడ్చివేతలో ఎస్సై వెంకటేశ్వరరావు, మత్స్యశాఖ ఎఫ్‌డీవో చాన్‌బాషా, వీఆర్వో రాధాకృష్ణారెడ్డి, తదితరులు వీటిని దగ్గర ఉండి పూడ్చిపెట్టారు.

ఉత్సాహంగా ఉట్టి ఉత్సవం

● నిమజ్జనానికి తరలిన గణేశ్ విగ్రహాలు ● యువకుల కేరింతలు


పొదలకూరులో ఉట్టి ఉత్సవం

పొదలకూరు: మండలంలో అన్ని గ్రామాల్లో చవితి ఉత్సవాల్లో భాగంగా అదివారం ఉట్టిమహోత్సవాన్ని యువకులు ఉత్సాహంగా నిర్వహించారు. మండలంలోని పార్లపల్లి, తాటిపర్తి, నావూరు, మొగళ్ళూరు. పొదలకూరు, ప్రబగిరిపట్నం అరుంధతీయవాడ, తదితర గ్రామాల్లో మూడు రోజుల పాటు వినాయక ఉత్సవాలను నిర్వహించారు. మూడో రోజు ఉట్టి కార్యక్రమంలో యువకులు పాల్గొన్నారు. పొదలకూరు విఘ్నేశ్వరపురం కాలనీ, శివాలయం వీధుల్లో ఏర్పాటు చేసిన గణపతి విగ్రహాలకు ప్రత్యేక పూజలు చేశారు. పట్టణంలోని మస్తాన్‌రెడ్డి నగర్‌లో గణపయ్యకు ప్రత్యేక పూజలు నిర్వహించి, భక్తులకు అన్నదానం చేశారు. గ్రామాల్లో మూడు రోజుల పాటు వేడుకలు నిర్వహించిన ఉత్సవ కమిటీలు మూడవరోజు వినాయకునికి గ్రామోత్సవం నిర్వహించారు. వినాయక చవితి ఉత్సవాల్లో భాగంగా మూడు రోజుల పాటు విశేష పూజలు అందుకున్న గణనాథులు నిమజ్జనానికి కదిలారు.

అన్నదానం

తోటపల్లిగూడూరు : తోటపల్లిగూడూరు మండలంలోని కోడూరు పంచాయితీ వెంకటేశ్వరపట్టపుపాళెం గ్రామంలో గ్రామ పెద్దకాపు ఆవుల మునిరత్నం కుమారుడైన ఆవుల గణేష్ ఆధ్వర్యంలో వినాయక చవితి సంబరాల్లో భాగంగా ఆదివారం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలోని ప్రజలు, వినాయక భక్తులతోపాటు దాదాపు రెండు వేల మందికిపైగా అన్నదానం చేశారు.


టీపీ గూదూరు : అన్నదానంలో పాల్గొన్న పెద్దకాపు మునిరత్నం

అనంతరం సాయంత్ర గణేష్ విగ్రహం వద్ద ప్రత్యేకపూజలు నిర్వహించి స్వామివారికి ప్రసాదాలు సమర్పించారు. రాత్రి తొమ్మిది గంటలకు స్వామివారి విగ్రహాన్ని గ్రామంలో విద్యుద్దీపాల కాంతుల మధ్య ప్రత్యేక పూల గజమాలతో అలంకరించి సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తూ గ్రామోత్సవం నిర్వహించారు.

ఈ కార్యక్రమంలో వెంకటేశ్వర పట్టపుపాళెం పెద్దకాపు ఆవుల మునిరత్నం, చిన్నకాపు, నడిమ కాపు తదితరులు పాల్గొన్నారు.

తీరాన్ని కోసేస్తున్నారు

● పరిశ్రమల రాకతో సాగనివేట ● జీవనాధారంగా నత్తగుల్లల ఏరివేత
● పట్టించుకోని మత్స్యశాఖ ● పస్తులు తప్పని జాలర్ల కుటుంబాలు


ముందుకు వచ్చిన సముద్రం


అమ్మకానికి సిద్ధం చేసిన నత్తగుల్లలు

తోటపల్లిగూడూరు : ప్రకృతి విపరిత్యాలైన సునామి, తుఫాను తదితర విపత్కర పరిస్థితులు ఏర్పడినప్పుడు సముద్రం ముందుకు కదలకుండా తీరానికి రక్షణగా ఉండే నత్తగుల్లలను ఏరేస్తున్నారు. ఫలితంగా సముద్రతీరం రోజురోజుకు ముందుకు కోసుకుపోతోంది. ఈ సంఘటన జిల్లాలోని తోటపల్లిగూడూరు సముద్రతీర ప్రాంతంలో నెలకొని ఉంది. సముద్ర తీరానా అలల తాకిడిని తట్టుకుంటూ తీరం కరిగిపోకుండా, సముద్రం ముందుకు రాకుండా ఉండేవిధంగా నత్తగులల్లు తీరం వెంబడి విస్తరించి ఉంటాయి. అయితే సముద్రతీర ప్రాంతంలో భారీ పరిశ్రమలు రాక కారణంగా మత్స్యకారులు వేటసాగడం కష్టతరంగా మారింది. దీంతో మత్స్యకారుల జీవన విధానం నత్తగుల్లల వైపు మళ్లడంతో తీరం వెంబడి ఉన్న నత్తగుల్లలను ఏరివేయడంతో పాటు ఈ గుల్లలను పగులగొట్టి మాంసాన్ని తీసి అమ్ముతున్నారు.

మంచి గిరాకీ.....

నత్తగులల నుంచి తీసిన మాసం ప్రస్తుతం సాగులో ఉన్న వెనామీ రొయ్యల సాగుకు మేతగా ఉపయోగపడడంతో ఈ మాంసానికి మంచి గిరాకీ ఏర్పడింది. దీనికితోడు వెనామీ రొయ్యలమేత తయారీ విధానంలో ఈ మాంసాన్ని కూడా ఉపయోగించి రొయ్యల మేత తయారు చేస్తుండడంతో గతంలో కిలో రూ.40 ఉన్న ఈ మాంసం ధర ప్రస్తుతం రూ.250 నుంచి రూ.300 వరకు పలుకుతోంది. దీంతో వేటసాగని మత్స్యకారులు నత్తగుల్లల ఏరివేతపై మొగ్గుచూపుతున్నారు. దానికితోడు ఈ నత్తగుల్లల మాంసాన్ని రొయ్యల మేతతోపాటు కోళ్లమేతకు ఉపయోగించడంతో తీరం వెంబడి ఉన్న మత్స్యకార గ్రామాలు తీరంలో నత్తగుల్లల ఏరివేతపై దృష్టి సారిస్తున్నాయి. ఒక వ్యక్తి రోజుకు ఐదు నుంచి ఏడు కిలోల వరకు నత్తగుల్లలు ఏరడం వలన దాదాపు రూ. 1000నుంచి 1500ల వరకు సంపాదిస్తున్నాడు. ఈ నత్తగుల్లలు తరిగిపోవడంతో పెద్ద అలలు సముద్రంలో వచ్చినపుడు తీరం దాటి బయటకు ఎగసి పడుతున్నాయి. దీంతో తీరం వెంబడి ఉంచిన వలలు, పడవలు దెబ్బతిని మత్స్యకారులు నష్టపోతున్నారు. సంబంధిత మత్స్యశాఖ అధికారులు తీరంలో జరుగుతున్న నత్తగులల ఏరివేతపై ఎటువంటి చర్యలు తీసుకున్న దాఖలాలు కనిపించడం లేదు. ఇప్పటికైనా వారు స్పందించాల్సి ఉంది.

భారీ పరిశ్రమలే కారణం



గ్రామాలకు పరిసర ప్రాంతాల్లో భారీ పరిశ్రమల కారణంగా వేట సాగడం లేదు. ప్రత్యామ్నాయంగా కుటుంబ పోషణకు ఏదో ఒకటి అన్న ఉద్దేశ్యంతో నత్తగుల్లల వైపు మొగ్గుచూపుతున్నాం.

- పామంజి రామలింగయ్య

పూటగడుపుకోవడానికే..



వేట సాగక ఇబ్బంది పడుతున్నాం. కుటుంబాలను పోషించుకునేందుకు తప్పనిసరి పరిస్థిలో నత్తగుల్లల ఏరి అమ్ముకుంటున్నాం. ప్రత్యామ్నాయం చూపితే ఈ వృత్తిని వదిలేస్తాం.

- శ్రీలక్ష్మి

వేట సాగడంలేదు



సముద్రంలో వేటసాగకే తప్పనిసరి పరిస్థితుల్లో కుటుంబాన్ని పోషించుకునేందుకు ఈ పనులు చేస్తున్నాం. ప్రభుత్వం కానీ, నాయకులు గానీ వేట గురించి పట్టించుకున్న దాఖలాలు లేవు.

- తేటంగారి ఆదిశేషు

పుట్టెడు కష్టాల పునరావాసం

● నిధులున్నా వసతులు సున్నా
● స్పందించని అధికారులు

ఆల్ట్రా మెగా థర్మల్ విద్యుత్ కేంద్రం ఏర్పాటుతో ఇంటింటికీ ఉద్యోగం.. మెరుగైన వసతులంటూ రంగుల చిత్రం చూపించారు. పొలాలు, ఇళ్లు తీసుకున్నారు. ముత్తుకూరు సమీపంలో జ్యోతి విహార్ పేరిట పునరావాసం ఇళ్లు కట్టించారు. అనంతరం రిలయెన్స్ సంస్థ థర్మల్ కేంద్ర నిర్మాణం నిలిపివేస్తున్నామని ప్రకటించింది. దీంతో కన్న ఊరునొదిలి వచ్చిన ఆ రెండు గ్రామాలకు పునరావాసం కాలనీలో పురిటినొప్పులు తప్పడంలేదు.

- ముత్తుకూరు


రిలయెన్స్ థర్మల్ పునరావాస కాలనీ

కృష్ణపట్నంలో రిలయెన్స్ కంపెనీ చేపట్టిన ఆల్ట్రా మెగా థర్మల్ కేంద్రం కోసం తరలించిన శంభునితోపు, అయ్యవారప్ప కండ్రిగ గ్రామస్థుల దీనగాథ ఇది. ముత్తుకూరు సమీపంలో రెండు గ్రామాల వారికి 2007లో పునరావాసం కల్పించారు. ఇళ్లు నిర్మించడం పూర్తి కాగానే గ్రామస్థులను అక్కడికి తరలించారు. అన్ని వసతులు కల్పిస్తామని చెప్పిన కొద్దికాలానికే రిలయెన్స్ థర్మల్ కేంద్ర నిర్మాణాన్ని నిలిపివేస్తున్నట్లు 2011లో ప్రకటించింది. అప్పటి నుంచి ఈ పునరావాస గ్రామాల పరిస్థితి అగమ్య గోచరంగా తయారైంది. తమకు ఇచ్చిన హామీల పరిస్థితి ఏమిటని రిలయెన్స్ అధికారులను అడిగితే పునరావాసం, ఇతర అవసరాల నిమిత్తం రూ.20 కోట్లు ప్రభుత్వానికి జమ చేశామని చెప్పి చేతులు దులుపుకున్నారు. శ్మశానం ఏర్పాటు, తాగునీరు, కాంక్రీట్ డ్రైనేజీ నిర్మాణం, ఉపాధి కల్పించకపోవడంతో జీవనోపాధి, ఇళ్ల నిర్మాణ బకాయిలు తదితర అంశాలపై మండల స్థాయి అధికారులు, జిల్లా ఉన్నతాధికారుల వద్దకు పలుమార్లు తిరిగినా ప్రయోజనం శూన్యం. దీంతో బాధితులు రెండు నెలల కిందట ఆందోళనకు దిగారు. సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని నేతలు హామీ ఇవ్వడంతో అప్పట్లో ఆందోళన విరమించారు. ఇప్పటికీ ప్రధాన సమస్యలకు తాత్కాలిక పరిష్కారమే తప్ప శాశ్వతంగా పరిష్కరించే దిశగా అధికారులు చర్యలు తీసుకోవడం లేదని బాధితులు ఆవేదన చెందుతున్నారు. పుష్కలంగా నిధులున్నా సమస్యల పరిష్కారంలో మీనమేషాలు లెక్కిస్తున్నారని వారు వాపోతున్నారు. కనీస వసతులు కరువై తాము అనేక బాధలు పడుతున్నామని ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి థర్మల్ పునరావాస కాలనీకి మౌలికవసతులు కల్పించాలని వారు కోరుతున్నారు.

శ్మశానం ఏర్పాటు చేయాలి



రిలయెన్స్ థర్మల్ పునరావాస గ్రామాలకు శాశ్వత శ్మశానం ఏర్పాటు చేయాలి. శ్మశానానికి అవసరమైన స్థలం కేటాయించి హద్దులు చూపాలి. ప్రహరీ తదితర వసతులు కల్పించాలి. గ్రామంలో ఎవరైనా మరణిస్తే, అంత్యక్రియల నిర్వహణకు ఇబ్బందులు పడుతున్నాం. అధికారులు స్పందిచకపోవడంవల్లే మాకు ఈ తిప్పలు.

- తాండ్ర మల్లికార్జున, వార్డు సభ్యుడు

పైపులైను బాగుచేయాలి



గ్రామంలో మంచి నీటి సరఫరా కోసం నిర్మించిన వాటర్ ట్యాంకులు నిరుపయోగంగా మారాయి. పైపులైను దెబ్బతినడంతో మంచి నీరు రావడం లేదు. గ్రామంలో ఏర్పాటు చేసిన శుద్ధి జల కేంద్రమే మంచినీటికి దిక్కుగా మారింది. గ్రామస్థుల అవసరానికి ఆ నీరు సరిపోవడం లేదు. పునరావాస కాలనీలో అవసరమైన మౌలిక వసతులు కల్పించేందుకు సంబంధిత అధికారులు వెంటనే చర్యలు తీసుకోవాలి.

- దువ్వూరు వీరారెడ్డి, గ్రామస్థుడు

రూ.1.83 లక్షలు పలికిన గణేష్ లడ్డూ

డక్కిలి : మండలంలోని దగ్గవోలు గ్రామంలో గణేష్ లడ్డూను ఆదివారం ఆ గ్రామానికి చెందిన దూడల రవి, సంక్రాతి వెంకటాద్రిలు కలిసి రూ 1.83 లక్షలకు దక్కించుకొన్నారు. మండలంలో ఇప్పటివరకు జరిగిన గణేష్ లడ్డూ వేలంలో ఇదే ప్రథమ స్థానంలో ఉంది. గత ఏడాది గణేష్ లడ్డు రూ 1.92 లక్షలు పలికి న ట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ గ్రామంలో గణేష్ లడ్డును దక్కించుకునేందుకు పలువురు పోటీపడ్డారు. అనంతరం గణేష్ విగ్రహన్ని మేళతాళాలతో ఊరేగింపుగా తీసుకెళ్లి కోలాహలంగా నిమజ్జనం చేశారు.


కలువాయి : గణేష్ విగ్రహం ముందు కోలాటం


రాపూరులో వినాయకుడిని దర్శించుకుంటున్న ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ


బాలాయపల్లి: నిమజ్జనానికి తరలుతున్న గణేషుడు


వెంకటగిరి: కాశీపేటలో ఉట్టి కొడుతున్న యువత

గణపయ్యా.. ఇక ఉంటామయ్యా..!

వెంకటగిరి: వెంకటగిరి పట్టణంలో చవితి మూడో రోజును అత్యంత వైభవంగా నిర్వహించారు. ఏర్పాటు చేసిన వినాయక విగ్రహాలకు ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించి భక్తులకు ప్రసాదాలు పంచి పెట్టారు. అదేవిధంగా పలు చోట్ల నిర్వహించిన ఉట్టి కార్యక్రమాలు కోలాహలంగా జరుపుకున్నారు. యువత ఉట్టి కొట్టేందుకు పోటీ పడ్డారు. యువత కేరింతల నడుమ ఈ కార్యక్రమాలు అట్టహాసంగా జరిగాయి. అదేవిధంగా పట్టణంలో ఏర్పాటు చేసిన వినాయక ప్రతిమలను పూలతో, కన్నులు మిరుమిట్లు గొలిపే విద్యుత్ దీపాలంకరణలతో అలంకరించిన వాహనాలపై వినాయక ప్రతిమలను ఉంచి బాజా భజంత్రీలు, బాణా సంచా పేలుళ్లు, యువత చిందులు, కేరింతల నడుమ చేపట్టిన నిమజ్జనోత్సవం కనుల పండువగా సాగింది. ఈ కార్యక్రమంలో యువకులు చేసిన జైబోలో గణేష్ మహారాజ్‌కే జై అన్న నినాదాలతో పట్టణం మారుమోగింది. అదేవిధంగా వినాయకుని చేతిలో ఉంచిన లడ్డులకు నిర్వహించిన వేలంపాటలలో లడ్డును సొంతం చేసేందుకు భక్తులు పోటీ పడి పాడటంతో ఒక్కో లడ్డు వేలల్లో పలికింది. లడ్డును సొంతం చేసుకొన్న వారు భక్తులకు పంచి పెట్టారు. ప్రత్యేకించి పట్టణంలోని వెలంపాళెంలో ఏర్పాటు చేసిన భారీ వినాయకుని ప్రతిమ నిమజ్జనోత్సవ కార్యక్రమం పట్టణంలో అత్యంత వైభవంగా జరిగింది. ప్రత్యేక వీరేరు బ్యాండ్ మేళాలతో భారీ బాణా సంచా పేలుళ్ల నడుమ చేపట్టిన ఈ నిమజ్జనోత్సవం అందరినీ ఆకట్టుకుంది. ఈ కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ పులి కొల్లు రాజేశ్వరరావు, బీజేపీ నాయకులు ఎల్ కోటేశ్వరరావు, పునుగోటి విశ్వనాథ నాయుడు, వాసునాయుడు, పునుగోటి సుబ్రమణ్యం నాయుడు తదితరులు ఉన్నారు.

డి వడ్డిపల్లి (డక్కిలి) : మండలంలోని డి వడ్డిపల్లి గ్రామంలో ఆదివారం గణేష్ నిమజ్జనోత్సవకార్యక్రమం అత్యంత వైభవంగా జరిగింది. వినాయక చవితి సందర్భంగా ఏర్పాటుచేసిన పాటకచేరి గ్రామస్థులను ఎంతగానో ఆకట్టుకొంది. ఆ గ్రామ సర్పంచి వేపమాను చెంచమ్మ ఆమె భర్త నరసింహులు గణేష్ నిమజ్జన కార్యక్రమంలో పాల్గొన్నారు. గణేష్ నిమజ్జన మహోత్సవం సందర్భంగా డి వడ్డిపల్లి బీసీ కాలనీలో గణేష్ లడ్డుకు నిర్వహించిన వేలం పాటలో ఆ గ్రామ సర్పంచు వేపమాను చెంచమ్మ రూ. 3500లకు స్వామి వారి లడ్డును దక్కించుకొంది. డి వడ్డిపల్లి పాతూరులో నిర్వహించిన గణేష్ లడ్డు వేలం పాటలో ఆ గ్రామానికి చెందిన పాపయ్యగారి శివశంకర్ రూ 6వేలకు స్వామి వారి లడ్డును దక్కించుకొన్నారు. అనంతరం గ్రామసర్పంచు చెంచమ్మ ఆమె భర్త నరసింహులను గ్రామస్థులు శాలువాలు కప్పి ఘనంగా సన్మానించారు. ఇంకా మండలంలోని డక్కిలి, కమ్మపల్లి, దగ్గవోలు, పాతనాలపాడు, లింగసముద్రం, తీర్థంపాడు, మోపూరు, పలుగోడు, మాటుమడుగు, దేవునివెల్లంపల్లి తదితర గ్రామాల్లో గణేష్ నిమజ్జనోత్సవ కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమాల్లో ఎంపీపీ పోలంరెడ్డి వెంకటరెడ్డి, జడ్పీటీసీ ఏలేశ్వరం రామచంద్రయ్య నాయుడు పాల్గొన్నారు.

కోలాహలంగా గణేష్ నిమజ్జనం

కలువాయి : వినాయకచవితి పండుగ సందర్భంగా మండలంలో వాడవాడలా ఏర్పాటు చేసిన గణేష్ విగ్రహాలకు మూడు రోజులు పాటు ప్రత్యేక పూజలు అనంతరం ఆదివారం సాయంత్రం నిమజ్జన కార్యక్రమం కోలాహలంగా జరిగింది. ఈ సందర్భంగా నిర్వహించిన ఉట్టి మహోత్సవాల్లో యువత ఉత్సాహంగా పాల్గొన్నారు. గణేష్ విగ్రహాలను ట్రాక్టర్లపై ఉంచి ప్రత్యేకంగా అలంకరించారు. విగ్రహాలకు ముందు మేళతాళాలతో భక్తులు రంగులు చల్లుకుంటూ ఆనందంగా పెన్నానదికి తీసుకుపోయారు. అక్కడ వేదపండితులు మంత్రోచ్ఛరణల మధ్య గణేష్ విగ్రహాలను పెన్నానదిలో నిమజ్జనం చేశారు. కలువాయి బజారు వీధిలో ఏర్పాటు చేసిన వినాయకుని విగ్రహం నిమజ్జనం ర్యాలీ అత్యంత కోలాహలంగా జరిగింది. గణేష్ విగ్రహానికి ముందు మహిళా భక్తులు కోలాటం నిర్వహించారు. ఈ కోలాటం ఎంతో ఆకర్షణగా నిలిచింది. మండలంలో ఈ ఏడాది పెద్ద సంఖ్యలో వినాయకుని విగ్రహాలు ఏర్పాటు చేశారు. అందులో కొన్ని విగ్రహాలను ఆదివారం నిమజ్జనం చేశారు. కొన్ని చోట్ల ఐదు రోజులు పాటు పూజలు నిర్వహించి నిమజ్జనం చేస్తామని భక్తులు తెలిపారు.

నిమజ్జనానికి తరలిన గణనాథులు

సైదాపురం: మండల పరిధిలోని గ్రామాల్లో ఆదివారం పలు గ్రామాల నుంచి వినాయక విగ్రహాలను నిమజ్జనానికి తరలించారు. ఈ సందర్భంగా సైదాపురం, మొలకలపూండ్ల, చాగణం, మర్లపూడి, కలిచేడు, ఊటుకూరు, తుమ్మలతలుపూరు, పలు గ్రామాల్లో ఉట్టి మహోత్సవాలు నిర్వహించి, డప్పుల వాయిద్యాలతో రంగులు చల్లుకుంటూ యువకులు చిందులు వేశారు. జై బోలో గణేష్ మహారాజ్‌కు జై , గణపతిబొప్ప బోరియా అంటూ కేరింతలు కొడుతూ మండపాల్లో ఏర్పాటు చేసిన వినాయక విగ్రహాలను నిమజ్జనానికి తరలించారు.


కలువాయి: నిమజ్జనంకు తరలివెళుతున్న గణేషుడు


డక్కిలి: సర్పంచు చెంచమ్మను సన్మానిస్తున్న గ్రామస్థులు

గణపయ్యకు వీడ్కోలు

బాలాయపల్లి: వినాయక నిమజ్జనాలను ఆదివారం మండలంలోని పలు గ్రామాల్లో ఘనంగా నిర్వహించారు. మండలంలోని బాలాయపల్లి, అంబలపూడి, నిండలి, సంగవరం, అలిమిలి, వాక్యంతోపాటు పలు గ్రామాలలో స్వామివారి విగ్రహాలను నిమజ్జనానికి తరలించే ముందు ఊరేగించారు. యువకులు చిందులు వేస్తూ తప్పెట్లు తాళాలు నడుమ కోలాహలంగా ప్రజల దర్శనార్థం పురవీధుల మీదుగా సాగాయి. అనంతరం ఆయా గ్రామాలకు అందుబాటులో ఉన్న చెరువులు, కైవల్యనదిలో వినాయక విగ్రహాలను నిమజ్జనం చేశారు.

వినాయక గ్రామోత్సవాలు

రాపూరు: రాపూరులోని వివిధ కూడళ్లు, గ్రామాలలో ఏర్పాటు చేసిన వినాయక విగ్రహాలను ఆదివారం మూడో రోజు నిమజ్జనానికి సందడి వాతావరణంలో తరలించారు. ప్రత్యేకంగా అలంకరించిన వాహనాలలో వినాయకుని ఉంచి గ్రామోత్సవం నిర్వహించారు. తెలుగు గంగ కాలువ, కండలేరు డ్యాంలలో

ప్రభుత్వ పాఠశాలల మనుగడ ప్రశ్నార్థకం

వెంకటగిరి: ప్రైవేట్ పాఠశాలలను రద్దు చేయకుంటే ప్రభుత్వ పాఠశాలల మనుగడ ప్రశ్నార్థకంగా మారే ప్రమాదం ఉందని మాజీ ఎమ్మెల్యే, ఆర్వీఎం హైస్కూల్ కరస్పాండెంట్ సాయికృష్ణ యాచేంద్ర ఆందోళన వ్యక్తం చేశారు. ఆదివారం పాఠశాల ప్రాంగణంలో 1964లో ఆర్వీఎం ఉన్నత పాఠశాలలో ఎస్ఎస్ఎల్‌సి చదివిన పూర్వపు విద్యార్థులు నిర్వహించిన ఆత్మీయ సమావేశానికి ముఖ్య అతిథిగా ఆయన విచ్చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో కార్పొరేట్ స్థాయి వసతులను ప్రభుత్వం కల్పిస్తోందన్నారు. ఉత్తమ విద్యా బోధన చేస్తున్నా విద్యార్థుల తల్లిదండ్రులు కార్పొరేట్ పాఠశాలలపై మోజుతో పిల్లలను ప్రైవేట్ పాఠశాలలకు పంపుతున్నారన్నారు. ప్రభుత్వం పాఠశాలల్లో చదివే విద్యార్థులు పరీక్షల్లో ప్రతిభ కనబరిస్తే వారిని తమ పాఠశాలల్లో, కళాశాలల్లో చేర్చుకునేందుకు కార్పొరేట్ విద్యాసంస్థలు క్యూ కడుతుంటాయని గుర్తుచేశారు. విద్యార్థుల తల్లిదండ్రులు ఈ విషయాలు తెలుసుకోవాలని సూచించారు. ఇప్పటికైనా తమ పిల్లలను ప్రభుత్వం పాఠశాలలలో చేర్పించి వారికి ఉజ్వల భవిత అందించాలని సూచించారు. ప్రభుత్వ బడులలో పిల్లలను చేర్పించి ఉన్నత విద్యా ప్రమాణాలు నెలకొల్పాలని తెలియజేశారు. ఆర్వీఎం ఉన్నత పాఠశాలల్లో చదివిన పూర్వపు విద్యార్థులు అనేక ఉన్నత స్థాయి పదవుల్లో ఉన్నారని గుర్తు చేశారు. అదేవిధంగా ఆ విద్యార్థులు విద్యాబుద్దులు నేర్పిన ఉపాధ్యాయులను గుర్తుంచుకొని వారిని అనేక సందర్భాల్లో సత్కరించడం, పాఠశాల అభివృద్ధికి ఆర్థికసాయం అందజేయడం, పేద విద్యార్థులను ప్రోత్సహించేలా చేపట్టే కార్యక్రమాలు అభినందనీయమని తెలియజేశారు. అనంతరం పూర్వపు విద్యార్థులను అభినందించారు. ఈ సందర్భంగా పదో తరగతి పరీక్షల్లో ప్రతిభ కనపరిచిన విద్యార్థులకు పూర్వపు విద్యార్థులు అందించిన డిక్షనరీలు, నగదు ప్రోత్సాహక బహుమతులను ఆయన చేతుల మీదుగా అందజేశారు. ఈ కార్యక్రమంలో పూర్వపు విద్యార్థుల సంఘ అధ్యక్షులు కుమార స్వామి, చెంగల్‌రాయలు, ప్రస్తుత ఆర్వీఎం ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు శివకుమార్ తదితరులు ఉన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే సాయికృష్ణ యాచేంద్ర

ఆరు గ్రామాల్లో అంధకారం

డక్కిలి : మండలంలో శనివారం రాత్రి కురిసిన భారీ వర్షాలకు ఆరుగ్రామాల్లో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. మండలంలోని డి వడ్డిపల్లి, దేవునివెల్లంపల్లి, కుప్పాయపాళెం, వెంబులూరు, తోపుగానిపల్లి, కమ్మపల్లి గ్రామాల్లో రాత్రి అంతా విద్యుత్ సరఫరా లేకపోవడంతో జనం అల్లాడిపోయారు. డక్కిలిలో గాలులతో కూడిన వర్షం కురవడంతో విద్యుత్‌కు అంతరాయం కలిగిందని ఆదివారం తిరిగి ఆ గ్రామాలకు విద్యుత్‌ను పునరుద్ధరించినట్లు ఏఈ జహీరుద్దీన్ తెలిపారు.

31న డక్కిలి నేతలతో ఎమ్మెల్యే సమావేశం

డక్కిలి : వెంకటగిరిలో ఈ నెల 31వ తేదీన జిల్లా స్థాయిలో నిర్వహించే తెలుగుదేశం పార్టీ సమన్వయ బహిరంగ సభను జయప్రదం చేసేందుకు ఎమ్మెల్యే రామకృష్ణ సోమవారం డక్కిలి మండల నాయకులతో సమావేశం నిర్వహిస్తారని మండల టీడీపీ అధ్యక్షులు పోలంరెడ్డి కోటేశ్వర రెడ్డి అన్నారు. సభను జయప్రదం చేసేందుకు ఎమ్మెల్యే రామకృష్ణ నియోజకవర్గాల వారీగా నాయకులు, కార్యకర్తలతో సమావేశం అవుతున్నట్లు తెలిపారు. టీడీపీ నాయకులు, కార్యకర్తలు విధిగా హాజరు కావాలని కోరారు.